సమాజం గతి నిర్దేశకులపై విశ్లేషణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

: fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

29-3-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 56 పేజీలు: 8+16 వెల: 6.50


## అమెరికా అధ్యక్షుల్లో టాప్ బిలియనీర్ ట్రంప్

5లో

## అరవింద్ కేజ్రీవాల్‌పై మరో కేసు నమోదు



# విలవిల్లాడిన మయన్మార్, థాయ్‌లాండ్

శుక్రవారం మయన్మార్‌లో పలు భవనాలు నేలమట్టమైన దృశ్యం



భూకంప బాధితులకు సహాయకార్యక్రమాలు చేస్తున్న దృశ్యం

- పలుమార్లు భూకంపాలతో రెండు దేశాల్లో తీవ్ర నష్టం
- రిక్టర్ స్కేలుపై 7.7 తీవ్రత
- పలు భవనాలు, వంతెనలు, ఆలయాలు నేలమట్టం
- 150 మంది పైగా మృతి, 700 మంది పైగా గాయాలు

**బ్యాంకాక్, మార్చి 28:** లిప్తపాటు కాలంలోనే రెండుదేశాల్లో తీవ్రస్థాయిలో నెలకొన్న భూకంపాలు అనేక భవనాలను నేలమట్టంచేసాయి. శిథిలాల కింద చిక్కుకున్న ప్రజల ఆర్తనాదాలతో ఆ నగరాలు నిండిపోయాయి. వెయ్యిపడకల ఆసుపత్రి కూడా నిమిషాల్లో కుప్పకూలిపోయింది. ఎంతమంది విగత జీవులయ్యారో కూడా వివరాలు అందనిపరిస్థితి. మైన్మార్, బ్యాంకాక్‌లలో జరిగిన భూకంపాలు తీవ్రత రిక్టర్‌స్కేలుపై 7.7గా నమోదయింది. మైన్మార్‌లో వరుసగా రెండుసార్లు కంపించిన భూమి తీవ్రత ఎక్కువగా ఉంది. వరుసగా మొదటిసారి 6.4, రెండోసారి 7.7స్థాయి తీవ్రతతో ఉన్నట్లు జియలాజికల్ సర్వే అధికారులు ప్రకటించారు. థాయిలాండ్‌రాజధాని బ్యాంకాక్‌లో సంభవించిన భూకంపం తీవ్రత 7.3గా నమోద యింది. భారత్ సహా ఆగ్నేయాసియా దేశాల్లోకూడా ఈప్రభావం కనిపించింది. భూకంపం ధాటికి మైన్మార్‌లో సుమారు 150 మందికిపైగా చనిపోయినట్లు సమాచారం. మైన్మార్‌లో వెయిపడకల ఆసుపత్రి క్షణాల్లో నేలకూలడంతో దట్టమైన మట్టిపొగ ఆవహించింది. దీన్నిచూసి భయ కంపితులైన ప్రజలు ఆప్రాంతం నుంచి పరుగులు తీసారు. బ్యాంకాక్ లోని అత్యంత రద్దీగాఉన్న చౌటుచక్ >>2

## ఉగాది తర్వాత ఎఐ సిటీకి భూమిపూజ

- మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి28:** ఉగాది తర్వాత మహేశ్వరంలో 'ఏఐ సిటీ' నిర్మాణానికి భూమి పూజ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. హైటెక్ సిటీలోని ఐటిసి కోహినూర్‌లో శుక్రవారం 'క్లియర్ టెల్లిజెన్స్' ఇండియా డెలివరీ అండ్ ఆపరేషన్స్ సెంటర్‌ను మంత్రి శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భావి తరాల అవసరాలకు అనుగుణంగా సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా ఫ్యూచర్ సిటీని నిర్మించేందుకు ప్రణాళి >>2

## భారతీయ శక్తిమంతుల జాబితాలో

2లో

## ప్రధాని మోడీ-1 సిఎం రేవంత్ - 28



ప్రధాని మోడీ (1) సిఎం రేవంత్ (28)



అమిత్‌షా (2) రాహుల్‌గాంధీ (9) ముఖేష్ (10) సిఎం చంద్రబాబు (14)



రోహిత్ శర్మ (48) విరాట్ కోహ్లి (72) పవన్ కల్యాణ్ (72) అల్లు అర్జున్ (92)

# పాలమూరుకు జాతీయ హోదా లేనట్లే

## లోక్‌సభలో స్పష్టం చేసిన కేంద్రం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి28:** కృష్ణానదీ జలాలపై తెలంగాణ, ఎపి మధ్య వివాదాలు నెలకొన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ అంశం కోర్టులో ఉంది. ఈ మేరకు పాలమూరు ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలంటూ.. తెలంగాణ ప్రభుత్వం చేసిన ఫిర్యాదును కేంద్రం తిరస్కరించింది. ఈ ప్రాజెక్టు న్యాయ పరమైన చిక్కులు, టెక్నికల్ అంశాలు ఉన్నా యని పేర్కొంది. పాలమూరుకు జాతీయ హోదా కల్పించాలనే అంశాన్ని ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి లోక్‌సభలో లేవనెత్తారు. ఈ మేరకు కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి రాజ్‌భూషణ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను తిరిగి పంపినట్లు లోక్‌సభకు వెల్లడించారు.

# త్వరలో 30 లక్షల రేషన్ కార్డులు

- ప్రధాని ఫోటోపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు..
- క్యూఆర్ కోడ్ మాత్రమే ఉంటుంది
- రేపటి నుంచి సన్నబియ్యం పంపిణీ: మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త :** తెలంగాణలో కొత్తగా 30లక్షల కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రభుత్వం చేయబోతోందనీ దీనితో 85 శాతం జనాభాకు సన్నబియ్యం అందబోతోందని నీటి పారుదల, పౌర సరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం, సివిల్ సప్లయ్ కమిషనర్ చౌహాన్‌తో కలిసి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ..ఉగాది రోజు ముఖ్య మంత్రి సన్న బియ్యం కార్యక్రమం ప్రారంభిస్తారని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సర ఫరా చేసే దొడ్డు బియ్యం చాలా మంది లబ్ధిదా రులు ఉపయోగించుకోవడం లేదని ఉత్తమ్ వివరిం చారు. దొడ్డు బియ్యం కావడంతో డీలర్ల నుంచి బ్లాక్‌లో అక్కడక్కడా అమ్ముకోవడం జరుగుతుంద న్నారు. హుజూర్ నగర నుంచి సన్న బియ్యం పంపిణీ ప్రారంభిస్తున్నామన్నారు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడైనా రేషన్ తీసుకోవడానికి వీలుగా డ్రా సిస్టం అందుబాటులోకి తెస్తున్నామని, ఎంతమందికి కొత్త రేషన్ కార్డులు కావాలన్నా అర్హతను బట్టి ఇస్తున్నామని తెలిపారు.

కొత్తగా ఫిజికల్ రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామన్న మంత్రి కార్డు ఉన్నా లేకున్నా లబ్ధిదారుల లిస్ట్‌లో ఉంటే సన్న బియ్యం ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇస్తామన్నారు. తెలంగాణ ఏర్పాటు నాటికి 89 లక్షల 73వేల 708 కార్డులు ఉంటే గత పదేళ్లలో 49వేల 479 కొత్త కార్డులు ఇచ్చారనీ చెప్పారు.90 లక్షల రేషన్ కార్డులు 2.85 కోట్ల లబ్దిదారులు ప్రస్తుతం ఉన్నారనీ గణాంకాలతో సహా వివరిం చారు. రూ.10,665 కోట్ల నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఖర్చు చేస్తున్నాయని అన్నారు. త్వరలోనే బియ్యంతో పాటు పప్పు, ఉప్పు లాంటి వస్తువులు ఇస్తామన్నారు.






శుక్రవారం ఉదయం తీవ్రస్థాయిలో వచ్చిన భూకంపానికి మయన్మార్, థాయిలాండ్‌లో పలుచోట్ల భవనాలు ధ్వంసమైన దృశ్యాలు.





క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న దృశ్యం

# మయన్మార్, థాయ్‌లాండ్

మార్కెట్‌లో ఈ భవనం కూలిందని, తమ బృందాలు తక్షణమే అక్కడకు చేరుకుని రక్షణ చర్యలు ప్రారంభించినట్లు ఉన్నతాధికారి చెప్పారు. రిక్టర్ స్కేలుపై 6.4తీవ్రతతో రావడంతో ప్రజలను నివాసాలనుంచి ఖాళీచేయించారు. థాయిలాండ్ భూకంపంలో నలుగురు మృతిచెందారని, 700 మందికిపైగా గాయపడినట్లు ప్రభుత్వం ప్రకటించింది. చైనాలోకూడా ఈ భూప్రకంపనలు సంభవించాయి. మైన్మార్‌లో భూకంపం 10 కిలోమీటర్ల లోతున సంభవించిందని అమెరికా జియలాజికల్‌సర్వే, జర్మనీ జిఎఫ్‌జడ్ కేంద్రాలు వెల్లడించాయి. దేశంలోని రెండో అతిపెద్ద నగరం మందాలై ఈభూకంప ప్రాంతానికి సమీపంలో ఉంది. మాజీ రాయల్‌పేలస్ భవనాలు ధ్వంసం అయ్యాయి.భూకంపాలు తరచూ వస్తుండటంతో ఎక్కువశాతం భవనాలు తక్కువ అంతస్తుల్లోనే నిర్మించుకుంటుంటారు. 90 ఏళ్ల నాటి వంతెన కూడా కూలిపోయింది. మైన్మార్ అతిపెద్దనగరం యాంగాన్‌లో కూడా అధికశాతం భవనాలు బీటలు వారాయి. కొన్ని దెబ్బతిని కూలిపోయాయి. మైన్మార్ రాజధాని నాయ్‌పైతాలో కూడా మతపరమైన భవనాలకు భూకంపప్రభావం ఒత్తిడి ఆకాశహర్మ్యాలు అధికంగా ఉన్న బ్యాంకాక్‌లో నివాసితులు ఎత్తయిన ప్రాంతంలో ఉండటానికి ఇష్టపడుతుంటారు. థాయిలాండ్ ప్రధానమంత్రి పేతోంగ్‌తార్న్ షినవత్రా అత్యవసర సమావేశం నిర్వహించి భూకంప ప్రభావంపై తక్షణ చర్యలుచేపట్టాలని ఆదేశాలు జారీచేసారు. రెండుదేశాల్లోనూ ఈభూకంప ప్రకంపనల ధాటికి పలు భవంతులు నేలమట్టం అయ్యాయి. ఒక భారీ భవంతిపై అంతస్తులో ఉన్న స్విమ్మింగ్‌పూల్‌లోని నీరు కిందకుపడిపోయిన దృశ్యాలు వైరల్ అయ్యాయి నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనం పేకమేడలా కూలిపోయింది. మొత్తం 43 మంది కార్మికులు ఈభవనం శిథిలాలకింద చిక్కుకున్నట్లు అంచనా. బ్యాంకాక్ భూకంప ప్రభావంతో థాయిలాండ్ ప్రధాని బ్యాంకాక్‌లో అత్యవసరపరిస్థితిని ప్రకటించారు. నగరంలో మెట్రోరైలు సేవలు నిలిపివేసారు. అనేకభవనాలకు పగుళ్ల ఏర్పడటంతో ఉద్యోగులు, ప్రజలు వాటిలోకి వెళ్లేందుకు భయపడుతున్నారు. ఇప్పటికీ ప్రజలు వీధుల్లోనే ఉన్నారు. బ్యాంకాక్‌లో కూలిపోయిన భారీభవనం కింద సుమారు 320 మందివరకూ పనివారున్నట్లు అంచనా. ఇక మైన్మార్‌లో అయితే రాజధాని నాయ్‌పైథాలో ప్రధాన రహదారులు ప్రకంపనలకు చీలిపోయాయి. మాండలేప్రాంతంలో ప్రాణనష్టం అధికంగా ఉంటుందనిఅధికారులు చెపుతున్నారు. రెండేళ్లక్రితం మైన్మార్‌లో వచ్చిన భూకంపం కారణంగా 53 వేలమందిప్రాణాలు కోల్పోయారు. ఈసారి కూడా అదే తీవ్రతతో రావడంతో ప్రాణనష్టం భారీగా ఉంటుందని అంచనా. రాజధానిలో కూలిన వెయ్యిపడకల ఆసుపత్రితోపాటు మాండలే నగరంలోని ఐకానిక్ వందేళ్లబ్రిడ్జి, ఎత్తయిన ఆలయాలు, గోపురాలు భూకంప తీవ్రతకు కుప్పకూలాయి. బ్యాంకాక్‌లో నిర్మాణంలో ఉన్న ఎత్తయిన వంతెన కూలి 100మందికిపైగా గల్లంతయ్యారని థాయిలాండ్ రక్షణ మంత్రి వెల్లడించారు. ఇక మైన్మార్‌లోని మాండలే నగరంలో అనేకభవనాలు కూలిపోయాయి. 13 మందిమృతిచెందితే 300 మందికిపైగా గాయపడినట్లు అధికారులు చెప్పారు.

ప్రపంచంలో భూకంపాలు అత్యధికంగా సంభవించే దేశాల్లో మైన్మార్‌కూడా ఉంది. ఇండియన్ టెక్టానిక్ ప్లేట్, బర్మా మైక్రోప్లేట్‌మధ్య సుమారు 1200 కిలోమీటర్లప్రదేశం ఉంది. ఇక్కడ అనేకపర్యాయాలు భూకంపాలు సంభవించాయి. గత వందేళ్లలో మైన్మార్‌లో ఆరు తీవ్రకంటే ఎక్కువగా 14 భూకంపాలు వచ్చినట్లు బ్రిటిష్ జియలాజికల్ సర్వే కేంద్రం శాస్త్రవేత్త బ్రియాన్ బాప్టై వెల్లడించారు. శుక్రవారం ఒక్కరోజే ఆరుభూకంపాలు నమోదయిందని నేషనల్‌సెంటర్‌ఫర్ సిస్మాలజీ ప్రటించింది. 7.7 తీవ్రత ఎక్కువ ఉందని, అతి తక్కువగా 4.3 తీవ్రతతో నమోదయినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. రెండేళ్లక్రితం తుర్కియే, సిరియాల్లో సంభవించిన భూకంపం ఇదే తీవ్రత అంటే 7.8 తీవ్రతతోనే నమోదయింది. అయితే వాటిలో 53వేలమందికిపైగా ప్రాణాలు కోల్పోయారు.

**స్పందించిన భారత్, తోడుగా ఉంటాం: ప్రధానిమోడీ**

మైన్మార్, థాయిలాండ్ దేశాలను వరుసభూకంపాలు వణికించిన భూప్రళయంపై ప్రధాని నరేంద్రమోడీ స్పందించారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో రెండు దేశాలకు భారత్ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. భూకంప ప్రభావంపై ఎంతో ఆందోళనగా ఉందని, అక్కడి ప్రజలంతా సురక్షితంగా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు మోడీ తెలిపారు. వారికి అవసరమైన సాయం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని, సహాయక చర్యలపై ఆదేశ ప్రభుత్వాలతో నిరంతరం సంప్రదింపులు జరపాలని కేంద్ర విదేశాంగశాఖను కోరినట్లు తెలిపారు. అంతేకాకుండా ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను కూడా ప్రారంభించినట్లు విదేశాంగ శాఖ ప్రకటించింది.

## భారత్‌లోను మయన్మార్ భూ ప్రకంపనలు

**న్యూఢిల్లీ, మార్చి 28:** భారత్‌కు పొరుగుననే ఉన్న మైన్మార్‌లో శక్తివంతమైన భూకంపం ఆదేశాన్ని వణికించిన సంగతి తెలిసిందే. రిక్టరు స్కేలుపూ 7.7, ఆతర్వాత 6.4తీవ్రతతో నిమిషాల వ్యవధిలోనే రెండు భూకంపాలు వచ్చాయి. ఈ భూకంపం ధాటికి థాయిలాండ్,చైనాల్లో కూడా ప్రకంపనలు వచ్చాయి. భారత్‌లోని పలు ప్రాంతాల్లోనూ భూమి కంపించింది. దేశరాజధాని ఢిల్లీ, ఎన్సీఆర్, కోల్‌కత్తాలతోపాటు ఈశాన్యరాష్ట్రాల్లో స్వల్పస్థాయిలోభూప్రకంపనలు సంభవించాయి. ఢిల్లీ, ఘజియాబాద్, నోయిడా, మేఘాలయ, కోల్‌కత్తా, మణిపూర్‌లోని ఇంఫాల్‌లో భూప్రకంపనలు నమోదయ్యాయి. మేఘాలయ ఈస్ట్‌గారోహిల్స్‌లో 4.4తీవ్రతతో భూమి కంపించిందని నేషనల్ సిస్మోలజీ సెంటర్‌ప్రకటించింది. ఈ ప్రకంపనలతోప్రజలు ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. ఏంజరుగుతోందో అన్న టెన్షన్‌తో ఇళ్లు కార్యాలయాలనుంచి రోడ్లపైకి పరుగులుతీసారు.

## నేడు అరుదైన సంపూర్ణ సూర్యగ్రహణం

### భారత్‌లో కనిపించదు

**హైదరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త:** శనివారం నాడు ఫాల్గుణ మాస అమావాస్య రోజున అరుదైన సూర్య గ్రహణం సంభవించనుంది. అయితే ఈ సూర్య గ్రహణం ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, కెనడా, ఐరోపా, ఆఫ్రికా సహా కొన్ని పశ్చిమ దేశాలలో కనిపించనుంది. భారత కాలమానం ప్రకారం శనివారం సూర్యాస్తమయం అయిన తరువాత ఈ గ్రహణం ఏర్పడుతుండడంతో భారత్ సహా ఆసియా దేశాలలో ఈ సూర్య గ్రహణం కనిపించదు. ఫాల్గుణ అమావాస్య రోజున సూర్య గ్రహణం సంభవించడం ఆది కూడా సంపూర్ణ సూర్య గ్రహణం కావడం అరుదైనదిగా ఆగమన పండితులు చెబుతున్నారు.

చంద్రుడు ఉత్తరాభాద్ర నక్షత్రం మీన రాశిలో వుండగా సూర్యుడు, చంద్రుడు, రాహు వులు మీన రాశిలో సంచరించే సమయంలో రాహుగ్రస్త సంపూర్ణ సూర్య గ్రహణం ఏర్పడుతోంది. భారత కాలమానం ప్రకారం రాత్రి వేళలో ఈ సూర్య గ్రహణం ఏర్పడుతున్నందున దీని ప్రభావం భారత్‌లో వుండదని ఆగమన పండితులు చెబుతున్నారు.

సూతకాల ప్రభావం కూడా భారత్‌లో వుండదని, ఆలయాలు యధా విధిగా తెరిచివుంటాయని, పూజాధికాలు ఎప్పటి లాగే కొనసాగుతాయని వారు వెల్లడించారు. అయితే సూర్య గ్రహణం కనిపించే దేశాలలో వుండే భారతీయులు మీన, కన్య, మేష, సింహ, ధనుస్సు, రాశుల వారయితే ఈ గ్రహణం చూడరాదని ఆగమన పండితులు తెలిపారు. వృషభం, మిథునం, తుల రాశి వారికి ఈ గ్రహణం అనుకూల ఫలితాలు ఇస్తాయని వారు తెలిపారు. మిగిలిన రాశుల వారికి మిశ్రమ ఫలితాలు ఇస్తాయని వారు వెల్లడించారు.

## భారతీయ శక్తిమంతుల జాబితాలో ప్రధాని మోడీ-1, సిఎం రేవంత్ - 28

### ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ - 2025 సర్వే

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి28:** తన పరిపాలనా నైపుణ్యం.. ప్రభావంతమైన రాజకీయంతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత శక్తిమంతమైన నాయకునిగా నిలిచారు. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ 2025 సంవత్సరానికి సంబంధించి దేశంలోని వివిధ రంగాల్లో అత్యధిక శక్తిమంతులైన 100 మంది ప్రముఖులతో జాబితా విడుదల చేసింది. ఈ జాబితాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 28వ స్థానం దక్కించుకున్నారు. 2024 సంవత్సరపు జాబితాలో 39 స్థానంలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏడాది కాలంలోనే ఏకంగా 11 స్థానాలు ఎగబాకి 28వ స్థానానికి చేరుకోవడం విశేషం. దేశంలో రాజకీయ, వ్యాపార, క్రీడా, వినోద రంగాల్లో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తులు ఈ జాబితాలో ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర పాలనలో తీసుకువచ్చిన మార్పులు, వ్యూహాత్మక రాజకీయ కార్యకలాపాలు, దేశవ్యాప్తంగా ఇండియా కూటమిలో పోషిస్తున్న ప్రముఖమైన పాత్రతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ గుర్తింపు లభించింది.తనదైన దూకుడుతో భారత రాజకీయాల్లో ఆయన చూపుతున్న ప్రభావం, నాయకత్వ లక్షణాలతో ఆయన ర్యాంకు మెరుగుపడింది. ఒక ప్రాంతీయ నాయకుడినే కాకుండా దేశంలోనే అత్యంత శక్తిమంతమైన, చురుకైన ముఖ్యమంత్రుల్లో ఒకరిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిర్భవించారు.ఈ జాబితాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇండియా కూటమిలోని ఇతర ప్రముఖులైన సీఎంల సరసన నిలిపింది. ప్రాంతీయ అవసరాలను జాతీయ ప్రాధాన్యతలతో సమన్వయం చేయగలిగిన మేధో సంపత్తి, వ్యూహాత్మక దృక్పథం రేవంత్ రెడ్డిని కీలక నాయకునిగా నిలిపేలా చేశాయి. రైతు కుటుంబాలకు రూ.21వేలకోట్ల రుణ మాఫీ చేయడం, క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వడం, మహిళా స్వయం సహాయక సంఘాలకు సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంక్‌లు, ప్రీమియం రిటైల్ స్టోర్ల వంటి వ్యాపార అవకాశాలను కల్పించడం, యువతను నిపుణులుగా తీర్చిదిద్దే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, ట్రాఫిక్ పోలీస్ విభాగంలో ట్రాన్స్‌జెండర్‌ల నియామకం వంటి అనేక విధానపరమైన వినూత్న నిర్ణయాలు దేశవ్యాప్తంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజాదరణ పెరగడానికి కారణమయ్యాయి. నియోజకవర్గాల పునర్విభజనపై చెన్నై సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి వ్యక్తం చేసిన దృఢమైన అభిప్రాయాలు కూడా ఆయనకు జాతీయ స్థాయిలో ప్రాధాన్యం దక్కేలా చేశాయి. పారదర్శకమైన పాలన, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కట్టుబడినందునే అత్యంత శక్తిమంతుల జాబితా-2025లో సిఎం రేవంత్‌రెడ్డికి గుర్తింపు లభించిందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ అన్నారు. ఈ గుర్తింపుతో దేశ, తెలంగాణ ప్రజల పట్ల ముఖ్యమంత్రి గారి బాధ్యతను మరింత పెంచిందని ఆయన పేర్కొన్నారు. భారతీయ శక్తిమంతులైన జాబితాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చోటు లభించడం భారత రాజకీయాల్లో కీలక మార్పునకు సంకేతమని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ప్రాంతీయ నేతలు ఇప్పుడు జాతీయ విధానాల రూపకల్పనలో మరింత ప్రభావం చూపుతున్నారనడానికి ఇదే నిదర్శమని వారు పేర్కొన్నారు.

**మరోసారి అగ్రస్థానంలో నిలిచిన ప్రధాని మోడీ, ర్యాంకింగ్‌లో చంద్రబాబు,పవన్‌లకు కూడా చోటు**

మోస్ట్ పవర్‌ఫుల్ ఇండియన్స్ జాబితాలో ప్రధాని నరేంద్రమోడీ మరోసారి టాప్‌లో నిలిచారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ రూపొందించిన 2025 టాప్ 100 ఇండియన్ ప్రభావశీలుర జాబితాలో ప్రధాని ఫస్ట్ ప్లేస్‌లో నిలిచారు.జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత చరిత్రాత్మకంగా మూడోసారి కేంద్రంలో ప్రధానిగా పగ్గాలు చేపట్టడం ఆయన పట్ల ప్రజాధారణ తగ్గకుండా చేసిందని ఈ నివేదిక పేర్కొన్నది. రెండో స్థానంలో అమిత్‌షా,మూడో స్థానంలో కేంద్ర మంత్రి జైశంకర్,నాలుగో స్థానంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ నిలవగా లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ 9వ స్థానంలో నిలిచారు. తెలుగు రాష్ట్రాల నుంచి తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి,ఏపి సిఎం చంద్రబాబునాయుడు,ఏపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసి,టాలీవుడ్ స్టార్ అల్లు అర్జున్ మినహా మిగతా తెలుగువారి ఎవరికీ చోటు దక్కలేదు. గత ఏడాది ఈ జాబితాలో చోటు దక్కించుకోని ఏపి సిఎం నారా చంద్రబాబునాయుడు ఈసారి 14వ స్థానంలో నిలిచారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఓడించటానికి కూటమి అవసరమని గ్రహించిన చంద్రబాబు 2024 అసెంబ్లీ,లోక్‌సభ ఎన్నికల్లో జనసేన,బిజెపితో పొత్తు పెట్టుకుని విజయం సాధించారు. మళ్లీ జాతీయ రాజకీయాల్లో కీలక మిత్రపక్షంగా నిలిచారు. స్వర్ణాంధ్ర-2047ను అమలు చేయడం. సూపర్ 6 హామీలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఈ నిదేవిక పేర్కొన్నది. ఏపీ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ గత ఏడాది ఈ జాబితాలో చోటు లేకపోయినా ఈసారి 73వ స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో తెలంగాణ,ఏపీ తాజా మాజీ సిఎంలు కెసిఆర్,జగన్‌కు చోటు దక్కలేదు. అలాగే కెటిఆర్,లోకేశ్‌కు సైతం స్థానం దక్కలేదు. టాలీవుడ్ యాక్టర్ అల్లు అర్జున్ జాబితాలో 92వ స్థానంలో నిలిచారు. క్రికెటర్లలో రోహిత్‌శర్మ 48,విరాట్ కోహ్లీకి 72 స్థానం దక్కించుకున్నారు. అలియా బట్ 100వ స్థానంలో ఆఖరులో నిలిచారు.వీరితో పాటు 10,11వ స్థానాల్లో ముకేశ్ అంబానీ,గౌతం ఆదానీలు నిలిచారు.

## ఏఐ సిటీకి భూమిపూజ

>> కలు రూపొందించామన్నారు. ఇక్కడే 200 ఎకరాల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఏఐ సిటీని నిర్మిస్తామన్నారు. ఈ సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే అనేక టెక్ దిగ్గజ సంస్థలు ఆసక్తి వ్యక్తం చేశాయన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలకు ధీటుగా ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో తెలంగాణ హబ్ గా మారుతుందన్నారు. డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో ఇప్పటికే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలను ప్రారంభించామని, త్వరలోనే 'క్వాంటం కంప్యూటింగ్'లోనూ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. టెక్నాలజీ అంటేనే ప్రపంచం హైదరాబాద్ వైపు చూసేలా చేయడమే తమ లక్ష్యమన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక మంది పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని, వారికి ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. పారిశ్రామిక వేత్తలు ఎదిగితే, రాష్ట్రం కూడా వృద్ధి చెందుతుందన్నారు. ప్రతిభ గల యువతే తెలంగాణకున్న అతి పెద్ద ఆస్తి అన్నారు. రోజురోజుకీ మారుతున్న టెక్నాలజీ కారణంగా అనేక సవాళ్లు తలెత్తుతున్నాయని, వాటికి పరిష్కారాలను కనుక్కొనేందుకు కొత్తగా ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఏఐ, డేటా ఇంజనీరింగ్, బిజినెస్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ సొల్యూషన్స్ తదితర రంగాల్లో సేవలు అందించే 'క్లియర్ టెల్లిజెన్స్' సంస్థ తమ ఇండియా శాఖను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

## ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ వేగవంతం చేయాలి

### బేస్‌మెంట్ పూర్తయిన ఇళ్లకు తక్షణమే చెల్లింపులు

### జూన్ చివరినాటికి వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులు పూర్తికావాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, మార్చి 28 ,ప్రభాతవార్త :** పైలట్ గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, బేస్‌మెంట్ పూర్తయిన ఇండ్లకు తక్షణం చెల్లింపులు జరపాలని వరంగల్ జిల్లా ఇన్ ఛార్జి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో వరంగల్ స్మార్ట్ సిటీ పనులు వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, త్రాగునీరు,ఇందిరమ్మ ఇళ్లు తదితర అంశాలపై పంచాయితీ రాజ్ శాఖమంత్రి సీతక్క, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డితో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా శాసనసభ్యులు, కలెక్టర్లు తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఈ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతా అంశమని దీనిని దృష్టిలో పెట్టుకొని కలెక్టర్లు పనిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ప్రభుత్వం నాలుగు విడతలలో చెల్లింపులు చేస్తుందని, మొదటి విడతలో బేస్ మెంట్ లెవెల్ పూర్తయిన ఇండ్లకు లక్ష రూపాయిలు ఇస్తుందని, బేస్ మెంట్ పూర్తయిన ఇళ్ల వివరాలను హౌసింగ్ విభాగానికి పంపిస్తే తక్షణమే చెల్లింపులు చేస్తామన్నారు.ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో ఇండ్ల స్థలాలు లేని అర్హత కలిగిన లబ్దిదారులకు ఇప్పటివరకు కేటాయించని 2 బిహెచ్‌కే ఇండ్లను కేటాయించాలని అలాగే మొండి గోడలతో ఉన్న ఇండ్లను పూర్తిచేయడానికి కాంట్రాక్టర్ ముందుకు రానిపక్షంలో లబ్దిదారులే ఆ ఇండ్లను పూర్తిచేసుకోవడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని లబ్దిదారులను ఎంపిక చేసి ఇండ్లను కేటాయించాలని సూచించారు. వేసవి కాలంలో ఏ గ్రామంలో పట్టణంలో గానీ త్రాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని, ప్రధానంగా జిల్లా కలెక్టర్లు ఈ అంశానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అధికారులతో సమన్వయం చేసుకొని వారంలో3 రోజులు గ్రామాల్లోపర్యటించాలన్నారు. రానున్న వచ్చే3 నెలలు చాలా కీలకమని ప్రజలకు ఎక్కగా త్రాగునీటి గురించి ఇబ్బంది కలగకుండా నీళ్లు రావడం లేదన్న విమర్శ రాకుండా పనిచేయాలన్నారు.నీటికొరత ఉన్న ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా త్రాగునీరు సరఫరా చేయడం, చెడిపోయిన బోర్లు,హ్యాండ్ పంప్ లను తక్షణం మరమ్మతులు చేపట్టాలని సూచించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవన నిర్మాణ పనులను రెండు నెలల్లో పూర్తిచేసి ఆ తర్వాత మరో నెలరోజుల్లో వైద్య సేవలకు అవసరమైన పరికరాలనుఅమర్చి జూన్ చివరినాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 29-03-2025, శనివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
అమావాస్య సా.4.28
ఉత్తరాభాద్ర రా.7.26
వర్జ్యం ఉ.6.40-8.05,
2) తె.6.00-7.25
దు.ఉ.6.13-7.50
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. నూతన విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**వృషభం :** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. బంధువు లను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు.

**మిథునం:** రుణబాధలు ఎదురైన నిదానంగా తీరుస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. ప్రయాణాలు.

**కర్కాటకం:** బంధువులతో ఏర్పడిన తగాదాలు పరిష్కరించుకుంటారు. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

**సింహం:** అనుకోని అవకాశాలు లభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకోండి. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**కన్య :** వనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. సన్నిహితుల నుండి సహాయ సహకారాలు అందిస్తారు.

**తుల :** చేపట్టిన కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. ఇంటా బయటా అనుకూలంగా వుంటుంది. వాహనాలు కొనుగోలు.

**వృశ్చికం:** బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. ప్రయాణాలు లాభిస్తాయి. వస్తువుల కొనుగోలు చేస్తారు.

**ధనుస్సు:** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**మకరం:** చర్చాగోష్ఠులలో పాల్గొంటారు. నూతన ఉద్యోగావకాశాలు పొందుతారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**కుంభం:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు. వాహనాలు కొనుగోలు చేస్తారు.

**మీనం :** ముఖ్యమైన వ్యవహారాలు సకాలంలో పూర్తి చేస్తారు. నూతన పరిచయాలు పెరుగుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## రేపు రవీంద్రభారతిలో ఉగాది వేడుకలు

**హైదరాబాద్,మార్చి 28,ప్రభాతవార్త:** ఆదివారం ఉదయం 10 గంటలకు రవీంద్ర భారతిలో 'శ్రీ విశ్వవసు'నామ ఉగాది వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. ఈఅంశంపై శుక్రవారం రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ కార్యాలయంలో ఉగాది వేడుకల నిర్వహణ గురించి వివిధ శాఖల అధికారులతో దేవాదాయ ధర్మాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం జారీ చేసిన అనుమతి, నిబంధనలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖ,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉగాది పంచాంగ శ్రవణం ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు. భాషా సాంస్కృతికశాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో నిర్వహించే శ్రీ విశ్వావసునామ ఉగాది వేడుకలలో పాల్గొనాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఆ 400 ఎకరాలు అమ్మడాన్ని వ్యతిరేకిస్తున్నా: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి28:** కంచే-గచ్చిబౌలిలో 400 ఎకరాల ప్రభుత్వ భూమిని అమ్మేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, దీనిని తాను వ్యతిరేకిస్తున్నానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ స్పష్టం చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన సోషల్ మీడియా వేదికగా తన నిరసనను వ్యక్తం చేశారు.ఈ భూమిని అమ్మడం ద్వారా పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లు తుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటనను కెటిఆర్ తప్పుబట్టారు. ఆ భూమిలో ఎటువంటి జంతువులులేవని సిఎంచేసిన ప్రకటన వాస్తవం కాదని అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ (హెచ్ సీయూ) ప్రాంగణంలో 700లకు పైగా పుష్ప వృక్ష జాతులు, ఇంకా 200లకు పైగా పక్షి జాతులు నివసిస్తున్నాయన్నారు.

## ఖరీఫ్‌సీజన్‌లో పౌష్టిక ఎరువుల సబ్సిడీకి కేంద్రం ఆమోదం

### ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీకి కేబినెట్ గ్రీన్‌సిగ్నల్

**న్యూఢిల్లీ, మార్చి 28:** ప్రధాని నరేంద్రమోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు రెండుశాతం డిఎను పెంచడంతోపాటు పలు ప్రాజెక్టులకు కూడా ఆమోదం తెలిపింది. అలాగే ఖరీఫ్ పంటలకు పౌష్టిక ఉత్పత్తుల ఆధారిత సబ్సిడీని కూడా ఆమోదించింది. అంటే ఏప్రిల్ ఒకటవ తేదీనుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకూ ఉన్న పంటల కాలంలో ఫాస్ఫేటిక్, పొటాష్ ఎరువులపై సబ్సిడీలను కూడా ప్రకటించింది. వీటితోపాటే బీహార్‌లోని పాట్నా అర్రాససారామ్ కారిడార్ 120.10 కిలోమీటర్ల రోడ్డును నాలుగులేన్ల గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్ రహదారిగా మార్చేందుకు హైబ్రిడ్ యాన్యుటీ మోడ్‌లో (హామ్) నిర్మించేందుకు ఆమోదం తెలిపింది. అలాగే కోసి మెచి అంతర్‌రాష్ట్ర లింక్‌ప్రాజెక్టుకు కూడా ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి కృషి సించయ్ యోజన కింద సమ్మృకృత సాగునీటి ప్రయోజనాల పథకం కింద కోసిమెచీ అంతర్‌రాష్ట్ర లింక్‌ప్రాజెక్టును చేపటడుతున్నట్లు వెల్లడించింది. కేబినెట్ ఎలక్ట్రానిక్స్ రంగంలో ఆత్మనిర్భర్ సాధించేందుకువీలుగా ఎలక్ట్రానిక్ విడిభాగాల ఉత్పత్తి పథకానికి కూడా ఆమోదం తెలిపింది. కాగా బీహార్‌లోని మొదటి ప్రాజెక్టు 3712.40 కోట్లు వ్యయం అవుతుండగా,కృషి సించయ్‌యోజన పథకం కింద చేపట్టే ప్రాజెక్టుకు 6282.32కోట్లు వ్యయం అవుతున్నది. ఈ మొత్తంలో కేంద్రసాయం బీహార్‌కు 3652.66 కోట్లు మార్చి మాసాంతానికే పూర్తవుతుందని తేలింది. ఈపథకం పూర్తి అయితే ఖరీఫ్‌సీజన్‌లో మొత్తం 2,10,516 హెక్టార్ల భూమి సాగులోకి వస్తుంది. అరారియా, పూర్ణియా, కిషన్‌గంజ్, కతిహార్ జిల్లాలో మరింత ఆయకట్టుపెరుగుతుంది. ఈప్రాజెక్టుద్వారా 2050 మిలియన్ క్యూబిక్‌మీటర్ల కోసి జలాలను మహానంద కమాండ్‌నుంచి బదలాయించుకునే సదుపాయం కలుగుతుంది. అలాగే ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ వ్యవస్థను ప్రోత్సహించడంవల్ల సుమారు 59,350 కోట్లపెట్టుబడులు సమకూర్చుకోవచ్చని కేబినెట్ అంచనావేసింది. సుమారు 4,56,500కోట్ల విలువైన ఉత్పత్తులను తయారుచేసే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ఖరీఫ్‌కాలంలో ఎన్బీఎస్ సబ్సిడీ 37,216.15కోట్లు మంజూరుకు ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా పిఅండ్‌కెఎరువులుసబ్సిడీరేట్లపై పొందేందుకు వీలవుతుంది. ఖరీఫ్‌సీజన్‌కు 37,216.15 కోట్లు ఆమోదించినకేబినెట్ గత రబీసీజన్ 13వేల కోట్లకంటే ఎక్కువ మంజూరు చేసింది.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2% డిఎ పెంపు

**న్యూఢిల్లీ, మార్చి 28:** కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు రెండుశాతం కరవు భత్యంపెంచుతున్నట్లు కేంద్రం ప్రకటించింది. మూల వేతనానికి ఈ డిఎను 53శాతంవరకూ పెంచింది. ఇపుడు తాజా పెంపుతోమూల వేతనంలో 55శాతంకు డిఎ పెరిగినట్లయింది. 8వ పేకమిషన్ ఏర్పాటు కొత్తజీతాల వచ్చే సందర్భంలో అంతకుముందే కేంద్ర కేబినెట్ రెండుశాతం డిఎ పెంపును ఆమోదించింది. ఈ పెంపుతో డిఎ ఇపుడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 55శాతంగా నిలుస్తుంది. ధరలపెరుగుదలకు అనుగుణంగా ద్రవ్యోల్బణం పరిగణనలోనికి తీసుకుని ఈ డిఎను కేంద్రంపెంచుతూ వస్తుంది. గత ఏడాది అక్టోబరులోనే 3శాతం పెంచింది. దీనితో గత ఏడాది 53శాతానికి డిఎపెరిగింది. ఇపుడు రెండుశాతంతో మొత్తం మూలవేతనంతోపాటు అదనంగా బేసిక్‌పేకు 55శాతం మేర డిఎ పెంచుతున్నట్లు తేలింది. ఈ ఏడాదిజనవరిలోనే కేంద్రం 8వ పేకమిషన్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఈకమిటీకి ఛైర్మన్; కనీసం ఇద్దరుసభ్యులను నియమించాల్సి ఉంది. డిఎ, డిఆర్‌లు ద్వైవార్షికపద్ధతిలో సవరణ జరుగుతుంది. పేకమిషన్ చర్చలు సంప్రదింపులకు ముందుగానే ఈ డిఎ, డిఆర్‌ల చేర్పు ఉంటుంది. ఉద్యోగ సంఘాలు ఈ రెండు విభాగాలను బేసిక్ వేతనంతో కలసాలని 8వ పేకమిషన్ నివేదికకు ముందుగానే జరగాలని కోరుతున్నాయి. ఐదో పే కమిషన్‌కింద బేసిక్‌పేతో డిఎను కలపాలన్న సిఫారసు ఉంది. డిఎ 50శాతం దాటితో వేతనంలో కలపాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. ప్రభుత్వ సమీకృత డిఎతో బేసిక్‌పే 2004లో వచ్చింది. ఆ తర్వాత ఈ విధానాన్ని నిలిపివేసారు. ఆరు,ఏడు పేకమిషన్లు నివేదికలు వచ్చాక మళ్లీ అమలుకు రాలేదు. ప్రస్తుత డిఎ పెంపువల్ల 53 లక్షలమంది ప్రభుత్వ ఉద్యోగులు, 65 లక్షలమందికిపైగా ఉన్న పింఛన్‌దార్లకు మేలుజరుగుతుందని అంచనా.

## ప్రాణం తీసిన ప్రేమ!
# యువకుని గొడ్డలితో నరికి చంపిన యువతి తండ్రి


సాయికుమార్ (ఫైల్)

### ముప్పిరితోట గ్రామంలో విషాదఛాయలు
### పోలీస్ బందోబస్తు మధ్య అంత్యక్రియలు

**ప్రభాతవార్త, ఎలిగేడు:** ప్రేమ వ్యవహారంతో ఎలిగేడు మండలం ముప్పిరితోటలో పూరెల్ల సాయి కుమార్ (17)పై గ్రామానికి చెందిన యువతి తండ్రి గురువారం రాత్రి గొడ్డలితో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు సుల్తానాబాద్ సిఐ సుబ్బారెడ్డి, ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. ముప్పిరితోటకు చెందిన పూరెల్ల పరశురాము లుగౌడ్, జోత్స్నకు కొడుకు, కూతురు ఉన్నారు. సాయి కుమార్ చదువు మానేసి తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. ఇదే గ్రామానికి చెందిన ఓ యువతితో రెండేళ్ల నుండి ప్రేమలో ఉన్నాడు. యువతి ఇంట్లో తెలిసి గొడవలు జరిగాయి. సాయికుమార్‌తో తిరగవద్దని తండ్రి, తల్లి అమ్మాయికి ఎంత చెప్పినా వినకపోగా రోజూ ఫోన్‌లో మాట్లాడడం, కలిసి తిరగ డంతో పగను పెం చుకున్న తండ్రి సదయ్య.. సాయి కుమార్ తన స్నేహితులతో కలిసి శ్రీవెంకటేశ్వరస్వామి దేవా లయం వద్ద పుట్టిన పుట్టినరోజు జరుపు కుంటుండగా తన వాహనంపై దేవాలయ వద్దకు వెళ్లి గొడ్డలితో మెడపై నరకడంతో పరుగెడు తుడుతున్న ప్పటికీ వెంబడించి గ్రామ కూడలి వద్ద మళ్లీ గొడ్డలితో నరకడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తమ కళ్లముందే మృతి చెందడంతో తల్లిదండ్రులు రోదించారు. పోలీసు బందోబస్తు మధ్య అంత్యక్రి యలు పూర్తి చేశారు. గ్రామంలో ఎలాంటి అవంచనీయ సంఘటనలు జరగకుండా టికెట్లు ఏర్పాటు చేసి బందో బస్తు ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి పెద్దపెల్లి ఎసిపి గజ్జి కృష్ణ సుల్తానా బాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతుని తల్లి దండ్రులను హత్యపై అన్ని వివరాలు సేకరించారు. మృతుని తండ్రి పరశు రాములుగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# సైబర్ నేరాల బాధితులకు రూ.183 కోట్ల అందజేత
### భారీగా సిమ్‌కార్డులు, ఐఎంఎఇ, వెబ్‌సైట్ల బ్లాక్

**హైదరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సైబర్ నేరగాళ్ల బారినపడి భారీగా నగదు పోగొట్టుకున్న బాధితులకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో గత ఏడాది (2024 ) 183 కోట్ల రూపాయలను అందజేసింది. ఈ నగదును నేరగాళ్ల బ్యాంకుల ఖాతాల నుంచి అధికారులు జప్తు చేశారు. అనంతరం న్యాయపరమైన అంశాలు పరిష్కార ం అయిన తరువాత విడతల వారిగా ఈ నగదును బాధితులకు ఆయా ప్రాంతాల పోలీసుల చేత అందేలా చూశారు. ఇక సైబర్ నేరాలలో కీలకంగా వున్న సెల్ ఫోన్ల వినియోగం, సిం కార్డులు, యుఆర్ఎల్ (వెబ్‌సైట్లు) వినియోగంపైనా సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు తీవ్రంగా దృష్టి సారించారు. సైబర్ నేరాలకు పాల్పడే వా రితో పాటు వారికి సహకరించే చోటా నేరగాళ్లను అరెస్టు చేస్తున్న క్రమంలో వేల సంఖ్యలో సెల్ ఫోన్లతో పాటు సిం కార్డులు, యుఆర్ఎల్‌లను బ్లాక్ చేశారు. 2023లో 24,227 సిం కార్డులు 15,020 ఐఎంఈఐ నంబర్లు, 319 యుఆర్ఎల్‌లను బ్లాక్ చేశారు. 2024లో 10,214 సిం కార్డులు, 171 ఐఎంఈఐ నంబర్లు, 5212 యు ఆర్ఎల్‌లను బ్లాక్ చేశారు. 2025లో ఇప్పటి వరకు 2202 సిం కార్డులు, 1962 ఐఎంఈఐ నంబర్లు, 124 యుఆర్ఎల్‌లను బ్లాక్ చేశారు. సైబర్ నేరగాళ్ల విషయం లో అందరు నిరంతరం అప్రమత్తంగా వుండాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డిజి శిఖా గోయల్ తెలిపారు.

# ముగ్గురు పిల్లలకు విషంపెట్టి చంపిన తల్లి



మృతి చెందిన చిన్నారులు (ఫైల్), చికిత్స పొందుతున్న తల్లి రజిత

### ఆపై ఆత్మహత్యాయత్నం..
### నిలకడగానే రజిత ఆరోగ్యం
### అమీన్‌పూర్‌లో విషాదం

**అమీన్‌పూర్, మార్చి 28, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. కన్నతల్లే అన్నంలో విషం కలిపి ముగ్గురు పిల్లల ప్రాణాలు తీసింది. ఆపై తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రస్తుతం తల్లి స్థానిక ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందు తున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మెడకపల్లికి చెందిన చెన్నయ్య, రజిత ముగ్గురు పిల్లలు కృష్ణ (12), మధుప్రియ (10), గౌతమ్ (8)లతో కలిసి రాఘవేంద్రకాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా చెన్నయ్య, రజిత ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు. గురువారం రాత్రి రజిత పిల్లలతో కలిసి అన్నం, పెరుగుతో భోజ నం చేశారు. అయితే చెన్నయ్య పప్పుతో మాత్రమే తినేసి డ్యూటీకి వెళ్లాడు. రాత్రి 11 గంటలకు డ్యూటీ ముగించుకొని చెన్నయ్య ఇంటికి వచ్చాడు. అప్పటికే పిల్లలు నిద్రపోతుండగా, భార్య రజిత తలుపులు తెరిచింది. రాత్రి మూడు గంటలకు సమయంలో ఆకస్మికంగా తీవ్రమైన కడుపునొప్పి వచ్చి రజిత బిగ్గరగా అరవడం ప్రారంభించింది. వెంటనే చెన్నయ్య పక్కింటివారిని పిలిచి ఆమెను బీరం గూడలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలిం చారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు డాక్టర్లు వెల్లడించారు. అప్పటికే పిల్లల ముగ్గురు చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. అమీన్ పూర్ సీఐ నరేష్, ఎస్ఐ సోమేశ్వరి ఘటన స్థలా నికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలుపెట్టారు. చెన్నయ్యను పోలీసులు అదుపు లో తీసుకొని వివిధ కోణాల్లో ఆరా తీస్తున్నారు.

**నా మనవళ్లను పొట్టన పెట్టుకున్నారు: రజిత తల్లి**

భార్యాభర్తల గొడవ మధ్యలో నా మనవళ్లను పొట్టన పెట్టుకున్నారని రజిత తల్లి బోరున విలపించింది. రజిత తల్లి మీడియాతో మాట్లాడుతూ చెన్నయ్యకు రజిత రెండో భార్య అని, వివాహ సమయంలో ఎకరా భూమి రాసివ్వాల్సిందిగా చెన్నయ్యను కోరారని, దాంతో కొన్ని రోజులు గొడవలు జరిగాయి. చివరకు ఎకరా భూమి రజిత పేరు మీద రాసి ఇచ్చారు. రజిత గత కొన్నేళ్లుగా జరుగుతున్న గొడవల విషయాలు కుటుంబ సభ్యులకు వివరించినట్లు రజిత తల్లి తెలిపింది.

**పోస్టుమార్టం నివేదిక కీలకం: ఎస్పీ పరితోష్ పంకజ్**

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పిల్లలు మృతి చెందిన ఘటనస్థలాన్ని స్థానిక పోలీసులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లా డుతూ పిల్లలు మృతి చెందిన కేసులో పోస్ట్‌మార్టం రిపోర్ట్‌లో కీలకంగా మారాయని, పోస్ట్‌మార్టం రిపోర్టులు వస్తే పిల్లల మరణానికి కారణం ఏమిటనే దానిపై స్పష్టత వస్తుందని అన్నారు.

# బెట్టింగ్‌యాప్ కేసులు సిట్‌కు బదలీ

**హైదరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన బెట్టింగ్ యాప్‌లకు సంబంధిం చిన కేసులను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)కు బదలీ చేస్తున్నట్లు రాష్ట్ర సర్కారు హైకోర్టుకు తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వ తరపు న్యాయవాది శుక్రవారం హైకోర్టుకు సమాచారం అందించారు. బెట్టింగ్ యాప్‌లకు సంబంధించి హై దరాబాద్‌లోని పంజాగుట్టలో సైబరాబాద్‌లోని మియాపూర్‌లో కేసులుండడం తెలిసిందే. పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో సినీ యాంకర్లతో పాటు టివి నటులు 11 మంది పై కేసులుండగా మియాపూర్‌లో టాలీవుడ్ అగ్ర నటులు పలువురిపై కేసులు నమోదయ్యాయి. పంజాగుట్ట కేసులో నిందితులుగా వున్న వారు పోలీసుల విచారణకు హాజరు కాగా మియాపూర్ కే సుకు సంబంధించి ఇంకా విచారణ మొదలు కాలేదు. బెట్టింగ్ యాప్‌లపై అసెంబ్లీలో పాలక, ప్రతిప క్షాల మధ్య గొడవలు జరిగిన నేపథ్యంలో దీనికి సంబంధించిన అన్ని కేసులను సిట్‌కు బదలాయిస్తా మని సిఎం రేవంత్ రెడ్డి వెల్లడించడం తెలిసిందే. దీనికి సంబంధించిన కసరత్తులు ఒవైపు జరుగు తుండగానే శుక్రవారం నాడు ఇదే విషయాన్ని ప్రభుత్వ న్యాయవాది హైకోర్టుకు తెలిపారు.

**సిట్‌లో సజ్జనార్‌కు కీలక బాధ్యతలు?**

ఇదిలా ఉండగా బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన కేసుల విచారణకు సర్కారు ఏర్పాటు చేయనున్న సిట్‌లో ఆర్టీసీ ఎండి వి.సి సజ్జన్నార్‌కు కీలక బాధ్యతలు అప్పగి ంచే అవకాశాలున్నాయి. బెట్టింగ్ యాప్‌లపై అసెంబ్లీలో సమాధానం ఇచ్చే ముందు సిఎం రేవంత్ రెడ్డి డిజిపి జితేందర్, సిటీ కొత్వాల్ ఆనంద్, నిఘా విభాగం డిజి శివధర్ రెడ్డితో పాటు సజ్జన్నార్‌తో భేటీ అయ్యారు. బెట్టింగ్ యాప్‌ల ప్రమోటర్లపై కేసులు నమోదు చేయాలని తెలుగు రాష్ట్రాల పోలీసులకు సజ్జన్నార్ కొంతకాలంగా కోరుతుండడం తెలిసిందే. ఆయన సూచనల మేరకు పలువురు యూ ట్యూబర్లతో పాటు సినీ నటులపై కేసులు నమోదయ్యాయి. ఉమ్మడి ఎపి హయాంలో సిఐడి ఎస్‌పిగా పనిచేసిన సమయంలో అనేక కీలక కేసులను పరిష్కరించి పలువురు కరుడుగట్టిన నేరగాళ్లను జైలుకు పంపిన అనుభవం సజ్జన్నార్‌కు వుండడంతో బెట్టింగ్ యాప్‌ల కేసులపై ఏర్పాటు కానున్న సిట్‌లో ఆయనకు కీలకంగా నియమించే వీలుందని తెలిసింది.

### హాషీష్ ఆయిల్ అక్రమరవాణా కేసులో
# ఇద్దరికి పదేళ్లు జైలుశిక్ష
### ఒక్కొక్కరికి రూ.1 లక్ష జరిమానా

**హైదరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త :** ఒడిశా మాల్కాన్‌గిరి జిల్లా నుంచి 5.030 కేజీల హాషీష్ అయిల్‌ను హైదారాబాద్‌కు అక్రమ రవాణ చేస్తు ఉండగా మహబూబ్‌నగర్‌లో ఎక్సైజ్ ఎస్‌టి ఎఫ్ పోలీస్‌లకు పట్టుబడిన కేసులో ఇద్దరు వ్యక్తులకు మహబూబ్‌నగర్ ఫస్ట్ క్లాస్ అడిషనల్ సేషన్ జిల్లా కోర్టు జడ్జి కె.కళ్యాణ చక్రవర్తి ఒక్కొక్కరికి పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పును వెలువరించారు. మహబూబ్‌నగర్ పిస్తాహౌజ్ ప్రాంతంలో హైదరాబాద్ ఎస్టీఎఫ్ సీ టీమ్ లీడర్ డిఎస్‌పితుల శ్రీనివాసరావుకు వచ్చిన సమాచారం మేరకు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శివకృష్ణ సిబ్బంది కలిసి నర్తంరాయ్, ధర్మేందర్ కుమార్ రాయ్‌లను జనవరి 3న పట్టుకున్నారు. నిందితుల వద్ద ఉన్న 5.030 కేజీల హాషీష్ అయిల్‌ను స్వాధీనం చేసుకొని మహబూబ్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. కేసు నమోదు చేశారు. మహబూబ్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సీఐ ఎన్. వీరారెడ్డి నిందితులను అరెస్టు చేసి చార్జిషట్ వేశారు. ఈ కేసులో తగిన సాక్షియాదారాలు ఉండడంతో జి ల్లా న్యాయమూ నిందితులకు పదేళ్లు జెలు శిక్షి, రూ. 1 లక్ష జరిమానా విధించారు. తీర్పు అనంతరం నిందితులను కోర్టు కానిస్టేబుల్ అరుణ్ జెలుకు తరలించారు. హాషీష్ అయిల్ కేసులో నిందితులకు తొందరగా శిక్ష పడే విధాంగా చర్యలు తీసుకున్న సిఐ వీరారెడ్డిని ఎన్ ఫోర్స్ మెంట్ డెరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి, డిప్యూటి కమిషనర్ శ్రీనిసవాసరెడ్డి, అసిస్టేంట్ కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి అభినందించారు.

### ఎస్ఎస్‌సి పరీక్షల్లో ఐదుగురి ఇన్విజిలేటర్ల తొలగింపు

**హైదరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎస్‌సి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో ఈ నెల 21 నుంచి ప్రారంభమైన 10వ తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా శుక్రవారం సైన్స్ పార్ట్-1 పరీక్ష జరిగింది. సైన్స్ పార్ట్-1 పరీక్షకి 99.74 శాతం మంది విద్యార్థులు హాజరైనట్టు ప్రభుత్వ పరీక్షల డైరక్టర్ ఏ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం జరిగిన సైన్స్ పార్ట్-1(ఫిజికల్ సైన్స్) పరీక్షకి 4,97,867 మంది హాజరు కావల్సి ఉండగా.. వారిలో 4,96,576 మంది హాజరయ్యారు. పరీక్షల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహారించిన ఐదుగురు ఇన్విజిలేటర్లను పరీక్షల విధుల నుంచి తొలగించినట్టు డైరెక్టర్ తెలిపారు.

### జాతీయ గిరిజన కమిషన్ నుండి కలెక్టర్, ఎస్పీకి నోటీసులు

**మహబూబాబాద్ బ్యూరో, మార్చి 28, ప్రభాతవార్త:** గిరిజన జాతీయ కమిషన్ నుండి మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, జిల్లా ఎస్పి సుధీర్‌రాంనాథ్‌కేకన్‌లకు నోటీసులు జారీచేశారు. వివరాల్లోకి వెళితే.. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం సీతంపేట గ్రామానికి చెందిన ఆదివాసి యువకుడు గుమ్మడి మహేష్ గత ఐదు నెలల క్రితం ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న క్రమంలో ప్రక్కనే ఉన్న గంధసిరి మంజుల, ఆమె భర్త గంధసిరి కృష్ణ, మరికొందరు కలసి అతన్ని అతి కిరాతకంగా చంపారు. ఇప్పటి వరకు గంధసిరి కృష్ణ, మంజులను మాత్రమే అరెస్ట్ చేసి మిగిలిన వారిని అరెస్ట్ చేయకపోవడంతో మహబూబాబాద్ జిల్లా కలెక్టర్, ఎస్పిలు ఏప్రిల్ 8న ఢిల్లీలోని నేషనల్ ట్రైబల్ కమిషన్‌కు హాజరుకావాలని జాతీయ గిరిజన కమిషన్ సభ్యులు జాటోతు హుస్సెన్‌నాయక్ నుండి నోటీసులు జారీ చేశారు.


BAJAJ FINSERV

**బంగారు ఆభరణాల వేలం కోసం దిన పత్రిక ప్రకటన**
**బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్**
**రిజిస్టర్డ్ కార్యాలయం: ముంబయి-పూణె రోడ్డు, అకుర్ది, పూణె - 411035**

గోల్డ్ లోన్ పొందే సమయంలో, ఆయా రుణ ఖాతాలలో మరియు రుణ మొత్తాన్ని చెల్లించలేకపోయిన డీఫాల్టర్స్ లేదా కావలసిన లాభాన్ని కేటాయించడంలో విఫలమైనవారు, నోటీసులను పునరావృతంచేసినా కూడా రుణగ్రహీతలుచే సెక్యూరిటీగా ఉంచబడిన గోల్డ్ జ్యువెలరీ "యథాతథంగా మరియు ఎక్కడైతే మరియు ఎలా ఉందో దాని ఆధారంగా" వేలం వేయబడుతుందని ఇందుమూలముగా బీఎఫ్ఎల్ సంబంధిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియచేస్తోంది. బిడ్డర్స్ ఈ క్రింది నియమాలను అనుసరించాలని అభ్యర్థిస్తున్నాము:

(a) ప్రకటన గురించి పూర్తి వివరాలు తెలుసుకోవడానికి (లోన్, జ్యువెలరీ, స్థూల బరువు, ప్రదేశం మరియు వేలం వేసే తేదీ) ప్రక్కన ఉన్న QR కోడ్ స్కాన్ చేయాలి;
(b) ఈ ప్రకటనకు సంబంధించిన బిడ్డర్ నియమాలు, షరతులు గురించి పూర్తిగా చదవడానికి ("నియమాలు & షరతులు") వెబ్‌లింక్ http://172.30.1.235:3000/?WOUB2QG9WU పై క్లిక్ చేయాలి;
(c) నియమాలు & షరతులు అర్థం చేసుకోవడానికి, తదుపరి ధరావతు సొమ్ము రూ.25,000/- ను వేలం వేసే తేదీ నాడు లేదా అంతకు ముందు ఫండ్ ట్రాన్స్‌ఫర్ (ఎన్ఈఎఫ్టి/ఆర్టీజీఎస్/బజాజ్ గోల్డ్ ఆక్షన్ యాప్) ద్వారా డిపాజిట్ చేయడానికి;
(d) ఉదయం 10 గంటలకు వేలం వేసే వేదిక వద్దకు వ్యక్తిగతంగా హాజరవ్వాలి; మరియు
(e) వేలం వేసే వేదిక వద్దకు తమ చెల్లుబాటయ్యే గుర్తింపు & చిరునామాను తీసుకురావాలి.
(f) వేలం వేసే వేదిక వద్ద తమ చెల్లుబాటయ్యే గుర్తింపు మరియు చిరునామా ప్రూఫ్ తీసుకువెళ్లాలి వేలం వేసే తేదీ నాడు మధ్యాహ్నం 12 గంటలు తరువాత వేలం వేసే ప్రక్రియలో పాల్గొనడానికి బిడ్డర్స్ అనుమతించబడరు.
(g) ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) చెల్లింపు తరువాత కూడా నిర్దేశించబడిన టైమ్ పరిమితి లోగా పాల్గొనని బిడ్డర్స్ ను తిరస్కరించడానికి లేదా అనుమతించడానికి బ్రాంచ్ మేనేజర్/వేలందారుకు హక్కు గలదు.

నన్ను స్కాన్ చేయండి

వేదికలో మరియు వేలం వేసే తేదీలో ఏవైనా మార్పులు ఉంటే, వేలం వేసే వేదిక వద్ద ప్రదర్శించబడతాయి. మీరు బిడ్ సమర్పించడం పైన చెప్పిన నియమాలను మీరు ఆమోదించినట్లుగా భావించబడుతుంది. ప్రజా వేలం సేల్‌ను రద్దు చేయడం/ఆపు చేయడం చేసినట్లయితే బీఎఫ్ఎల్ రుణగ్రహీత (లు) యొక్క విషయంలో కూడా ప్రైవేట్ సేల్ ద్వారా జ్యువెలరీని విక్రయించే హక్కు బీఎఫ్ఎల్ కు ఉంది. మీకు ఏవైనా సందేహాలు ఉంటే మీరు మమ్మల్ని ఈ మెయిల్ ఐడీ పై సంప్రదించవచ్చు - gold.auction@bajajfinserv.in

(11-04-25) అదిలాబాద్ - ద్వారకా నగర్; PEK4SGL10629995, 0706166, 0732007, 0798430, 0819391, 0882769. ఆర్మూర్ - అంబేద్కర్ చౌరస్తా; PB56SGL10682986, 0717324, 0732794, 0751207, 0855346, 0893175, 0904781, 0903248. బాన్సువాడ - బస్ స్టాండ్; PCV9SGL10661928, 0677150, 0690020, 0766746, 0784275, 0829281. భద్రాచలం - ఆర్‌టిసి బస్ స్టాండ్; PEK5SGL10689958, 0727964, 0760493, 0827912, 0871306, 0922763. బోధన్ - నాందేడ్ మెయిన్ రోడ్; PEJ7SGL10566131, 0597055, 0821505, 0853372. భోంగిర్ - హైదరాబాద్ రోడ్; PCW1SGL10744285, 0793881. (14-04-25) భూపాల్‌పల్లి - మెయిన్ రోడ్; PCW2SGL10598052, 0681988, 0716014, 0741782, 0758825, 0816154, 0829817, 0886306, 0886062. గద్వాల్ - రాజీవ్ మార్గ్; PCW4SGL10734310, 0743251, 0796187, 0891135. గజ్వేల్ - పిడ్చేడ్; PEJ6SGL10889501. హాలియా - దేవరకొండ మెయిన్ రోడ్; PGC7SGL9591357, 0570234, 0613152, 0647099, 0762345, 0868530, 0887703, 0892883, 0908734, 0901215. హుస్నాబాద్ - అక్కన్నపేట చౌరస్తా; PCW5SGL10666937, 0703754, 0908198. ఇబ్రహింపట్నం - బిజిఎల్; P19WSGL10783499. (15-04-25) జనగాం - బాలాజీ నగర్; PCW7SGL10720040, 0729275, 0798746. కాగజ్‌నగర్ - పటేల్ రోడ్; PGM7SGL10596805, 0747789, 0785728, 0848341, 0891030, 0927329. కామారెడ్డి - నిజాంసాగర్ రోడ్; P86QSGL10565607, 0668303, 0667999, 0706440, 0709824, 0737147, 0746610, 0760547, 0764806, 0780984, 0798775, 0822034, 0834180, 0916348, 0924970, 0918304. కరీంనగర్ - సివిఆర్ఎస్ రోడ్; PCW8SGL10629110, 0722937, 0784602, 0831513, 0926653. ఖమ్మం - గాంధీ చౌక్; PB54SGL10568129, 0613172, 0701544, 0733203, 0758792, 0761348, 0780288, 0811953, 0846243, 0848924, 0846579. ఖమ్మం - జమ్మిబండ రోడ్; PGG1SGL10572895, 0589612, 0694741, 0710957, 0759745, 0776030, 0905440. (16-04-25) కోరుట్ల - బిజిఎల్; PV44SGL10647179, 0744060, 0748916, 0851157, 0876564. కొత్తగూడెం - మధురా బస్తీ; PEJ5SGL10710845, 0718233, 0726960, 0815242, 0832724, 0889433, 0907212. మంచెరియాల్ - హైదరాబాద్ రోడ్; PCW9SGL10571863, 0628371, 0623443, 0693202, 0753238. మనుగూరు - అశోక్ నగర్; PCX1SGL9588429, 0761902, 0856501, 0853804, 0899835, 0907778. మెదక్ - టిఎల్ బ్రాంహ్మణ్ వీధి; PCX2SGL10626724, 0647665, 0674873, 0688236, 0782600, 0820356, 0854781, 0891074, 0904254. మిర్యాలగూడ - బిజిఎల్; P7B7SGL10340325, 0597211, 0594896, 0674540, 0673233, 0727469, 0903466. ములుగు - గాంధీ చౌక్; PJV5SGL10609172, 0703503, 0732261, 0768962, 0837021, 0858140, 0892150, 0886426. (17-04-25) నాగర్‌కర్నూల్ - బిజిఎల్; P21DSGL10595571, 0647384, 0693631. నల్గొండ - బిజిఎల్; P558SGL10762263. నర్సంపేట - జై శ్రీ థియేటర్; PCX3SGL10785573, 0872472. నిర్మల్ - గంగా కాంప్లెక్స్; PCX4SGL10602157, 0645440, 0693017, 0706702, 0767327, 0852696, 0852269, 0901500. నిజామాబాద్ - కపిలా హోటల్ రోడ్; PB94SGL10491782, 0616718, 0816372, 0831798, 0832660, 0836814, 0904395. నిజామాబాద్ - వినాయక నగర్; PCX5SGL10674038, 0705296, 0701569, 0716859, 0811665. పటాన్‌చెరు - బిజిఎల్; PY29SGL10773906, 0812765, 0917270. (18-04-25) పెద్దపల్లె - సుభాష్ నగర్; PEO3SGL10658132, 0729330, 0744699, 0781193, 0799021, 0815039, 0827195, 0923550. సదాశివపేట - రాచయ్య నగర్; PCX6SGL10890212. షాద్‌నగర్ - వెంకటేశ్వర కాలనీ; PCX7SGL10680670, 0691772, 0727499. సంగారెడ్డి - బిజిఎల్; P4D3SGL10594977, 0761349, 0794685, 0829896, 0849927, 0891144. సత్తుపల్లి - సూపర్ మార్కెట్; PCX8SGL10566679, 0624717, 0681476, 0743906, 0793936, 0802901, 0830205, 0926495. సిద్దిపేట - మెదక్ రోడ్; PGM8SGL10847667, 0885424, 0902433. (21-04-25) సిరిసిల్ల - మెయిన్ రోడ్; PB66SGL10588668, 0614731, 0892437. తాండూర్ - ఇందిరా చౌక్; PDA6SGL10852668, 0906611. వనపర్తి - రాజీవ్ చౌక్; PCX9SGL10642480, 0673846, 0735757, 0849226, 0858664, 0920869. వరంగల్ - కెయు క్రాస్ రోడ్; PGP7SGL10627169, 0681164, 0708514, 0731227. వరంగల్ - స్టేషన్ రోడ్; PO4ISGL10709992. వరంగల్ - సుబేదారి; PB55SGL10565871, 0641428, 0709708, 0764912, 0780286. (22-04-25): గోదావరిఖని - కల్యాణ్ నగర్; PEK6SGL10833349. హుజూరాబాద్ - వరంగల్ రోడ్; PJH1SGL10767530. పర్కల్ - బస్ స్టాండ్; PJG8SGL10869622, 0892730, 0920726. సూర్యాపేట్ - గాంధీ విగ్రహం; PJG4SGL10866113, 0888266, 0923347. యెల్లందు - బుగ్గవాగు; PGC4SGL10570943, 0663014, 0707319, 0746422, 0798051, 0802335. జహీరాబాద్ - ఆర్‌టిసి బస్ స్టాండ్; PER4SGL10660372, 0728390.

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్


# పన్ను చెల్లిస్తే జరిమానాలు మాఫీ
### 31లోగా గడువు వినియోగించుకోవాలి
### సెంట్రల్ జిఎస్‌టి కస్టమ్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సందీప్ ప్రకాశ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 28, ప్రభాతవార్త:** జిఎస్‌టి తొలి మూడేళ్లపాటు పన్ను చెల్లించని వారు ఆ పన్ను చెల్లిస్తే జరిమానాలు, వడ్డీ మాఫీ చేయాలని, ఈ నెల 31వ తేదీలోపు చెల్లిస్తేనే జరిమానాలు, వడ్డీ మాఫీ ఉంటుందని జిఎస్‌టి అధికా రులు పేర్కొన్నారు. జిఎస్‌టి అమలులోకి వచ్చిన తొలి మూడు సంవత్సరాలలో పన్ను చెల్లింపుదారులు ఎదుర్కొన్న వివిధ సాంకేతిక సమస్యల వల్ల పన్ను చెల్లింపులలో వ్యత్యాసములు ఏర్పడినందున వీటిపై జిఎస్‌టి అధికారులు పన్ను మదింపు చేసి పన్ను జరిమానా, వడ్డీ చెల్లించవలసిందిగా ఉత్తర్వులు జారీ చేసి ఉన్నట్లు వివరించారు. అయితే సదరు పన్ను చెల్లింపుదారుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం అట్టి పన్నును చెల్లించినచో జరిమానా, వడ్డీలను మాఫీ చేయటానికి ఒక పథకంను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. దీని ప్రకారం 2017-18, 2018-2019, 2019-2020 సంవత్సరాలకు గాను మదింపు చేసిన పన్ను మొత్తాన్ని చెల్లించినచో దానిపై వేసిన జరిమానా, వడ్డీలు మాఫీ చేయబడుతాయని అప్పీలేట్ అథారిటీ లేదా కోర్టులో చాలెంజ్ చేసిన మదింపు ఉత్తర్వులకు కూడ ఈ పథకం వర్తిస్తుందని అయితే సదరు మదింపు చేసిన పన్ను ఈ నెల 31వ తేదీలోపు చెల్లించిన వారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఈ పథకంను వినియోగించుకోదలచిన పన్ను చెల్లింపుదారులు 31మార్చి 2025లోగా పన్ను చెల్లించి, 30జూన్ 2025లోగా జిఎస్‌టి పోర్టల్ ద్వారా సదరు ధరఖాస్తును సమర్పించవలసి ఉంటుందన్నారు. అధిక సంఖ్యలో పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గడువు ముగియటానికి రెండు రోజుల సమయం మాత్రమే ఉందని, ఆసక్తి గల వారు పన్ను చెల్లింపుదారులు ధరఖాస్తుతో నిమిత్తం లేకుండా గడువులోగా పన్ను చెల్లించాలని సెంట్రల్ జిఎస్‌టి, కస్టమ్స్ ప్రిన్సిపల్ ఛీఫ్ కమిషనర్ సందీప్ ప్రకాశ్, స్టేట్ జిఎస్‌టి కమిషనర్ హారిత తెలిపారు. గడువులోగా పన్ను చెల్లించుటలోగాని, ఆ తరువాత ధరఖాస్తు చేయటంలోగాని ఎటువంటి సమస్యలు వచ్చినా లేదా మరిన్ని వివరాలు తెలుసుకోదలచిన వారు తమ పరిధిలోని జిఎస్‌టి అధికారులను సంప్రదించాలని వారు సూచించారు.




వార్త

మనిషి అన్నవాడు ముందు ఆత్మాభిమానం కలిగి ఉండాలి. ఆత్మాభిమానం లేనివాడు అసలు మనిషిగా ఎదగలేడు.

-పాస్కల్


# ఇంతే! ఇంతేనా?

అ తిజుగుప్సాకర సంభవాలను అలనాడు కౌరవ సభలో దుర్యోధనుడు పెద్దల్ని ప్రశ్నించి 'జాతి నెవమున సూతునికి రాజ్యార్హత'లేదందురా!అన్నట్లుగానే అంతే జుగుప్సాకర తీర్పునిచ్చినఅలహాబాద్ హైకోర్టు తప్పిదాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నిస్తోంది. సర్వజనావళి ఈ తీర్పును ఖండిస్తోంది. ఏదో ఒకటి చెప్పాలనే ప్రయత్నంలో హైకోర్టు న్యాయమూర్తి మరేదో చెప్పారని విజ్ఞులు సైతం విమర్శిస్తున్నారు. సమాజంలో మహిళల గౌరవానికి భంగం కలిగించే అంశాలలో ఎంతో జాగ్రత్తగా ఉండాల్సిన ధర్మాసనాల తీర్పుల్లో అనుచిత అంశాలను పేర్కొనడం సభ్యసమాజం హర్షించేట్లుగా లేదు. ఇప్పుడదే జరిగింది. స్త్రీమూర్తి వక్షోజాలను పట్టుకోవడం, పైజామా బొందు లాగడం వంటి చర్యలు అత్యాచారం కిందకు రావని సాక్షాత్తూ అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి తన తీర్పులో ధృవీకరించడాన్ని సమాజం అంగీకరించడం లేదు. ఇలాంటి తీర్పులు సమాజానికి ఎలాంటి సంకేతాలు పంపుతాయో యోచించకుండా వెలువరించిన తీర్పులు తిరస్కరణకు గురౌతాయి. తీర్పు ఎలా ఉందన్నది కాదు. అందులోని వ్యాఖ్యానాలు, అలాంటి తీర్పులు రాసే విషయమై వాటిని సమర్థించుకునే క్రమంలో చేసే ఏవ్యాఖ్యలైనా సమాజానికి మేలు చేసేవిగా ఉండాలి తప్ప అసంబద్ధంగా ఉంటే జాతి అందిపుచ్చుకునే పరిస్థితులు లేవు. అలహాబాదు హైకోర్టు ధర్మాసనం ముందుకొచ్చిన తీరు అతి సున్నితమైనది. బాలికపై లైంగిక వేధింపుల వ్యవహారంలో ఇచ్చినతీర్పు అమానవీయమైనదని ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం సుమోటోగా నిలిపివేసింది. అప్పటికే దేశవ్యాప్తంగా అలహాబాద్ హైకోర్టు తీర్పుపై నిరసనలు వ్యక్తమయ్యాయి. కోర్టుల్లో ఈమధ్య వినిపిస్తున్న తీర్పులో చెప్పుకోదగిన సారాంశమేదీ లేకుండానే నిర్ణయాలు, చట్టబద్ధం కాని అంశాలపై వ్యాఖ్యలు చేసి న్యాయధీశులుగా వ్యవహరించే వారి విషయంలో దేశ నలుమూలల నుంచీ వ్యతిరేకత వ్యక్తమౌతోంది. న్యాయస్థానాలిచ్చిన ప్రతితీర్పు సంచలనం కానక్కర్లేదు. చట్టపరిధిలో నేరస్థునికి శిక్షపడిందా లేదా సరైన న్యాయాన్ని నిర్దేశించామా లేమా అన్నది మాత్రమే న్యాయాధిపతులు పరిగణనలోకి తీసుకోవాలి. కాని వారి వ్యాఖ్యానాలు, సమర్థనలను సమాజంలో మేధావులు, మహిళలు అన్నివర్గాల వారు గమనిస్తున్నారు. స్త్రీలపై జరిగిన అకృత్యాలు, అమానుషాలు ఎంతో సానుభూతితో పరిశీలించాల్సిన అంశాలు. కాగా సాక్ష్యాలలో తేలిన అంశాలను తీర్పు భాగంలో వేరే అర్థాన్ని ధ్వనింప చేయడంతో న్యాయమూర్తి మరోఆలోచన చేయలేకపోవడం సరైన విధానం కాదు. ఈ నేపథ్యంలోనే హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. తొలుత ఈ తీర్పువెలువడిన వెంటనే కేంద్ర మంత్రి అన్న పూర్ణాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. మీడియాకెక్కి ఆ తీర్పును దుయ్యబట్టారు. నాగరిక సమాజంలో ఇలాంటి తీర్పులు, సమాజంమీద ప్రతికూల ప్రభావం చూపిస్తా యని హెచ్చరిక చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని కాస్‌గంజ్‌లో ఓ బాలిక తన తల్లితో వెళ్తుండగా బాలికను ద్విచక్రవాహనంమీద తీసుకెళ్తూ ఆమెనుఅసభ్య చేష్టలతో భయాందోళన కలిగించారు. ఏమైతేనేం హైకోర్టు న్యాయమూర్తి నాలుగు నెలల అనంతరం తీర్పును ఇచ్చారు. బాలికను నగ్నంగా చూడాలనే ఉద్దేశ్యమే వారిచేష్టలని, ఆమెను లైంగిక వేధింపుకోవకు చెందిన ఎలాంటి ఆరోపణ లేవని సమర్థిస్తున్నట్లుగా ఆ తీర్పు సారాంశం ఉంది. ఇలాంటి వివాదాస్పద తీర్పు సమాజానికి హానికరమంటూ ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని వేయగా ఒక ధర్మాసనం విచారణకు అనుమతించలేదు. ఈసారి ఆతీర్పు సారాంశంపై సుమోటోగా మరో ధర్మాసనం విచారణ ప్రారంభించింది. ఒక మహిళ మానాభిమానాలను అవహేళన చేసినట్లుండి సమాజానికి తప్పుడు సంకేతాలిస్తున్న తీర్పుపై జోక్యం చేసుకోవడానికి దేశవ్యాప్త ఆగ్రహావేశాలు వ్యక్తమైతేనే తప్ప ఉన్నత ధర్మాసనం జోక్యం చేసుకోకపోవడం ఈ దేశ న్యాయవ్యవస్థలో భాగస్వామ్యంగా ఉన్న న్యాయమూర్తుల నిర్ణయాధికారాలు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. వారికి ఎన్ని అధికారాలైనా న్యాయవ్యవస్థ నుంచి రాజ్యాంగం నుంచి సంక్రమించి ఉండవచ్చు. కానీ అమానవీయ తీర్పుల విషయంలోనూ మౌనం వహిస్తే దేశంలో అరాచకం ప్రబలే అవకాశముంటుంది. ఈ కేసులో సంబంధమున్నవారు కానీ,నేరాన్ని రుజువు చేయాల్సిన ప్రభుత్వ న్యాయవాదులు కాని, ఎందరున్నా హైకోర్టు నుండి వెలువడిన తీర్పులోని అంశాలు మాత్రం అవాంఛ నీయం. తీర్పు రాయడంలో న్యాయాధికారి వివేచనను కాదనలే. కానీ స్పష్టమైన సాక్ష్యాలకు సామాజికగతిని వర్తింపు చేసుకోకుండా యాంత్రికంగా తీర్పురాసారా అనిపించే ధోరణిలో తీర్పుబయటకు రావడమే అభ్యంతరకరం. న్యాయమూర్తులు చట్టాలను లోతుగా అర్థం చేసుకొని భాష్యాలు చెప్పడంలో విఫలమైనప్పుడు సుప్రీం ధర్మాసనం కలుగ చేసుకుంటూనే ఉంటుంది. ఆయా సందర్భాల్లో ఇచ్చిన వ్యాఖ్యలు, భాష్యాలు సమాజానికి తప్పుడు సంకేతాలు పంపుతున్నాయన్న ఉదంతాలూ ఉన్నాయి. పోక్సో చట్టంలోని 'స్కిన్ టు స్కిన్' సంప్రదాయాన్ని తప్పుగా వివరిస్తూ తీర్పుఇచ్చిన మహారాష్ట్రలోని బాంబే హైకోర్టు అదనపు జడ్జి హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియామకం పొందే అవకాశాన్ని కోల్పోయిన విషయం విదితమే. ఆ తీర్పునకు ఆమె మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. ఇలాంటి తీర్పులు వెలువరించిన న్యాయాధికార్ల ధోరణి మార్చేందుకు ఉన్నత ధర్మాసనాల జోక్యం వల్లనే న్యాయవ్యవస్థ ప్రతిష్ఠ ఇనుమడిస్తోంది.



ప్రపంచంలో అన్నింటి కన్నా కష్టమైన విషయం ఎదుటి వ్యక్తిని అర్థం చేసుకోవటమే.

ఆలివర్ గోల్డ్‌స్మిత్



మన సమస్యలకు పరిష్కారాలు మనదగ్గరే ఉంటాయి. కానీ మనం ఎవరో పరిష్కరించాలని అనుకుంటామంతే.

షేక్స్‌స్పియర్

# ముంచుకొస్తున్న మాదకద్రవ్యాల ముప్పు

**మానవ జీవితాలతో ఆటలాడుకుంటున్న ఈ మాదకద్రవ్యాలను నిరోధించే విషయంలో మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపాల్సిన తరుణమిది. ఏదో ఒక రాష్ట్రం చర్యలు తీసుకుంటే ఆగే అవకాశాలు లేవు. అటు కేంద్రం, ఇటు రాష్ట్రాలు ఉమ్మడి కార్యాచరణ రూపొందించి అమలు చేయగలిగితే కొంతమేరకైనా నియంత్రించవచ్చు. అన్నిటికంటే ముఖ్యంగా మాదకద్రవ్యాల ఉత్పత్తిలో, రవాణాలో, వినియోగంలో పట్టుబడితే జీవితకాలం జైళ్లలో మగ్గిపోవాల్సి వస్తుందనే భయం నేరస్తుల్లో ఏర్పడితే తప్ప ఆ మహమ్మారికి అడ్డుకట్టవేయలేం. రాజకీయాలకు అతీతంగా అందరూ నేతలు,స్వచ్ఛంధసంస్థలు, కలిసికట్టుగా ఈ రక్కసిని మట్టుపెట్టే యజ్ఞంలో పాలుపంచుకోవాలి.**

**దామెర్ల సాయిబాబ**

ఒక్క మాట

మాదకద్రవ్యాల వ్యసనం జాతి వినాశనాలకు దారితీస్తుందని, దాన్ని సమష్టిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని ఎంతో కాలంగా ప్రపంచవ్యాప్తంగా దేశాధినేతలు చెబుతున్నారు. కానీ అంతకు రెట్టింపు స్థాయిలో ఈ మహమ్మారి ఆ యేటికాయేడు విస్తరిస్తుండడం ఆందోళన కలిగించే అంశం. ఇటీవల కాలంలో ఈ వ్యసనం పదిహేను, పదహారేళ్ల వయసున్న పిల్లలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నది. మాదక ద్రవ్యాల మత్తులో వారు ఏంచేస్తున్నారో వారికే తెలియకుండా పోతున్నది. ఫలితంగా నేరాల సంఖ్య కూడా అదుపు లేకుండా పెరిగిపోతున్నది. ప్రపంచవ్యాప్తంగా డార్క్‌నెట్ ద్వారా జరిగిన మత్తుమందుల కొనుగోళ్లలో ఆసియా ఖండం వాటా పద్నాలుగు శాతంపైగా పెరిగిపోయింది. అందులో చైనా తర్వాత అగ్రస్థానం భారత్‌దే ఉంది. భారతదేశంలో ఈ వినియోగం ఊహాకందని రీతిలో పెరిగిపోతున్నదని అధికార వర్గాలే ఆందోళన చెందుతున్నాయి. 2004లో భారతదేశంలో కోటి డెబ్బైలక్షల మందికి పైగా మత్తుమందు వాడకందార్లు ఉండగా ప్రస్తుతం పది కోట్లకు చేరుకున్నట్లు అనధికార లెక్కలు వెల్లడిస్తున్నాయి. వాడకంలో పంజాబ్ అగ్రస్థానంలో ఉన్నట్లు అనేక సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఆ రాష్ట్రంలో యేటా పది నుంచి పది హేనువేల కోట్ల రూపాయలకుపైగా మత్తు మందులకు ఖర్చుపెడుతున్నారని అంచనా. తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి ఆందోళనకరంగా తయారవుతున్నది. నిత్యం ఎక్కడో ఒక దగ్గర పట్టుబడుతూనే ఉన్నాయి. దీనికితోడు గంజాయి సాగు ఊహించని రీతిలో పెరిగిపోయింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ ఏజెన్సీలోనూ, ఇటు తెలంగాణలోని ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ తదితర జిల్లాల అటవీ ప్రాంతంలో గంజాయి సాగు ఇటీవల కాలంలో బాగా విస్తరించినట్లు వార్తలు అందుతున్నాయి. ఆ మధ్య ఆంధ్ర, ఒడిశా సరిహద్దుల్లో పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ గంజా' తనిఖీల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఎందుకోఏమోకానీ ఆ తరువాత అలాంటి ఆపరేషన్ ఆగిపోయింది. ఇతర రాష్ట్రాలమాట ఎలాఉన్నా కనీసం రెండు తెలుగురాష్ట్రాల సరిహద్దులు, అలాగే పొరుగునున్న కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల నుండి వచ్చే మార్గాల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తే కొంత వరకు అయినా కనీసం గంజాయి రవాణా తగ్గే అవకాశాలున్నాయి. ఈ నెలలో మొన్న కేరళ ఎక్సైజ్ శాఖ 'ఆపరేషన్ క్లీన్స్ లేట్' ద్వారా మూడురోజుల్లో 378 మందిని అరెస్టు చేసి పెద్దఎత్తున మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకొన్నారు. అసోం, మణిపూర్‌లో ఇదే నెల 13వ తేదీన నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో వంద కిలోలకుపైగా మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నది. మొన్న డిసెంబర్ నాటికి తెలంగాణ ఎక్సైజ్ శాఖ వెయ్యికిపైగా కేసులు నమోదు చేసి 1840 మందిని పైగా అరెస్టు చేశారు. అంతకుముందు అక్టోబరులో దాదాపు ఎనిమిదివేల కిలోలు, పన్నెండు కోట్ల రూపాయల విలువైన మత్తుమందును దహనం చేశారు. మత్తుమందులతో చాక్లెట్లు తయారు చేస్తున్నవారిని కూడా పట్టుకుంటున్నారు. ఇక గత నవంబరులో గుజరాత్‌లోని సముద్రతీరంలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, భారత నౌకాదళం, గుజరాత్ పోలీసు యాంటీ టెర్రరిస్ స్క్వాట్ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో దాదాపు మూడువేల కోట్లకుపైగా విలువ ఉన్న మత్తు పదార్థాలను పట్టుకున్నారు. ఇకపోతే విదేశాల నుండి భారీ ఎత్తున డ్రగ్స్ తెలుగు రాష్ట్రాలకు చేరుకుంటున్నట్లు పట్టుబడుతున్న సంఘటనలు రుజువు చేస్తున్నాయి. గతంలో గుజరాత్‌లోని ముంద్రా పోర్టులో ఇరవైవేల కోట్ల రూపాయల విలువైన మూడువేల కిలోల హెరాయిన్ పట్టుబడిన కేసు దర్యాప్తు విజయవాడ లింకులు వెలుగులోకి వచ్చాయి. మత్తుమందు సరఫరాకు కోట్లడాలర్ల వ్యవహారంలో ఎక్కువ భాగం ఉగ్రవాద సంస్థలకే చేరుతున్నదని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, ఉజ్బెకిస్థాన్‌తోపాటు మరికొన్ని ఆఫ్రికా దేశాలు ఇందులో విరి విగా పాల్గొంటున్నాయి. కాశ్మీరులోని ఉగ్రవాదులకు పంజాబ్ లోని మత్తుమందుల సరఫరాదారులకు గట్టి సంబంధమే ఉన్నట్లు బయటపడింది. అయితే పట్టుబడుతున్నది వందో వంతు కూడా ఉండకపోవచ్చు. అన్నింటికంటే ప్రధానంగా అత్యంత లాభదాయకం కావడం వల్ల ప్రపంచవ్యాప్తంగా పెద్ద పెద్ద నేర ముఠాలు మాదకద్రవ్యాల ఉత్పత్తి, రవాణాను వ్యాపారంగా మార్చుకున్నాయి. మత్తు ముఠాలు సొంతంగా ఒక పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు కూడా చెప్తున్నారు. మారుమూల ప్రాంతాలకు రవాణా చేయగలిగిన రకరకాల మార్గాలను ఏర్పరచుకున్నారు. లాటిన్ అమెరికాలో తయారవుతున్న మత్తుమందులు ప్రపంచ నలుమూలలకు విస్తరించడంతోపాటు రసాయనాలు తయారు చేసే యాంఫెటమైన్ టైప్‌సిస్టమ్ లెన్స్ ఎక్కడికక్కడ తయారవు తున్నాయి. బ్యాంకులు, ఇతర వ్యవస్థలతో సంబంధం లేకుండా సరాసరి ఒకరి ఖాతా నుంచి మరొకరి ఖాతాకు బదలీ చేయగలిగే క్రిప్టో కరెన్సీ వాడకం సైతం పెరగడంతో లావాదేవీలకు అదుపులేకుండాపోతున్నది. ఇండియాలో మారుమూల ప్రాంతంలో కూర్చొని ఎక్కడో విదేశాల్లో ఉన్న మత్తుమందుల వ్యాపారికి ఆర్డరు ఇవ్వొచ్చు. మత్తు మందు రవాణా చెల్లింపులు సులభం కావడంతో విక్రయాలు విపరీతంగా పెరిగి పోయాయి. చివరకు పోస్టల్ పార్సిల్ ద్వారా మత్తుమందులు రవాణా చేస్తున్న విషయం తరుచుగా బయటపడుతున్నది. ప్రస్తుతం హైదరాబాద్‌లో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. పట్టుబడిన కేసుల్లో కూడా పటిష్టంగా వ్యవహరించ లేకపోవడమో, లేక చట్టంలో ఉన్న లొసుగులు ఏమోకానీ జైళ్ల నుంచి బయటకు వచ్చి అదే వ్యాపారంలో కొనసాగుతున్నారు. అసలు పట్టుబడుతున్న కేసులను సమర్థవంతంగా దర్యాప్తు జరిపి రుజువు చేయడంలో అధికారులు విఫలం కావడంతో అధికశాతం కేసులు న్యాయస్థానాల్లో వీగిపోతున్నాయి. గతంలో హైదరాబాద్‌లో ఇలాంటి వ్యాపారం బయటపడడంతో పోలీసులు కొందరిని అదుపులోకి తీసు కొని పటిష్టమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అప్పట్లో కొందరు రాజకీయ నాయకుల పుత్రరత్నాల పేర్లు, వారి సన్నిహితుల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. ఆతర్వాత ఆ కేసు ఏమైందో తెలియదు. ఎక్సైజ్ అధికారులదాడుల్లో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. కొందరు ప్రముఖులను పిలిపిం చి విచారణ పేరుతో పెద్దఎత్తున హడావుడి చేశారు. ఆ కేసులో కూడా ఎవరిపై చర్యలు తీసుకున్నారో చివరికి ఏమైందో వెలుగు చూడలేదనే చెప్పొచ్చు. విచారణ చేసే సమయంలో చేసిన హడావుడి ఆ తర్వాత ఉండడం లేదు. ఇలాంటి సంఘటనలతో చట్టాలు, అధికారులన్నా మత్తు వ్యాపారులకు, వినియోగదారులకు భయభక్తులు లేకుండా పోయాయి. రానురాను ఈరక్కసి సమాజంపై తీవ్రప్రభావం చూపుతున్నది. చివరకుఎనిమిది, తొమ్మిదో తరగతి చదువుతున్న బాలబాలికలను ఒకవ్యూహం ప్రకారం ఎరవేసి మత్తులోకి దించుతున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని దాదాపు యుద్ధమే ప్రకటించారు. తెలంగాణ స్టేట్ నార్కోటిక్ డైరెక్టర్‌గా ఉన్నత స్థాయిపోలీసు అధికారిని నియమించి రాష్ట్రంలో మత్తుమందులకు స్థానం లేకుండా చూడాలని ఆదేశించారు. అయినా ఇవేమీ ఆగడం లేదు. ఎక్కడో ఒకచోట పట్టు బడుతూనే ఉన్నాయి. ఈ మహమ్మారిని పారద్రోలేందుకు ఒక నార్కోటిక్ విభాగమే కాదు స్థానిక పోలీసుల సహకారం కూడా ఎంతో అవసరం. వారి సహాయ సహకారాలు తోడ్పాటు లేకుండా సమాచారం సేకరించి వీటిని నిరోధించడం సాధ్యం కాకపోవచ్చు. స్థానిక పోలీసులను కూడా ఇందులో భాగస్వాములను చేయాలి. వారి పరిధిలో పెద్దఎత్తునమాదక ద్రవ్యాలు పట్టుబడితే వారిని కూడా బాధ్యులను చేయాలి. మానవ జీవితాలతో ఆటలాడుకుంటున్న ఈ మాదక ద్రవ్యాలను నిరోధించే విషయంలో మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపాల్సిన తరుణమిది. ఏదో ఒక రాష్ట్రం చర్యలు తీసుకుంటే ఆగే అవకాశాలు లేవు. అటు కేంద్రం, ఇటు రాష్ట్రాలు ఉమ్మడి కార్యాచరణ రూపొందించి అమలు చేయగలిగితే కొంతమేరకైనా నియంత్రించవచ్చు. అన్నిటి కంటే ముఖ్యంగా మాదకద్రవ్యాల ఉత్పత్తిలో, రవాణాలో, వినియోగంలో పట్టుబడితే జీవితకాలం జైళ్లలో మగ్గిపోవాల్సి వస్తుందనే భయం నేరస్తుల్లో ఏర్పడితే తప్ప ఆ మహమ్మారికి అడ్డుకట్టవేయలేం. రాజకీయలకు అతీతంగా అందరూ నేతలు, స్వచ్ఛంధ సంస్థలు, కలిసికట్టుగా ఈ రక్కసిని మట్టుపెట్టే యజ్ఞంలో పాలుపంచుకోవాలి. ●

# బీమారు రాష్ట్రాల కోసం దేశాన్ని విభజించి పాలిస్తారా?

**డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు**

ఏ దేశానికైనా రాష్ట్రాల సాధికారిత ముఖ్యమం. కేంద్రం కింద రాష్ట్రాలు నలిగిపోకూడదు. తమ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలు ఒకరకమైన విధానాలు, ఇతర పార్టీలు పాలనలో ఉన్న రాష్ట్రాలలో వేరే రకమైన విధానాల వలన దేశ సమైక్యత సమగ్రత దెబ్బతింటుంది. భారతదేశం కేంద్రీకృత సమాఖ్య వ్యవస్థగా పుట్టింది. ఈ సమాఖ్య వ్యవస్థలో అన్ని రాష్ట్రాలకు సమానావకాశాలు కేంద్రప్రభుత్వం కల్పించాలి. నేడు కేంద్రంలో ఉన్న ప్రభుత్వం జనాభా ప్రాతి పదికన పార్లమెంటరీ స్థానాలను, అసెంబ్లీస్థానాలను,నిర్ణయిస్తూ డీలిమిటేషన్ చేపట్టడం చూస్తున్నాం. బిజెపి పాలిత రాష్ట్రాలలో (వీటినే భీమారు స్టేట్స్) అధిక జనాభా గల రాష్ట్రాలుగా ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేస్తే ప్రస్తుత దక్షిణాది రాష్ట్రాల129 లోక్‌సభ సీట్లలో 20సీట్లు కోల్పోయి వారి భాగస్వామ్యం లోక్‌భలో 24 శాతం నుంచి 16 శాతానికి తగ్గిపోతుంది. పెరుగుతున్న జనాభాకి కావలసిన వసతులు కల్పించలేమని 1970లలో జనాభా పెరుగుదలను గణనీయంగా దక్షిణాది రాష్ట్రాలు తగ్గించుకుంటే అదే నేడు దక్షిణాది రాష్ట్రాలకు శాపంగా మారింది. దేశ ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న దక్షిణాది రాష్ట్రాలు పాలనాపరమైన విషయాలలో పార్లమెంట్లో వారి పాత్ర ఉత్తరాది రాష్ట్ర జనాభా ఆధిక్యం వలన తగ్గిపోతున్నది. ఐదు దక్షిణాది రాష్ట్రాల పన్నుల రాబడివాటా 36శాతం కాగా 24 ఉత్తరాది రాష్ట్రాల పన్నుల వాటా 64శాతమే. దక్షిణాది రాష్ట్రాల వాటా 36శాతం అయినా కేంద్ర ప్రభుత్వం నుంచి దక్షిణాది రాష్ట్రాలు పొందుతున్నది కేవలం 18.6 శాతం మాత్రమే. ఆదాయం కొద్ది జీఎస్టీ జనాభా కొద్దీ ఆదాయ పంపిణీ అంటూ దక్షిణాది రాష్ట్రాలు రూపాయి ఇస్తే వారికితిరిగి 30పైసలు మాత్రమే ఇస్తూ, అదే ఉత్తరాది రాష్ట్రాలు రూపాయి ఇస్తే నాలుగు రూపాయల వరకు వారి జనాభా పేదరికంలో ఉంటుందని ఇతర కారణాలు చెప్పి దేశఆదాయ వనరులను నేడు అప్పగించడం సమాఖ్య వ్యవస్థకు పూర్తిగా వ్యతిరేకమైనది. ఆశిష్‌బోస్ అనే జనాభా శాస్త్రవేత్త 1980 లలో బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలను భీమారు రాష్ట్రాలుగా అంటే జనాభా పరంగా ఆయుష్ ప్రమాణం పేదరికం, నిరుద్యోగం తలసరి ఆదాయం అత్యల్పస్థాయిలో ఉండి కనీస జీవన ప్రమాణాన్నికూడా పొందని జనాభా ఎక్కువగా ఉండడంతో భీమారు రాష్ట్రాలుగా బీమా రు అంటే వ్యాధిగ్రస్థమైన రాష్ట్రాలుగా పేర్కొంటారు. ప్రజల జీవన ప్రమాణాల రీత్యా ఈబీమారు రాష్ట్రాలు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే చాలా వెనుకబడి ఉన్నాయి. గ్లోబల్ మల్టీ డైమెన్షనల్ ఇండెక్స్ 2024లో మన దేశం 112దేశాలలో 105నది. దీనికి కారణంపైన పేర్కొన్న బీమారు రాష్ట్రాలలో అనేక జిల్లాల్లో కడు పేదరికంలో అల్పాభివృద్ధిలో వెనుకబడిన ప్రాంతాలుగా ఉండడంప్రధాన కారణం. ఇక్కడ ప్రజలు పేదరికంలో ఉపాధి అవకాశాలు లేక కొనుగోలుశక్తి అతి తక్కువగా, పోషక ఆహార లోపంతో ఆయుష్ ప్రమాణం అత్యల్ప స్థాయిలో ఉన్నది. దీనికి ప్రధానమైన కారణం ఈ రాష్ట్రాలలో జనాభా నియంత్రణ అమలు ఆశించిన మేరకు ఆనాడు జరగలేదు. 1970లలో అప్పటి ప్రభుత్వాలు జనాభా నియంత్రణ చేస్తే తప్ప మానవనరులను విద్య,వైద్య ఆదాయపరంగా అభివృద్ధి చేయలేమని కుటుంబ నియంత్రణతోనే మానవాభి వృద్ధి జరుగుతుందని కుటుంబ నియంత్రణ దేశవ్యాప్తంగా చేపట్టగా దక్షిణాది రాష్ట్రాలు ఈ విధానాన్ని అమలుచేయడం వలన నేడు దక్షిణాది రాష్ట్రాల జనాభా తగ్గుతూ వచ్చింది. అయితే ఈ బీమారు స్టేట్స్ కుటుంబ నియంత్రణను తూతూ మంత్రంగా అమలు చేయడంవలన జనాభా పెరిగింది. ఇప్పుడు జనాభాపరంగా దేశంలో డీలిమిటేషన్ చేసి పార్లమెంట్ సీట్లు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వంచూస్తోంది. బీమారు స్టేట్స్‌లో పార్లమెంటరీ సభ్యులను పెంచి పార్లమెంటును వారి అజమాయిషిలో అంటే ఉత్తరాది లేదా బీమారి స్టేట్స్ కనుసనుల్లోపెట్టి దేశ ఖజానాను కైవసం చేసుకునేందుకేనా? ఇప్పటికే ఉత్తరాది రాష్ట్రాలు పెట్టుబడిదారుల కనుసనుల్లో దేశంలోని ఖనిజ నిక్షేపాలు, ఓడరేవులు, బ్యాంకులు ఉన్నాయి. ఖనిజ సంపదను దోచుకునేందుకు అడ్డు వస్తున్నారని అడవులలో గిరిజనులను సైతం వదలడం లేదు. నేడు బీమారి రాష్ట్రాలకు తోడుగా ఉత్తరాఖండ్, జార్ఖండ్,చత్తీస్గఢ్ కొత్తగా బీమారి స్టేట్స్ పక్కన చేరినందున ఉత్తర భారత దేశం అంతా బీమారిగానే గ్లోబల్ మల్టీ డైమెన్షనల్ ఇండెక్స్ ద్వారా నిరూపింపబడినది. జనాభాను నియంత్రించండి దేశ అభివృద్ధికి తోడ్పడండి అన్న నాటి కేంద్రప్రభుత్వం ఆదేశానుసారం కుటుంబ నియంత్రణను పాటించడమేకాదు గణనీయ ఆర్థిక అభివృద్ధిని సాధించాయి. దక్షిణ భారత రాష్ట్రాలు కానీ దీనికి భిన్నంగా జనాభా నియంత్రణను పాటించని ఉత్తరాది రాష్ట్రాలు చాలావరకు అధిక జనాభాకు పేదరికానికి నిలయాలై బీమారి రాష్ట్రాలుగాఉన్నాయి. నేడుజనాభాను బట్టి దేశ ఆదాయాన్ని పంపిణీ చేస్తే కష్టపడి అభివృద్ధి సాధించిన దక్షిణాది రాష్ట్రాల ఆదాయమంతా ఈ బీమారి రాష్ట్రాలకు బదలాయించడం ఉత్తర భారత దేశ పాలకుల రాజనీతి పరిపక్వతఎంత మాత్రమూ సందేహించవలసిన అవసరంలేదు. ప్రజలు ఉద్యమాలకు పూనుకోకముందేభారత జాతీయ సమైక్యతను కాపాడుతారని ఆశిస్తున్నారు. ●



# ప్రజావాక్కు

## నోటిఫికేషన్‌కి అభ్యర్థుల ఎదురుచూపులు

జాబ్ క్యాలండర్ ప్రకారం ఫిబ్రవరి డీ.ఎస్సీ అని ఏప్రిల్‌లో టెట్‌అని జాబ్ క్యాలండర్‌లో పేర్కొన్నారు. కానీ ఎస్సీ వర్గీకరణ అంశం రిజర్వేషన్ అంశాలుచర్చకు రావడం తో గత రెండు నెలలుగా కొత్త ఉద్యోగాల నోటిఫికేషన్స్‌పై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం వెలువర్చలేదు. తాజాగా ఎస్సీ వర్గీకరణ అంశం రాష్ట్రఅసెంబ్లీలో ఆమోదం పొందడంతో గవర్నర్ ఆమోదంతో అతి త్వరలోనే చట్ట రూపం దాల్చనున్నది. మరోపక్క ఎస్సీ రిజర్వేషన్ అంశాలురాష్ట్రం నుండి కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి వెళ్లనున్నది. దీంతో కొత్త ఉద్యోగాల భర్తీపై క్లారిటి కోసం నిరుద్యోగులు ఎంతో ఆశతో ఉన్నారు. గత నెలలోనే టెట్ ఫలితాలు విడుదల చేశారు. కానీ టీచర్ పోస్టుల భర్తీకి డీ.ఎస్సీపై ఎలాంటి నిర్ణయంరాలేదు. ఇప్పుడు ఎస్సీ వర్గీకరణ అంశం ఫైనల్ కావడంతో త్వరగా డీ.ఎస్సీ జారీ చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు. 6వేల టీచర్‌పోస్టులు ఖాళీగా ఉన్నాయనీ ప్రభుత్వం పలు మార్లు వెల్లడిస్తున్నారు.

-రావుల రామ్మోహన్ రెడ్డి, హైదరాబాద్

## మద్యపానాన్ని నిషేధించాలి

మద్యపానంవల్ల కుటుంబ యజమానులను అదుపుచేయలేక, పిల్లల పోషణ భారంతో చాలా కుటుంబాలు దుర్భర పరిస్థితులతో బాధపడుతున్నాయి. మద్యపానం వల్ల నష్టాలు, పరిణామాలు తెలిసినా దాన్ని తగ్గించేస్థితికి మనో నిగ్రహం లేక బానిసలుగా ఉంటున్నారు. ఈ స్థితిలో వారికి కుటుంబ సభ్యులతో మెడికల్ కౌన్సిలింగ్ ఇస్తే మంచిది. లేదామానసిక వైద్యులచే ది అడిక్షన్‌వైద్యం ఇస్తేకొంతమార్పు వస్తుంది. చాలా వరకు చెడు స్నేహంతో మొదలై వివేకం కోల్పోతారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే కేర్ కార్యక్రమం మంచిదే. వీటికి బాధితకుటుంబాల సభ్యులు స్పందించి వారి స్థాయిలో పనిచేస్తే చాలా వరకు వ్యసన విముక్తి అవుతారు.

-బొల్లోజు మేఘనాధ్, విశాఖపట్నం

## ప్రాథమిక విద్యలో హిందీ వద్దు

ప్రాథమిక విద్యలోతెలుగు,హిందీ,ఇంగ్లీష్ భాషలు బోధించడం వలన విద్యార్థులకు ఏ భాష సరిగా రావడం లేదు. త్రిభాష సూత్రం ప్రకారం హిందీని 8వ తరగతి నుండి బోధించాలి. తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ప్రాథమిక విద్యలో హిందీని బోధించడాన్ని నిషేధించాలి.

-పుట్లూరి రాంనర్సింహా రెడ్డి, నల్గొండ జిల్లా

## ప్రజాసేవకులకు పెరిగిన జీతం

ఈమధ్య కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు సభ్యులకు ఇరవై నాలుగు శాతం జీతాలు ఏప్రిల్ 2023 నుంచి పెంచారు. వీరు ప్రజాసేవకులు మాత్రమే. ఉద్యోగులు కాదు. రోజువారీ భత్యం 2500 రూపాయలకు పెంచారు. ఇవికాక అనేక అలవెన్సులు. వీరికిపెన్షన్లు 30000కు పెంచారు. ప్రతిఏటా వేలకోట్ల రూపాయలు వీరికోసం ఖర్చు అవుతోంది. ఇది ప్రజల సొమ్ము అనేది జగద్విదితం. ఇక దేశంలోని ఎమ్.ఎల్.ఎ.లు కూడా ఏటా వేల కోట్లు పొందుతున్నారు. ఇ.పి.ఎస్. 1995 రిటైరీలు గత రెండు దశాబ్దాలుగా తమ వెయ్యి రూపాయల ఫించన్ను పెంచమంటే ప్రభుత్వం దగ్గర డబ్బులేదని గట్టిగా బుకాయిస్తారు. బండారు దత్తాత్రేయ, సదానంద గౌడ్, అనేక కమిటీలు కనీస ఫించన్ను 3000 ఇవ్వాలని రికమెండ్ చేసాయి. ఇది జరిగి పదేళ్ళయింది. అప్పుడేయిస్తే డి.ఎ.లుకలపి ఈ రోజుకు పదివేలు దాటేది.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## అప్పుల ఊబిలో రాష్ట్రాలు

భారత దేశ రాజ్యాంగం ప్రకారం బలమైన కేంద్రిత సమాఖ్య వ్యవస్థ ఉన్నది. అయితే అది గడిచిన దశాబ్దకాలంగా పూర్తిగా ఆధిపత్య సమాఖ్యగా మారిపోవడమే అసలైనవిషాదం. అయితే కేంద్రం నుండి నిధులురావాలి అంటే కొన్నిషరతులకు ఒప్పుకోవాలి అనే విచిత్ర పరిస్థితి దాపురించింది. అయితే ఇది ఎంత మాత్రం కేంద్ర రాష్ట్ర సంబంధాలకు మంచిది కాదు. ఒకవైపు జీఎస్టీని తెచ్చి సర్‌చార్జీలు పెంచుకుంటూ కేంద్రం సంపద పోగేసుకుంటుంటే రాష్ట్రాలు మాత్రం అప్పులఊబిలో చిక్కుకొని పోతున్నాయి. ఉత్తరాది రాష్ట్రాలు లోపంతో కూడిన ప్రణాళికలు అమలు చేస్తూ దక్షి ణది రాష్ట్రాలపైన పడి పరాన్న జీవులుగా బతుకుతున్నాయి. ఇది ఎంత మాత్రం సమానా అభివృద్ధి అనే భావనకు తోడ్పాటును ఇవ్వదు.

-భారత అవినాష్, జనగామ

## తూకాలలో మోసాలు ఆగేదెలా!

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలలోని కూరగాయల మార్కెట్లు, రోడ్ల వెంబడి అమ్మే కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్, చికెన్, మటన్ విక్రయించే షాపులలో తూకంలలో భారీ మోసాలుజరుగుతున్నాయి. దీనివల్ల వినియోగదారులు తీవ్రంగా మోసపోతున్నారు. కిలోకూరగాయలు కొన్న 800 గ్రాములు వస్తున్నాయి. ఎలక్ట్రానిక్స్ కాంటాలో కూడా మోసం చేయడం జరుగుతుంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.


-కామిడి సతీష్ రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

# ఉద్యమకారుల పెన్షన్లకు తొలగనున్న తెర



ప్రొ. ననుమాస స్వామి

తెలంగాణ నిత్య ఉద్యమ స్ఫూర్తికి నిదర్శనంగా నిలుస్తుంది. 1969లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర పోరాటం మొదలై 1970దాకా కొనసాగింది. అప్పుడు 369మంది ఉద్యమకారులు పోలీస్ కాల్పుల్లో మరణించినప్పటికీ ప్రధాని ఇందిరా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయలేదు. అప్పుడే 'ఇందిరాగాంధీని బలి దేవతం'టూ ప్రజలు నిరసించారు. అయితే, అదే సమయంలో హిమాచల్ ప్రదేశ్‌ని కొత్త రాష్ట్రంగా ప్రకటించడం పుండు మీద కారం చల్లినట్లైంది. చింత చచ్చినా పులుపు చావలేదనే సామెతగా కాంగ్రెస్, తెలుగుదేశం పాలనలో తెలంగాణ ప్రాంతానికి అన్యాయం జరిగినప్పుడల్లా ఉద్యమం తెరమీదికి వచ్చేది. అరవై ఏండ్ల ఉద్యమ తెలంగాణ కోసం 'ఎన్నారై'లు సైతం నడుం బిగించి ఉద్యమం చేశారంటే అతిశయోక్తిగాదు. ప్రత్యేక తెలంగాణరాష్ట్రం కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన తొలి(1969)తెలంగాణ ఉద్యమకారుల అనంత త్యాగాలపై పాలకులు చూపుతున్న తీవ్ర వివక్షతను మండలిలో, అసెంబ్లీలోనూ ప్రజా ప్రతినిధులు కొందరు లేవనెత్తారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్యమకారుల బాధ్యతను అప్పజెప్పిన ప్రజా ప్రతినిధిగాక వేరే సభ్యులు శాసనసభల్లో లేవనెత్తడం శుభ పరిణామం. అడుగంటిన ఉద్యమకారుల ఆశలు చిగురించడమేకాదు భావికి భరోసానిచ్చాయి. పదేండ్లుగా నలుగుతున్నతొలి ఉద్యమకారుల పెన్షన్ల సమస్య పరిష్కారమయ్యే దిశగా అడుగులు పడ్తున్నాయి. 2018 నుండి తెలంగాణ హై కోర్ట్ మెట్లెక్కి గుర్తింపు పొందిన 278 మంది తొలి ఉద్యమకారుల మనస్సులు ఇప్పుడు నెమ్మదించాయి. తల్లి ఎదమీద పాలకుపునుకులాడే శిశువుల్లా తెలంగాణ తొలి ఉద్యమకారులు తండ్లాడింరు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే 1969 ఉద్యమకారుల నాయకుడొకరు తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ని 2015లో కల్సి జైలుపాలైన ఉద్యమకారులకు పెన్షన్లను ఇవ్వాలని కోరారు. ఆయన భూరి మనస్సుతో నూతన తెలంగాణ రెండో అవతరణ(2016) దినోత్సవ వేడుకల్లో 100మంది ఉద్యమకారులకు పెన్షన్ అమలుకు ఒక జాబితా తయారు చేసి ప్రకటించబోయారు. నకిలీ ఉద్యమకారులు ఆ పెన్షన్ జాబితాను వేడుకల సభలోనే తీవ్రంగా అడ్డుకొన్నారు. ఉద్యమ కిశోరాలు షాక్‌కు గురయ్యారు. అంతేగాదు సభ రసాభాసమవుతుందని ముఖ్యమంత్రి ముందేగ్రహించి రాష్ట్ర గవర్నర్ మాట్లాడ్డం ఆపగానే తాను ప్రసంగించకుండానే ఆ వేదిక దిగి పోయిన దుర్గతి పట్టింది. అంతే ఆనాటి నుండి 2018వరకు ఉద్యమకారుల పెన్షన్ల ఊసేఎత్తలేదు. న్యాయానికి ఊపిరి పోసిన హైకోర్ట్ ఉద్యమంలో చావడమే తప్ప చంపడం తెలియని వారు తెలంగాణ తొలి ఉద్యమకారులు. అంతేగాదు బుల్లెట్లకు గుండె చూపారేగానీ ఆత్మహత్యలకు ఎవరూ పాల్పడలేదు. 1969లో సెంట్రల్ జైలు, యూనివర్సిటీ కాలేజీలు, ప్రభుత్వ కాలేజీలు, పాఠశాలలు జైలుగా మార్చి ఉద్యమకారుల్ని నిర్బంధించిన దారుణమైన కాలం. పోలీస్ కాల్పుల్లో చనిపోయిన వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. పి.డి.చట్టం, 353,341,143 సెక్షన్స్ కింద కేసులు పెట్టి ప్రభుత్వం సెంట్రల్ జైల్లో తోసేసింది. 1969 ఉద్యమంలో లాఠీదెబ్బలు, జైలులో శిక్షలవల్ల కుటుంబాలు విచ్ఛిన్నం అవడమేకాదు ప్రభుత్వ ఉద్యోగాలకు దూరమైపోయారు. దానితో కటిక పేదరికాన్ని ఇన్నాళ్లుగా అనుభవిస్తూ వచ్చారు. కాటికి కాలుచాచి, రాణుగుల్లా దుర్భరమైన జీవితాన్ని భరించలేక 2018లో తొలి ఉద్యమకారులు కొందరు హైకోర్ట్ మెట్లెక్కారు. ఉద్యమకారుల త్యాగాలవల్లే రాష్ట్రం ఏర్పడిందని పెన్షన్లు వారి హక్కు అంటూ ఉద్యమకారులు పెన్షన్ రూపొందించమని, పెన్షన్లతోబాటు ఇతర రాయితీలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తే వారికి పెన్షన్లు కల్పించాలని తెలంగాణ హైకోర్ట్ 2023లోనే ప్రభుత్వాన్ని ఆదేశించింది. సెంట్రల్ జైలులో శిక్ష అనుభవించిన 278 మంది ఉద్యమకారులు ఇటీవల తెలంగాణ హైకోర్టు నుండి పెన్షన్ అర్హత సంపాదించారు. నూతన రాష్ట్రాలు, ఉత్తర్ ఖండ్, జార్ఖండ్ రాష్ట్ర ఉద్యమకారులకు 2011లో, కేంద్ర పాలిత ప్రాంతమైన లక్ష్యదీప్ రాష్ట్రంలో ఇటీవల పెన్షన్లు అమలు చేస్తున్నారు. ఈ రేవంత్ ప్రభుత్వం తరఫున త్యాగఘనుల వారసులు రాహుల్, ప్రియాంక గాంధీ హామీ ఇచ్చిన తెలంగాణ ఉద్యమకారులకు పెన్షన్లు, భూమి, ఇందిరమ్మ ఇండ్లు అమలు చేస్తే కబోదుల కళ్లు తుడిచినట్టవుతుంది. ●




మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అమెరికా అధ్యక్షుల్లో టాప్ బిలియనీర్‌గా ట్రంప్

## అధికారంలోకి రాగానే మూడురెట్లు పెరిగిన సంపద



**వాషింగ్టన్, మార్చి 28:** హురూన్ బిలియనీర్‌ల జాబితాలో అమెరికా అధ్యక్షుడు అత్యంత సంపన్నుడుగా నిలిచారు. ఇప్పటివరకూ పనిచేసిన అమెరికా అధ్యక్షులను లెక్కిస్తే ట్రంప్ మొదటి స్థానంలో నిలిచారు. 78 ఏళ్ల అమెరికా అధ్యక్షుడు టాప్ 500 బిలియనీర్ల జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు. ట్రూత్ సోషల్ మీడియాలో 53శాతం వాటాతో ఆయన సంపద ఒక్కసారిగా 7.2 బిలియన్ డాలర్లకు పెరిగింది. ట్రంప్ సంపద దాదాపుగా మూడురెట్లుపెరిగింది. ఆయనకున్న ఫ్యాన్‌బేస్, ఆయన స్థాపించిన ప్లాట్ ఫామ్‌పవర్‌తో ఆయనకు సంపద అనుకోకుండాప ఎరుగుతూ వస్తోంది. ట్రంప్ ఆయన బిలియనీర్ భాగస్వామి ఎలాన్‌మస్క్, పీటర్ థీల్‌లు కూడా ఎన్నికలనంతరం ఎంతో లాభపడినట్లు తెలుస్తోంది. ఆయన అత్యంత సన్నిహితులు ఎలాన్ మెస్క్ టెక్ ఇన్వెస్టర్ పీటర్ థీల్‌ల సంపద సుమారు 82శాతం పెరిగి 420 బిలియన్ డాలర్లకు పెరిగింది. పీటర్‌థీల్ సంపద 67శాతం పెరిగి 14 బిలియన్ డాలర్లకు చేరింది. అమెరికా అధ్యక్షుడుకాగానే ట్రంప్ సంపద సుమారుగా మూడురెట్లు పెరిగి 7.2 బిలియన్ డాలర్లకు చేరినట్లు హురూన్ నివేదిక ప్రకటించింది. ఎలాన్ మస్క్ మరోసారి ప్రపంచంలోనే అత్యంత బిలియనీర్‌గా నిలిచారు. ఈసందర్భంగా ఎన్నికల తర్వాత డొనాల్డ్‌ట్రంప్ సంపద కొత్తశిఖరాలకు చేరింది. ఫోర్బ్స్ అంచనాలప్రకారంచూస్తే ఆయన సంపద 6.7 బిలియన్ డాలర్లకు చేరింది. రియల్‌ఎస్టేట్‌నుంచే ఎక్కువగా సమకూరుతున్నట్లు తేలింది. ట్రంప్ ఆర్గనైజేషన్‌లో లగ్జరీ గోల్ఫ్ రిసార్టులు, ఐకానిక్ మారాలాగో ఎస్టేట్‌లు నుంచి ఆయనకు లాభాల పంటపండింది. ట్రంప్ మెమెకాయిన్‌నుంచి కూడా భారీ ఎత్తున వచ్చింది. ఆకాశమే హద్దుగా మెమెకాయిన్ విలువలుపెరిగాయి. ఇపుడు మెమెకాయిన్ ఆయన సంపదలో 89శాతం వాటాతో ఉంది. 47వ యుఎస్ అధ్యక్షుడుగా రెండోసారి పగ్గాలుచేపట్టిన ట్రంప్ ఆర్థిక సామ్రాజ్యం రానురాను పెరుగుతూపోతోంది. సాంప్రదాయ ఆస్తులతోపాటు డిజిటల్ వెంచర్లు కూడా కొత్తగా వస్తున్నాయి. అమెరికాలో 2024 నాటికి 870మంది బిలియనీర్లు ఉన్నారు. వీరిలో 96 మంది కొత్తగా వచ్చిచేరారు. ఫ్రాన్స్ బెర్నార్డ్ ఆర్నాల్ట్ మాత్రం టాప్ టెన్‌లో నిలిచారు. ఎల్వీఎంహెచ్ లగ్జరీ సంస్థ సుమారు 18 బిలియన్ డాలర్లు నష్టపోయింది. దీనితో ఆయన 157 బిలియన్ డాలర్లతో ఏడోస్థానానికి వచ్చేసారు. హురూన్ టాప్ 100లో 45 మంది అమెరికన్ బిలియనీర్లు ఉన్నారు. అమెరికాలోని టాప్ మూడు పరిశ్రమలు సాఫ్ట్‌వేర్,సర్వీసస్ 106మంది బిలియనీర్లుఉన్నారు. మీడియా ఎంటర్‌టైన్‌మెంట్‌లో 111 మంది, ఆర్థికసేవల్లో 170 మంది బిలియనీర్లున్నారు. ఇక మహిళల్లో చూస్తే 130 మంది బిలియనీర్లున్నారు. చైనాతో 823మంది ఉంటే రెండోస్థానాలో అమెరికా ఉంది. వీరిలో 129 మంది న్యూయార్క్‌లోనే ఉన్నారు. మూడోస్థానంలో భారత్‌నిలిచింది. 284 మంది బిలియనీర్లున్నట్లు అంచనా.



## 19 నుంచి రాహుల్ అమెరికా పర్యటన

**న్యూఢిల్లీ, మార్చి 28:** లోక్‌సభలో ప్రతి పక్షనేత రాహుల్‌గాంధీ అమెరికా పర్యటనకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు పార్టీ వర్గాలు వెల్లడించినట్లు కథనాలు వస్తున్నాయి. ఆ కథనాల ప్రకారం ఏప్రిల్ 19 నుంచి రాహుల్ అగ్రరాజ్యంలో పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఆయన బ్రౌన్ యూనివర్సిటీని సందర్శించారు. బోస్టన్‌లోని ప్రవాసభారతీయులతోనూ ఆయన భేటీ అయ్యే అవకాశంఉంది. అయితే ఆయన యూఎస్‌లో ఎన్ని రోజులు పర్యటిస్తారనేది తెలియదు. దీనిపై పార్టీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనలేదు. ఇక గతేడాది సెప్టెంబర్‌లో మూడ్రోజులు రాహుల్ యూఎస్‌లో పర్యటించారు. ఆ సమయంలో ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో రిజర్వేషన్లు, భారత్‌లో మత స్వేచ్ఛ వంటి అంశాలపై రాహుల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారంరేపాయి. ప్రస్తుతం భారత్‌లో అదివాసీలు, దళితులు , ఒబిసిలకు సరైన ప్రాధాన్యం దక్కడం లేదని రాహుల్ అన్నారు. అప్పటివరకు అభివృద్ధిలో వారి భాగస్వామ్యం కూడా అంతంతమాత్రంగానే ఉంటుందని, దేశంలో అన్ని వర్గాల వారికి పాదర్శకంగా అవకాశాలు లభించే పరిస్థితులు వచ్చిన తర్వాతే రిజర్వేషన్ల రద్దు గురించి తమ పార్టీ ఆలోచిస్తుందన్నారు. ఇక, సిక్కులను ఉద్దేశిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. బిజెపి ఆయన మాటలను ఖండించింది. విదేశాల్లో భారత్ పరువు తీస్తున్నారని మండిపడింది. సిక్కులను ఉద్దే శిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా బిజెపి మద్దతున్న ఒకగ్రూప్ ఢిల్లీలోని సోని యాగాంధీ నివాసంవెలుపల నిరసనలు తెలియజేసింది.

# రంజాన్ చివరి శుక్రవారం ప్రార్థనల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన

## వక్ఫ్ సవరణ బిల్లుపై అఖిలభారత ముస్లిం పర్సనల్ లాబోర్డు పిలుపు

**న్యూఢిల్లీ, మార్చి 28:** వక్ఫ్‌సవరణ బిల్లుపై తమ నిరసనలకు అఖిలభారత ముస్లిం పర్సనల్ లాబోర్డు పిలుపునిచ్చింది. రంజాన్ మాసంలోని చివరి శుక్రవారం ప్రార్థనలకుగాను కుడిచేతికి నల్ల బాడ్జీని ధరించి ప్రార్థనలకు వెళ్లాలని పిలుపునిచ్చింది. ముస్లిం లాబోర్డు ప్రధాన కార్యదర్శి మౌలానా మహ్మద్ ఫజ్లురహీమ్ ముజాద్దీదీ ఈసందర్భంగా విడియో సందేశం ఇచ్చారు. ఈ సందేశాన్ని బోర్డు ఎక్స్ హ్యాండిల్‌లో విడుదలచేసారు. వక్ఫ్‌సవరణ బిల్లుకు ముస్లిం లాబోర్డు తన నిరసనలను కొనసాగించాలని జుమా తుల్ విదా రోజున కూడా మన నిరసనలు తెలపాలని ఆయన పిలుపునిచ్చారు. ముస్లింలు తాము ధరించిన నల్లబాడ్జీతో విడియోలు తీసుకుని వాటిని ఆన్‌లైన్‌లో ముస్లిం పర్సనల్ లాబోర్డుకు పంపించాలని సూచించారు. అంతకుముందు దేశవ్యాప్తంగా వక్ఫ్



సవరణ బిల్లుకు నిరసనలు ఆందోలనలు కొనసాగించాలని పిలుపనిచ్చింది. రాష్ట్ర అసెంబ్లీల ముందు భారీ ఎత్తున ముస్లింలతో నిరసనలు చేయాలని సూచించింది. పాట్నా, విజయవాడల్లో 29వ తేదీ నిర్వహించాలని మొదటిదశ నిరసనల్లో ఈ బైఠాయింపులు నిర్వహించాలని సూచించింది. వక్ఫ్‌సవరణ బిల్లులపై నిరసనలు బీహార్‌ను వణికించాయి. రాజకీయ పార్టీలు కూడా ఎఐఎంపిఎల్‌బికి నిరసనగా మహాధర్నాలో పాల్గొన్నాయి. విధానసభ ప్రాంతంనుంచి కిలోమీటరు దూరంవరకూ ముస్లిం ప్రజానీకం నిరసనల్లో పాల్గొన్నారు. వెంటనే ఈ బిల్లును పస31 మంది పర్సనల్‌లాబోర్డు సభ్యుల యాక్షన్ కమిటీ రాజ్యాంగబద్ధమైన న్యాయమైన ప్రజాస్వామ్యయుత నిరసనలన్నింటినీ చేపట్టి బిల్లును వ్యతిరేకించాలని కోరారు. అలాగే హైదరాబాద్, ముంబయి, కోల్‌కత్తా, బెంగళూరు, మలేర్‌కోట్ల, రాంచిల్లో కూడా నిరసనలు చేయాలని పిలుపునిచ్చింది. ఈ సవరణబిల్లుపై 31 మంది ఉనన ప్యానెల్ అనేకసార్లు సమావేశం నిర్వహించి విచారణలుచేసింది. లెక్కకుమించిన సవరణలు తీసుకురవాలని సూచించింది. 655 పేజీల నివేదికను లోక్‌సభ స్పీకర్‌ఓంబిర్లాకు గత జనవరి 30నే అందచేసింది.ఆతర్వాత ప్యానెల్ కమిటీ ఈ నివేదికను కొన్ని సవరణలుచేసింది. 15-11 మెజార్టీ ఓటుతో ఇందుకు ఆమోదం లభించింది. ఆతర్వాత మళ్లీ జెపిసికి నివేదించారు.

# అమెరికాతో పాత సంబంధాలకు తెర


## కెనడా ప్రధాని మార్క్ కార్నీ

**ఒట్టావా, మార్చి 28:** అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సుంకాల పేరుతో పొరుగుదేశం కెనడాతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కయ్యానికి కాలు దువ్వుతున్నారు. ఇప్పటికే ఆ దేశ ఉత్పత్తులపై భారీగా టారిఫ్ లు విధించగా. తాజాగా వాహన దిగుమతులపైనా 25 శాతం సుంకాన్ని ప్రకటించారు. దీనిపై కెనడా ప్రధాని మార్క్ కార్నీ తీవ్రంగా స్పందించారు. ఈ నిర్ణయంతో ఇరు దేశాల మధ్య ఉన్న పాత బంధం ముగిసిపోయిందన్నారు. ట్రంప్ టారిఫ్ ప్రకటనతో తన ఎన్నికల ప్రచారాన్ని అర్థంతరంగా ముగించుకొని మార్క్ కార్నీ.. ఒట్టావాకు తిరిగొచ్చి కేబినెట్ సభ్యులతో హుటాహుటిన సమావేశమయ్యారు. అమెరికాతో వాణిజ్య యుద్ధంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చలు జరిపారు. 'ట్రంప్ సుంకాలు అన్యాయమైనవి. ఈ చర్యలతో ఇరుదేశాల మధ్య ఇప్పటివరకు



ఉన్న స్నేహబంధాన్ని ట్రంప్ శాశ్వతంగా మార్చేస్తున్నారు. ఆర్థికవ్యవస్థ బలోపేతం, భద్రత, సైనిక సహకారం విషయంలో అమెరికా-కెనడా మధ్య ఉన్న పాత బంధం నేటితో ముగిసిపోయింది. అమెరికా విధిస్తున్న ఈ సుంకాలను మేం ప్రతీకార వాణిజ్య చర్యలతోనే ఎదుర్కొంటాం. ఆ నిర్ణయాలు అగ్రరాజ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. మా దేశాన్ని రక్షించుకోవడం కోసమే ఈ టారిఫ్‌లకు మేం ప్రతీకార చర్యలు తీసుకుంటున్నాం' అని కెనడా ప్రధాని వెల్లడించారు. ఏప్రిల్ 3 నుంచి అమెరికా దిగుమతి చేసుకునే వాహనాలపై 25 శాతం సుంకాలు అమలులోకి వస్తాయని ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయం కెనడా ఆటో పరిశ్రమకు పెద్ద ఎదురుదెబ్బేనని విశ్లేషకులు భావిస్తున్నారు. దాదాపు 5 లక్షల ఉద్యోగాలపై ఇది ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉందన్నారు. దీంతో కెనడా సర్కారు తీవ్రంగా స్పందించింది. ఇది తమ కార్మికులపై ప్రత్యక్ష దాడి అని అభివర్ణించిన మార్క్ కార్నీ.. అగ్రరాజ్యంపై త్వరలో ప్రతీకార సుంకాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు. దేశీయ తయారీని వేగవంతం చేసేందుకు ఈ సుంకం విధిస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. అయితే విడిభాగాలు, తయారీ అంతర్జాతీయ సరఫరాఐ ఆధారపడిన అమెరికా వాహన కంపెనీలకు తాజా పరిణామం ఆర్థిక భారం అవుతుందన్నదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

# యుఎస్-గ్రీన్‌ల్యాండ్ వ్యవహారంతో మాకు సంబంధం లేదు: పుతిన్



**మాస్కో, మార్చి 28:** గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికాలో విలీనం చేసుకోవాలన్న ట్రంప్ ప్రణాళికలతో తమకు ఏ సంబంధం లేదని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. ఆయన ఆర్కిటిక్ పోర్టు నగరం మురుమాన్స్క్‌లో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'సంక్షిప్తంగా చెప్పాలంటే గ్రీన్‌ల్యాండ్ విషయంలో అమెరికావి చాలా సీరియస్ ప్రణాళికలు. వీటికి లోతైన చారిత్రక మూలాలున్నాయి. అమెరికా ప్రణాళిక ప్రకారం.. దాని భౌగోళిక-వ్యూహాత్మక, సైనిక-రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రయత్నాలు చేస్తుంది. గ్రీన్‌ల్యాండ్ అంశం రెండు దేశాలకు సంబంధించింది. రష్యాతో దానికి ఎలాంటి సంబంధం లేదు' అని పుతిన్ పేర్కొన్నారు. రష్యా సహా ప్రపంచ దేశాల్లో ఆర్కిటిక్ ప్రాధాన్యం పెరుగుతోందని పుతిన్ అభిప్రా యపడ్డారు. కానీ, దురదృష్టవశాత్తూ భౌగోళిక రాజకీయ పోటీ, ఈ ప్రాంతంలో పొజిషన్ కోసం ప్రయత్నాలు తీవ్రమయ్యాయి. ఇక గ్రీన్‌ల్యాండ్ యాజమాన్యం విషయం నేరుగా ఎక్కడా జోక్యం చేసుకోకపోయినా ఘర్షణలకు ఉత్తర ప్రాంతం వేదికగా మారుతుందన్న ఆందోళన మాస్కోలో ఉందన్నారు. ఓ రకంగా ఇవి ట్రంప్ ప్రణాళికలపై తమకే అభ్యంతరం లేదని పరోక్షంగా చెప్పినట్టయిందని నిపుణులు చెబుతున్నారు.

**వాన్స్ పర్యటనకు ముందు వ్యాఖ్యలు:** గ్రీన్‌ల్యాండ్‌పై పుతిన్ వ్యాఖ్యలు చాలా వ్యూహాత్మక సమయంలో వెలువడ్డాయి. శుక్రవారం అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, ఆయన సతీమణి ఉషా వాన్స్ గ్రీన్‌లాండ్‌లోని అమెరికా సైనిక స్థావరాన్ని సందర్శించనున్నారు. ఈ పర్యటనపై ఇప్పటికే గ్రీన్‌ల్యాండ్, డెన్మార్క్ గుర్రుగా ఉన్నాయి. తొలుత ఉషా ఒక్కరే అక్కడికి వెళ్లాల్సి ఉంది. కానీ, తన సతీమణిపై వస్తున్న విమర్శలు గమనించి జెడి వాన్స్ కూడా టూర్‌కు సిద్ధమయ్యారు. మరోవైపు ఈ పర్యటనలో డెన్మార్క్ ప్రభుత్వాన్ని ఆయన విమర్శించే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

# వైట్‌హౌస్‌లో ట్రంప్ ఇఫ్తార్ విందు

**వాషింగ్టన్, మార్చి 28:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లోముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముస్లింలతో కలిసి ట్రంప్ విందు ఆరగడించారు. ఇటీవల జరిగిన అమెరికా ఎన్నికల్లో రికార్డుస్థాయిలో ఓట్లువేసినందుకు ముస్లింలకు ట్రంప్ కృతజ్ఞతలు తెలిపారు. 2024లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ట్రంప్ భారీ విజయం సాధించారు. ఇఫ్తార్ విందు సందర్భంగా ట్రంప్ ఈ విషయాలను గుర్తుచేసారు. లక్షలాదిమంది ముస్లింలు ఈ ఎన్నికల్లో పాల్గొని తనకు మద్దతుగా నిలిచారని ట్రంప్ అన్నారు. ముస్లిం సమాజం అంతా తనకు అండగా నిలిచిందని, అధ్యక్షుడిగా ఉన్నంతకాలం ముస్లింలకు అండగా ఉంటానని ట్రంప్ హామీ ఇచ్చారు.





# త్రిభాషా సూత్రం, డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా తమిళగ వెట్రి కజగం పార్టీ తీర్మానం

**చెన్నై, మార్చి 28:** జాతీయ విద్యావిధానంలోని త్రిభాషా సూత్రం, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై కేంద్రం, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదం జరుగుతున్న సంగతిత తెలిసిందే. ఈ క్రమంలోనే వీటిని వ్యతిరేకిస్తూ తమిళగ వెట్రి కళగం పార్టీ తీర్మానాలను ఆమోదించింది. శుక్రవారం తిరువన్మయూర్‌లో తొలి జనరల్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో వక్ఫ్ సవరణ బిల్లుతో సహా మొత్తం 17 తీర్మానాలను ఆ పార్టీ ఆమోదించింది.

ఈ సమావేశంలో పార్టీ అధ్యక్షుడు విజయ్ పాల్గొన్నారు. సమావేశంలో వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని కోరాలని పార్టీ నిర్ణయించింది. తాము ద్విభాషా విధానానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపింది. విద్యావిధానంలో మూడు భాషల విధానం అమలు ప్రతిపాదన ఫెడరలిజానికి విరుద్ధమని, దీన్ని ఎప్పటికీ తాము అంగీకరించమని స్పష్టం చేసింది. డీలిమిటేషన్‌కారణంగా దక్షిణాది రాష్ట్రాల సీట్లు తగ్గుతాయని తీర్మానంలో పేర్కొంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో డ్రగ్స్ వాడకం పెరిగిపోయిందని, దీన్ని నియంత్రించడంలో అధికారి డిఎంకె ప్రభుత్వం విఫలమైందని ఆరోపించింది. ఉద్యోగులకు పాత పెన్షన్ పథకంపై ఆ పార్టీ తప్పుడు వాగ్దానాలు చేస్తోందని పేర్కొంది.

శ్రీలంకలో అరెస్టయిన భారతీయ మత్స్యకారుల సమస్యను తమిళగ వెట్రి కళగం పార్టీ లేవనెత్తింది. మత్స్యకారులకు అండగా ఉంటామని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది.



# అరవింద్ కేజ్రీవాల్‌పై మరో కేసు నమోదు

## ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించిన ఆరోపణలు

**న్యూఢిల్లీ, మార్చి 28:** ఆప్ అధినేత మాజీ సీఎం అరవింద్‌కేజ్రీవాల్‌పై ఢిల్లీపోలీసులు మరోకేసు నమోదు చేసారు. రాజధాని నగరంలోని ద్వారక ప్రాంతంలో ప్రభుత్వ ఆస్తుల సుందరీకరణను పాడుచేసారన్న అభియోగంపై ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసారు. మార్చి 11వ తేదీ కోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ఆధారంగా ఈ కేసును నమోదుచేసారు. ముందు కేసు నమోదు చేసి కోర్టుకు నివేదిక ఇవ్వాలని కోరారు. కోర్టు ఆదేశాలకు అనుగుణంగానే ఢిల్లీపోలీసులు తమ నివేదికను అదనపు చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ నేహా మిట్టల్‌కు అందచేసారు. రౌస్ అవెన్యు కోర్టుపరిధిలో ఈ కేసు నమోదయింది. ప్రస్తుతం విచారణ కొనసాగుతోందని, పాతకాలం తేదీలున్నందున కొంత విచారణకు అదనపు సమయం పడుతోందని, సమగ్ర దర్యాప్తు అనంతరమే నివేదిక ఇస్తామని కోర్టుకు తెలిపారు. ఏప్రిల్ 18వ తేదీకి కోర్టు తదుపరి విచారణ వాయి దా వేసింది. కేజ్రీవాల్, గులాబ్‌సింగ్; తదితర నేతల భారీ చిత్రాలతో ఉన్న భారీ హోర్డింగ్‌లు ఏర్పాటుచేసి చట్టవ్యతిరేకంగా వివిధ ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటుచేసారని ద్వారకకు చెందిన శివకుమార్ సక్సేనా ఫిర్యాదులు చేసారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగంచేస్తూ ఈభారీ బ్యానర్లు ఏర్పాటు చేసారని ఢిల్లీ ప్రభుత్వ ఆస్తుల వికృతీకరణ నిరోధక చట్టం 2007 ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ప్రాథమికంగా 2022లో ద్వారక సౌత్‌పోలీసులు ప్రగతినివేదిక దాఖలుచేసారు. ఫిర్యాదులో చెప్పిన ప్రాంతాల్లో ఎలాంటి హోర్డింగ్‌లు లేవని వెల్లడించారు. అందుకు అనుగుణంగానే చీఫ్‌మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఈకేసును 2022 సెప్టెంబరు 15న డిస్మిస్‌చేసారు.

అయితే రౌస్ అవెన్యూకోర్టులో సక్సేనా రివిజన్ పిటిషన్ దాఖలుచేసారు. దీనితో కేసు పునర్విచారణకు వచ్చింది. సిఆర్ పిసి 156(3) కింద ఈకేసును పరిగణనలోనికి తీసుకని శిక్షార్హమైన నేరంగాపరిగణించాలా వద్దా అనేందుకు పోలీసు నివేదిక రావాల్సి ఉందని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు.

# నేను రాయల్‌బెంగాల్ టైగర్‌ని, నిరసనలతో భయపెట్టలేరు..

## లండన్‌లో ఎదురైన నిరసనలకు మమతా బెనర్జీ దీటుగా కౌంటర్

**కోల్‌కత్తా, మార్చి 28:** బ్రిటన్ పర్యటనలో ఉన్న పశ్చిమబెంగాల్‌ముఖ్యమంత్రికి ఎదురయిన నిరసనలపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసారు. లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో సామాజిక అభివృద్ధి మహిళా సాధికారత అంశంపై మమతా బెనర్జీ ప్రసంగించారు. ఆమె ప్రసంగాన్ని విద్యార్థులు అడ్డుకున్నారు. బెంగాల్ రాష్ట్రంలో చెలరేగిన హింస, ఆర్జీకర్ వైద్యురాలి హత్యాచారఘటనపై నిరసనవ్యక్తం చేసారు.ఈ సంఘటనపై సమాధానం చెప్పాలంటూ నినా దాలు చేసారు. అయితే విద్యార్థులకు నిరసనకు ఏమాత్రం చలించని దీదీ వారికి ధీటుగా జవాబిచ్చారు. ఇలాంటి నిరసనలతో తనను భయపెట్టలేరని తాను రాయల్‌బెంగాల్ టైగర్‌ని అని అన్నారు. మీరు చెప్పేది వినపడట్లేదని గట్టిగా చెప్పండి అంటూ విద్యార్థులకు సూచించాచు. మీరు చెప్పేదంతా వింటాను కాస్త ప్రశాంతంగా మాట్లాడండి అని చెప్పారు. విద్యార్థులు లేవనెతినతన అంశాలు పూర్తిగా విన్న దీదీ



ఇక్కడ రాజ కీయాలు చేయొద్దని చెప్పారు. రాజకీయాలకు ఇది వేకదికాదని తాను దేశం తరపున ప్రతినిధిగా ఇక్కడకు వచ్చానన్నారు. ఇలాచేస్తే మీరు మన దేశాన్ని అవమానించినట్లే అంటూ విద్యార్థులకు బదులిచ్చారు. అయినప్పటికీ నిరసన కారులు వెనక్కి తగ్గకపోవడంతో మమతా బెనర్జీ 1990 నాటి ఒక ఫోటోను ప్రదర్శించారు. తీవ్ర గాయా లతో తలకు కట్టుతో ఉన్న తనఫోటోను ఆమె చూపించారు. ముందు ఈచిత్రాన్ని చూసి తనను చంపేందుకు ఎలాంటి కుట్రలు జరిగాయో తెలుసుకోండి అంటూ చేసిన వ్యాఖ్యలతో సభలో

# పేరుకే వసుదైక కుటుంబకం..సొంతవారితోనే విభేదం!



## సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, మార్చి 28:** కుటుంబసభ్యులమధ్య అనుబంధాలు ఆప్యాయతలు తగ్గిపోతుండటంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. ప్రపంచమంతా కలిసి ఉండాలనే వసుదైవ కుటుంబకం సూత్రాన్ని భారతీయులు గాఢంగా విశ్వసిస్తారని కానీ రక్తసంబందీకులందరూసఖ్యతతోఐక్యంగా ఉండడంలోమాత్రం విఫలం అవుతున్నారని జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ ఎస్‌విఎన్‌భట్ ధర్మాసనం పేర్కొంది. తన ఇంటినుంచి పెద్దకుమారుడిని ఖాళీ చేయించాలని కోరుతూ ఓ తల్లి దాఖలుచేసిన పిటిషన్‌పై తీర్పు వెలువరిస్తూ ధర్మాసనం ఈ వ్యాఖ్యలుచేసింది. కల్లుమాల్, సమతోలదేవి దంపతులకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కుమారులతో తల్లి తండ్రులకు సత్సంబంధాల్లేవు. అనారోగ్యం ఆసరాగా చేసుకుని తాను నిర్వహించే దుకాణం పెదకుమారుడు స్వాధీనం చేసుకున్నాడని, స్వార్జితమైన ఇంటిని విక్రయించాలని ఒత్తిడిచేస్తున్నాడని కల్లుమాల్ ఆరోపించారు. భరణం కూడా చెల్లించడంలేదని కనుక దుకాణం ఖాళీచేయాలని పెద్దకుమారుడిని ఆదేశించాలని ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ఈ కేసు కుటుంబ, అప్పిలేట్‌ట్రిబ్యునల్‌ను దాటి అలహాబాద్ హైకోర్టుకు చివరిగా సర్వోన్నత న్యాయస్థానానికి చేరింది. కుమారుడికి కూడా ఆస్తిలో భాగం ఉంటుందని, దుకాణాన్ని ఆతడు ఖాళీచేయాల్సిన అవసరం లేదన్న హైకోర్టు తీర్పును తల్లితండ్రులు సుప్రీంకోర్టులో సవాల్ చేసారు. ఈ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టుపై వ్యాఖ్యలు చేసింది.




# జస్టిస్ వర్మ బదలీని నోటిఫైచేసిన కేంద్రం

**న్యూఢిల్లీ, మార్చి 28:** ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదలీచేయడాన్ని కేంద్ర న్యాయశాఖ నోటిఫై చేసింది. అలహాబాద్ కోర్టు బార్ అసోసియేషన్ తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ సుప్రీంకోర్టు కొల్లిజియం చేసిన సిఫారసులు ఆమోదించాల్సిందేనన్న భావనతో కేంద్రం జస్టిస్‌వర్మ బదలీని ఆమోదించింది. దీనితో ఆయన్ను అలహాబాద్ హైకోర్టుకు బదిలీచేసినప్పటికీ న్యాయపరమైన కీలక విధులేవీ అప్పగించరు. అలహాబాద్ హైకోర్టునుంచే వచ్చినందున ఆయన్ను రీపాట్రియేషన్‌ను కేంద్రం ఆమోదిస్తున్నట్లు ప్రకటించింది. ఆయన ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని బాయ్‌కాట్‌చేస్తామని మాన నిరసనను కొనసాగిస్తామని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ తివారి అన్నారు. ప్రభుత్వంపై ఏవిధమైన ఒత్తిడి వచ్చిందనేది అంతుబట్టకుండా ఉందని, ఆయన బదలీ ఉత్తర్వులను నోటిఫైచేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఆయన్ను హడావిడిగా బదలీచేయడం సహేతుకం కాదని అన్నారు. ఇప్పటికే కొల్లిజియం ఆయన ఇంట్లో నోట్లకట్టల వ్యవహారంపై ముగ్గురు సభ్యుల కమిటీని నియమించింది. ఈ బృందం జస్టిస్ వర్మ నివాసం సందర్శించి నోట్లకట్టలు వెలుగుచూసిన ప్రాంతాన్ని కూడా పరిశీలించారు.

# జిన్‌పింగ్‌తో యూనస్ భేటీ

**బీజింగ్, మార్చి 28:** బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం గద్దెదిగిన తర్వాతనుంచి భారత్ బంగ్లాదేశ్‌స ంబంధాలు ఒత్తిడికి గురవుతున్న సంగతి తెలిసిందే.చిరకాల మిత్రదేశంగా ఉన్న భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం పాకిస్థాన్, చైనాలకు దగ్గరవుతూ వస్తోంది. ఈ క్రమంలోనే చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో బంగ్లా తాత్కాలిక సారథి మహ్మద్ యూనస్ భేటీ అయ్యారు. శుక్రవారం ఉదయం వీరిద్దరూసమావేశంంనిర్వహించినట్లు చైనా మీడియా కోడైకూసింది. నాలుగురోజుల పర్యటనలో భాగంగా యూనస్ ప్రస్తుతంచైనాలో పర్యటిస్తున్నారు. హైనాన్ ప్రావిన్స్‌లో బోవో ఫోరమ్‌ఫర్ ఆసియా వార్షిక సదస్సులో యూనస్ పాల్గొన్నారు. అనంతరం చైనా రాజధాని బీజింగ్‌చేరుకుని చైనా అగ్ర నాఆయకత్వంతో భేటీ అయ్యారు. చైనా ఇస్తున్న రుణాలకు వడ్డీలను తగ్గించాలని ఆదేశ నిధులు అందుతున్న ప్రాజెక్టులకు కమిట్‌మెంట్‌ఫీజును మాఫీ



చేయాలని కోరారు. అలాగే పలు అభివృద్ధి ప్రాజెక్టులకు మద్దతు ఇవ్వాలన్నారు. జపాన్, ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు తర్వాత చైనా దగ్గరినుంచే బంగ్లా ఎక్కువ రుణాలు తీసుకుంటున్నది. 1975నుంచి ఇప్పటి వరకూ బంగ్లాదేశ్ అప్పులు 7.5 బిలియన్ తడాలర్లవరకూ తీసుకున్నట్లు అంచనా.

# కేన్సర్ చికిత్స దుష్ఫలితాలతో ఆసుపత్రిలో చేరిన కింగ్ ఛార్లెస్



**లండన్, మార్చి 28:** యునైటెడ్‌కింగ్‌డమ్ రాజు ఛార్లెస్ (76) ఆసుపత్రిలోచేరారు. కేన్సర్ చికిత్సలోభాగంగా వచ్చిన స్వల్ప మార్పులకు అస్వస్థతకు లోనయిన కింగ్ ఛార్లెస్ ఆసుపత్రిలో చేరినట్లు బకింగ్‌హామ్‌ప్యాలెస్ ప్రకటించింది. కేన్సర్ చికిత్సలో ఎదురయిన దుష్పరిణామాల నేపథ్యంలో ఆసుపత్రిలో చేరినట్లు పేర్కొంది. ప్రస్తుతం లండన్ ఆసుపత్రిలో వైద్యులు ఛార్లెస్‌కు వైద్యం అందిస్తున్నారు. చార్లెస్‌ను వైద్య పర్యవేక్షణలో ఉంచినట్లుగా డాక్టర్లు తెలి పారు. ఇదిలా ఉంటే కింగ్ చార్లెస్ ఆసు పత్రిలో చేరడంతో అదికారిక కార్యక్రమాల న్నింటినీ వాయిదావేసారు. 2024 ఫిబ్రవరిలో కింగ్ ఛార్లెస్‌కు కేన్సర్ నిర్ధారణ అయింది. అప్పటి నుంచి ఆయన చికిత్స తీసుకుంటున్నారు. బెంగళూరుకు సైతం వచ్చి చికిత్సతీసుకున్నట్లు ప్రచారం జరిగింది. ఛార్లెస్ త్వరగా కోలుకుని ప్రజావిధుల్లోపాల్గొనాలని బకింగ్‌హామ్ ప్యాలెస్ పేర్కొంది. ఛార్లెస్ ఏవిధమైన కేన్సర్‌తో బాధ పడుతున్నారన్నది మాత్రం ప్యాలెస్ వివరించలేదు.

# ఇంజనీర్లు వారంలో నాలుగు రోజులు క్షేత్రస్థాయిలో ఉండాలి

## మిషన్ భగీరథ కార్యాలయంలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క



హైరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త: ప్రస్తుత వేసవికాలాన్ని దృష్టిలో ఉంచకుని అధికారులు వారంలో 4 రోజులు క్షేత్ర స్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నివేదికలను అందచేయాలని పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎర్ర మంజిల్ లోని మిషన్ భగీరథ కార్యాలయంలో సిఈ, ఎస్ఈ, ఈఈ, డిఇలతో మంత్రి సీతక్క జిల్లాల వారీగా తాగు నీటి సరఫరా పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ.. ఒక మండాలాన్ని యూనిట్‌గా తీసుకుని ఎంపిడివో, ఇంట్రా ఏఈ, గ్రిడ్‌ళ ఏఈ, మండల స్పెషల్ ఆఫీసర్లతో కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కమిటీలు ఎక్కడా తాగు నీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. వరుసగా పండగలు వస్తున్న నేపథ్యంలో ప్రజలంతా ఊర్లలోనే ఉంటారని, మూడు రోజుల పాటు తాగు నీటి సరఫరాకు ఇబ్బందులు రావద్దుఅత్యవసర పరిస్థితుల్లో వినియోగన్నుకునే విధంగా ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్ రోడ్లు, ఆర్ అండ్ బి రోడ్లు, ఎలక్ట్రిసిటీ పనుల వల్ల ఎక్కడెక్కడ మిషన్ భగీరథ పైపులు దెబ్బతింటున్నాయని, దీంతో అక్కడక్కడ తాత్కాలికంగా కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయి.

జిల్లా కలెక్టర్లతో, వర్క్ ఇన్స్పెక్టర్లతో సమన్వయం చేసుకొని అభివృద్ధి పనుల సందర్భంగా మిషన్ భగీరథ పైపులు డ్యామేజ్ కాకుండా చూసుకోవాలన్నారు. ఏదైనా ఆవాసాల్లో నీటి సరఫరా లో ఏదైనా సమస్యలు తలెత్తితే.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలన్నారు. స్థానికంగా నీటి వనరులు అందుబాటులో ఉన్నచోట బోర్ వెల్స్ ను హైర్ చేసుకోవాలన్నారు. గత పది సంవత్సరాల్లో వేల సంఖ్యలో బోర్లను పట్టించుకోలేదు మేము వాటన్నిటిని మరమత్తులు చేసి సిద్ధంగా ఉంచాంమన్నారు. మిషన్ భగీరథ వ్యవస్థ ఏర్పాటు గాని గ్రామాలను ప్రత్యేకంగా పరిగణించాలన్న మంత్రి కొందరు తమ వీధుల్లో బోర్లు వేయించుకునేందుకు తాగునీటి సమస్యలు ఉన్నట్టుగా చెబుతున్నారన్నారు. తాగునీటి సరఫరాకు అవసరమైనంత నీటి నిల్వలు ఉన్నాయని, కొత్త బోర్ల వైపు వెళ్లకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్థానిక ఎమ్మెల్యేలతో మిషన్ భగీరథ అధికారులు సమావేశం కావాలివారి అభిప్రాయాలకు అనుగుణంగా నీటి సరఫరాపై చర్యలు తీసుకోవాన్నారు.

## ఎఐసిసి డ్రాఫ్టింగ్ కమిటీ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మార్చి 28: ఏప్రిల్ 8,9 తేదీల్లో గుజరాత్ లోని అహ్మదాబాద్ లో ఏఐసిసి కీలక సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు వ్యూహాలు, విధానాలు, రాజకీయ నిర్ణయాలు రూపొందించడంలో డ్రాఫ్టింగ్ కమిటీ కీలక పాత్ర పోషించనుంది. 15 మంది సభ్యులతో కూడిన డ్రాఫ్టింగ్ కమిటీని ఈనెల 24న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, జనరల్ సెక్రెటరీ కేజీ వేణుగోపాల్ ప్రకటించారు. డ్రాఫ్టింగ్ కమిటీ మొదటి సమావేశం శుక్రవారం సాయంత్రం న్యూఢిల్లీ అక్బర్ రోడ్‌లోని ఏఐసిసి కార్యాలయంలో జరగగా డిప్యూటీ సీఎం హాజరయ్యారు. కీలక కమిటీలో పార్టీ పట్ల నిబద్ధత, రాజకీయ నైపుణ్యం, అనుభవం, ఉన్నత విద్యావంతుడైన డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మల్లుకు స్థానం కల్పించారు. ఏప్రిల్ 8న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరగనుంది, ఆ తర్వాత ఏప్రిల్ 9న ఏఐసీసీ ప్రతినిధుల సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశాలు గత ఏడాది డిసెంబర్‌లో కర్ణాటకలోని బెలగావిలో జరిగిన "నవ సత్యాగ్రహం" సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా ఉంటాయని ఎఐసిసి కార్యదర్శి కేసి వేణుగోపాల్ ఇప్పటికే వెల్లడించారు. ఈ సమావేశాల్లో పార్టీ రాజకీయ మ్యానిఫెస్టో, సంస్థాగత మార్పులు, రాబోయే ఎన్నికలకు సంబంధించిన వ్యూహాలను డ్రాఫ్టింగ్ కమిటీలో చర్చించనున్నారు. 2023లో తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో నాటి సీఎల్పీ నేతగా కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ద్వారా కీలక పాత్ర పోషించారు. జార్ఖండ్ 2024 శాసనసభ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం సాధించడంలో డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్క మల్లు కీలక పాత్ర పోషించారు.

## 66 మంది గల్ఫ్ మృతుల వారసులకు రూ.3.3 కోట్లు ఎక్స్ గ్రేషియా విడుదల

హైదరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు 66 మంది గల్ఫ్ మృతుల వారసులకు రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం శుక్రవారం రూ.3 కోట్ల 30 లక్షల ఎక్స్ గ్రేషియాను వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేశారని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అనిల్ ఒక ప్రకటనలో తెలిపారు. సిఎం సూచన మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఆర్థిక, ప్రణాళిక) కె. రామక్రిష్ణారావుతో సమన్వయము చేసి నిధులు విడుదల చేయించానని అనిల్ తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో 28 మంది, జగిత్యాల 19, కామారెడ్డి 9, నిర్మల్ 7, మెదక్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలలో ఒక్కొక్కటి చొప్పున 66 మంది ఖాతాల్లో డబ్బులు జమ అయినట్లు తెలిపారు. గతంలో 103 మందికి రూ.5 కోట్ల 15 లక్షలు విడుదల చేసినట్లు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 169 మందికి రూ.8 కోట్ల 45 లక్షలు చెల్లింపు జరిగినట్లు ఆయన పేర్కొన్నారు.

## ఆదిలాబాద్ జిల్లాలో ఎసిబికి పట్టుబడిన వైద్యశాఖ అధికారి

హైదరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త: ఆదిలాబాద్ జిల్లాలో వైద్య శాఖ అధికారి ఒకరు 30 వేల రూపాయలు లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడ్డారు.



ఎసిబికి పట్టుబడినవైద్య శాఖ అధికారి

శుక్రవారం ఉదయం జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచలనం రేపింది. ఆదిలాబాద్ జిల్లా ఎక్స్‌టెన్షన్ మెడికల్ ఆఫీసర్, మీడియా ఆఫీసర్‌గా వున్న మాచర్ల పోశెట్టి రవి శంకర్‌పై అవినీతి ఆరోపణలకు సంబంధించి ఎసిబికి అనేక ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో ఎసిబి అధికారులు ఆయనపై నిఘా వుంచారు. ఇదే సమయంలో జిల్లాలోని గుడిహత్నూరు మండలం మన్నూరులో ఓ మెడికల్ షాప్ యజమాని వైద్యుల సిఫార్సు లేకుండా ఓ మహిళకు అబార్షన్ మందులు విక్రయించడంతో ఆ దు కాణాన్ని ఎక్స్‌టెన్షన్ మెడికల్ ఆఫీసర్ రవి శంకర్ మూసి వేయించారు. ఈ దుకాణం తిరిగి తెరవాలంటే 50 వేల రూపాయలు లంచం ఇవ్వాలని రవి శంకర్ మెడికల్ షాప్ యజమానిని డిమాండ్ చేశారు. బాధితుడి విజ్ఞప్తి మేరకు చివరకు 30 వేల రూపాయలకు రవి శంకర్ అంగీకరించాడు. దీనిపై బాధితుడు ఎసిబిని ఆశ్రయించగా ఎసిబి అధికారులు పక్కాగా వ్యవహరించి శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో మారు వేషంలో లుంగీలు ధరించి వెళ్లారు. బాధితుడి నుంచి రవిశంకర్ 30 వేల రూపాయలు తీసుకుంటుండగా మారువేషంలో వున్న ఎసిబి డిఎస్‌పి విజయ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ కిరణ్ తమ బృందంతో ఒక్కసారిగా దాడిచేసి రవిశంకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతని వద్ద వున్న 30 వేల రూపాయల లంచం డబ్బులను జప్తు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి ఎసిబి కార్యాలయానికి తరలించారు. దీని తరువాత జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో, రవి శంకర్ ఇంట్లోనూ ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించి పలు పత్రాలను జప్తు చేశారు. నిందితుడిని శనివారం కరీంనగర్ కోర్టులో హాజరు పరిచి జైలుకు తరలించనున్నారు.



## కారు డిక్కీలో మహిళ మృతదేహం

నిజామాబాద్, మార్చి 28, ప్రభాతవార్త : పట్టపగలు ఒక మహిళను హత్యచేసి మృతదేహాన్ని కారులో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిజామాబాద్ నగర శివారులో శుక్రవారం మధ్యాహ్నం ఈ ఘటన వెలుగు చూసింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ రూరల్ పరిధికి చెందిన కమల (50 )ను గుర్తు తెలియని వ్యక్తులు ఎక్కడో హత్య చేశారు. అనంతరం ఆమె మృతదేహాన్ని ఓ కారు వెనుక డిక్కిలో వేసుకొని కంటేశ్వర్ బైపాస్ రోడ్డు నుండి వెళ్తుండగా రూరల్ పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. అయితే కారులో ఉన్న వ్యక్తులు పరాలైనట్లు తెలిసింది. మహిళను ఎందుకు హత్య చేయాల్సి వచ్చింది, కారణాలు ఏమిటి అని ఘటనపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు నిర్వహిస్తున్నారు. నిజామాబాద్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కారును స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. హత్య ఎవరు చేశారన్న అంశంపై అనేక కోణాలతో దర్యాప్తు చేపట్టారు. ఈ మార్గంలో ఉన్న సిసి కెమెరాలను పరిశీలిస్తున్నారు.

## నేడు టిజిసెట్ ప్రత్యేక కేటగిరి ఫలితాలు

హైదరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త: రాష్ట్రంలోని వివిధ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించిన టిజి సెట్-2025లో ప్రత్యేక కేటగిరి ఫలితాలను నేడు(శనివారం) విడుదల చేయనున్నారు. టిజి సెట్‌లోని ప్రత్యేక కేటగిరికి చెందిన 5వ తరగగతి ఫలితాలను సెట్ కన్వీనర్ విఎస్ అలుగు వర్షిణి విడుదల చేయనున్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో (ఎస్సీ, ఎస్టీ, బిసి, జనరల్ గురుకులాలు) 5వ తరగతిలో ప్రవేశాల కోసం గత నెల ఫిబ్రవరి 23వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. మిగిలిన కేటగిరీలకు చెందిన ఫలితాలను ఏప్రిల్ 5లోపు వెల్లడిస్తామని ప్రకటనలో పేర్కొన్నారు.

## కేంద్ర నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పోరాటం చేయాలి

### టూరిజంపై నా వ్యాఖ్యలను వక్రీకరించారు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



శుక్రవారం హైదరాబాద్‌లోని పార్టీ సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూం భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

హైదరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పోరాటం చేయాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు సూచించారు. ఈసారి జరిగిన అసెంబ్లీ సమావేశాలను చాలా బాగా నిర్వహించారని.. టూరిజంపై తాను మాట్లాడిన వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్‌లో ఉన్న పార్టీ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంత్, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మలతో కలిసి సాంబశివరావు మాట్లాడారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు 15 శాతం వాటా ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం.. తెలంగాణ రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన నిధులను విడుదల చేయడంలేదని కూనంనేని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన వాటా నిధులు కేంద్రం ఇవ్వాల్సిందేనని, కేంద్రం ఇవ్వకపోతే అందరం కలిసి పోరాటం చేద్దామన్నారు. ఈసారి అసెంబ్లీ సమావేశాలు చాలా బాగా నిర్వహించారని ప్రభుత్వాన్ని కూనంనేని అభినందించారు. కేంద్రం నుంచి రావల్సిన బకాయిలు రూ.25 వేల కోట్లు ఉన్నాయని, జిడిపి రూపంలో ఎక్కువ పోతుందని, ఈ అంశాలపై చర్చ జరగకుండా ఎవరు ఎంత తిన్నారనే అంశంపైనే చర్చ జరిగిందని అన్నారు. ఇది పేదలకు అనుకూలమైన బడ్జెట్ కాదని.. ప్రభుత్వం జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని సాంబ శివరావు హెచ్చరించారు. పెన్షన్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేలు, మహిళలకు రూ.2500, ఆడపిల్లలకు తులం బంగారం ఈ హామీలను నెరవేర్చాలన్నారు. బడ్జెట్ పెట్టిన దాంట్లో పూర్తి స్థాయిలో ఖర్చు చేసి.. అన్ని అమలు చేసేవిధంగా చూడాలన్నారు. జర్నలిస్టులకు పేదల కేటగిరిలో సంక్షేమ పథకాలు అమలు చేయాలని సాంబశివ రావు అన్నారు. జర్నలిస్టులు అసంఘటిత రంగంలోనే ఉన్నారని అన్నారు. వారికి కూడా కనీస వేతనం అమలు చేయాలన్నారు. సుప్రీంకోర్టు చెప్పిందని జర్నలిస్టులకు ఇళ్లు ఇవ్వకుండా ఉండటం మంచిదికాదన్నారు. జర్నలిస్టుల కోసం పాలసీ తీసుకరావాలని ప్రభుత్వాన్ని కోరారు. టూరిజంపై తన వ్యాఖ్యలను చంద్రబాబు తనకు అనుకూలంగా మల్చుకున్నారని.. చంద్రబాబు ఏ ఈజం లేదని, టూరిజం అనేవారని, అందుకే తమకు కోపం వచ్చేదన్నారు. కానీ పెట్టుబడి లేనిది టూరిజం అని, లాభాలు వస్తాయని ఉపాధి కల్పించేదని, టూరిజంను అభివృద్ధి చేయాలని తాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేస్తే, దానిని కొందరు దురుద్దేశంతో వక్రీకరించారని కూనంనేని సాంబశివరావు మండిపడ్డారు.

## హైదరాబాద్‌లో 12 మంది నకిలీ వైద్యులపై కేసులు నమోదు

### కొనసాగుతున్న టిజిఎంసి కేసుల పరంపర

హైదరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త: రాష్ట్రంలో నకిలీ వైద్యులపై కేసుల నమోదు కొనసాగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ ఆర్ఎంపి/పిఎంపిలపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్(టిజిఎంసి) కేసుల నమోదును కొనసాగిస్తోంది. పరిధికి మించి వైద్యం చేస్తున్నట్టుగా గుర్తించిన టిజిఎంసి అధికారులు శుక్రవారం హైదరాబాదులో 12 మంది, నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేటలో ఇద్దరు నకిలీ వైద్యులపై కేసులు నమోదు చేసినట్టు టిజిఎంసి ఛైర్మన్ డాక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలో నకిలీ వైద్యులైన ఆర్ఎంపి/ పిఎంపిలపై కేసుల పరంపర కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే 400 మందికి పైగా కేసులు నమోదు చేసినప్పటికీ ఆర్ఎంపి/ పిఎంపిలు తమ తీరు మార్చుకోకుండా పరిధికి మించి వైద్యం చేస్తూ పేద, అమాయక ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని సొమ్ము చేసుకొని వారి ఆరోగ్యాలు, ప్రాణాలతో చెలగాటం ఆడుకుంటూనే ఉన్నారని మండిపడ్డారు. గత కొన్ని నెలలుగా నకిలీ వైద్యులపై తరచూ తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తున్నట్టు తెలిపారు. గత ఫిబ్రవరితోపాటు ఈ నెలలో హైదరాబాదు, నాగర్ కర్నూల్ అచ్చంపేట ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి ఆయా పోలీస్ స్టేషన్ ఫరిధిలో ఎన్ఎంసి చట్టం 34, 54 టిఎస్ఎంపిఆర్ చట్టం 22 ప్రకారం కేసులు నమోదు చేశామన్నారు. పరిధి దాటి వైద్యం చేసే ప్రతి ఒక్కరి పైనా కేసులు నమోదు చేస్తామని, రాష్ట్రంలో పూర్తిగా ఎన్ఎంసి చట్టాన్ని అమలు చేస్తామని.. దీనిపై తమ వైఖరిలో ఎటువంటి మార్పు ఉండదని టిజిఎంసి చైర్మన్ డాక్టర్ మహేశ్ కుమార్ స్పష్టం చేశారు. చాలా వరకు ఆర్ఎంపిలు ఎటువంటి విద్యార్హత లేకుండా ఎంబిబిఎస్ డాక్టర్ల వలె.. వారి పరిధి దాటి అశాస్త్రీయంగా, ఎటువంటి అవసరం ఉందని గుర్తించకుండా వారి ఇష్టానుసారంగా యాంటీబయోటిక్స్, స్టెరోయిడ్స్, నొప్పి నివారణ ఇంజెక్షన్స్ ఇవ్వడం వలన ప్రజారోగ్యానికి పెను ముప్పు పొంచి ఉందన్నారు. ఈ నేపథ్యంలో పరిధి దాటి వైద్యం చేసే ఆర్ఎంపిలపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ కఠినంగా వ్యవహరిస్తుందని వైస్ చైర్మన్ డాక్టర్ జి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

## కోర్ బ్రాంచ్‌లు బోధించే అధ్యాపకులు ఐఎ, డాటా సైన్స్ బోధించవచ్చు

### జెఎన్‌టియుకు లేఖ రాసిన ఎఐసిటిఇ

### అవకాశం కల్పించాలంటున్న టిఎస్‌టిసిఇఎ

హైదరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త: ఇంజినీరింగ్‌లో కోర్ బ్రాంచ్‌లైన ఈసిఈ, ఈఈఈ బ్రాంచ్‌లను బోధిస్తున్న అధ్యాపకులు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ), ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్(ఏఐఎంఎల్) కోర్సులతో పాటు డాటా సైన్స్ వంటి కోర్సులను కూడా బోధించవచ్చని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసిటిఈ) స్పష్టం చేసింది. ఈ మేరకు ఏఐసిటిఈ సభ్య కార్యదర్శి ప్రొఫెసర్ రాజీవ్ కుమార్ జేఎన్‌టియూ వీసీకి ఈ నెల 25న లేఖ రాశారు. ప్రస్తుతం ఎమర్జింగ్ అవుతున్న ఏఐ, ఏఐఎంఎల్, డాటా సైన్స్ కోర్సులను బోధించడానికి అర్హతలను తెలుపుతూ ఏఐసిటిఈ లేఖ రాసింది. దీంతో ఇప్పటి వరకు రాష్ట్రంలోని పలు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఈ ఎమర్జింగ్ కోర్సులను చెప్పడానికి ఆయా సబ్జెక్టులను చదివిన వారు మాత్రమే అర్హులని కాకుండా.. ఇప్పటికే ఇంజనీరింగ్‌లో కోర్ బ్రాంచ్‌లుగా కొనసాగుతున్న ఈసిఈ, ఈఈఈ బ్రాంచ్‌లను బోధిస్తున్న అధ్యాపకులు(ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్)లు అర్హత కలిగి ఉన్నారని పేర్కొంటూ ఏఐసిటిఈ స్పష్టం చేస్తూ జేఎన్‌టియూకి లేఖ రాసింది. ఇంజనీరింగ్ కోర్ బ్రాంచ్ ఫ్యాకల్టీ .. ప్రస్తుత ఎమర్జింగ్ కోర్సు వారికి బోధన చేయవచ్చని గతంలో 2023లోనే ఏఐసిటిఈ లేఖ రాసినప్పటికీ.. యూనివర్సిటీ పట్టించుకోలేదని.. కనీసం ఇప్పటికైనా కోర్ బ్రాంచ్‌లు బోధించే అధ్యాపకులకు ఎమర్జింగ్ కోర్సులను బోధించడానికి అనుమతించాలని తెలంగాణ స్టేట్ టెక్నికల్ కాలేజెస్ ఎంప్లాయీస్ అసోసియేషన్(టిఎస్‌టిసిఈఏ) అధ్యక్షులు అయిన సంతోష్ కుమార్ జేఎన్‌టియూని వీసీని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని పలు ఇంజనీరింగ్ కాలేజీలు సరైన సదుపాయాలు లేకుండా, అధ్యాపకులు లేకుండానే ఎమర్జింగ్ కోర్సులను నెట్టుకొస్తున్నారని.. అలాంటి పరిస్థితి లేకుండా ఉండాలంటే కోర్ బ్రాంచ్ ఫ్యాకల్టీకి ఎమర్జింగ్ కోర్సులను బోధించే అవకాశం కల్పిస్తే ఫ్యాకల్టీ లోటు తీరుతుందన్నారు. వెంటనే జేఎన్‌టియు స్పందించి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## కేబుల్ బ్రిడ్జి పైనుంచి దూకి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్యయత్నం

### కాపాడిన రెస్క్యూ టీమ్, పోలీసులు

హైదరాబాద్ (సైబరాబాద్ ప్రతినిధి), మార్చి 28, ప్రభాతవార్త: పనిఒత్తిడి తట్టుకోలేక ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి మీద నుంచి నీళ్లలో దూకి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన దుర్గం చెరువు బోట్ రెస్క్యూ టీమ్, పోలీసు పెట్రోలింగ్ సిబ్బంది కాపాడారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసు కున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... నగరంలోని ఎస్ఆర్ నగర్‌కు చెందిన జి.రోజా (27) ఐటి కారిడార్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తుంది. శుక్రవారం మద్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో తాను పనిచేస్తున్న కార్యాలయం నుంచి నేరుగా కేబుల్ బ్రిడ్జ్ మీదకు చేరుకున్న రోజా బ్రిడ్జ్ మీద నుంచి దుర్గం చెరువు నీళ్లలోకి దూకింది. కాగా కేబుల్ బ్రిడ్జ్ మీద విధులు నిర్వహిస్తున్న పోలీసు పెట్రోలింగ్ సిబ్బంది, దుర్గం చెరువు లోపల బోటులో గస్తీ నిర్వహిస్తున్న రెస్క్యూ టీమ్‌లు వెంటనే స్పందించారు. కేబుల్ బ్రిడ్జి మద్యలో నీళ్ల లోతు ఎక్కువగా ఉండగా, సిబ్బంది తీవ్రంగా శ్రమించి రోజాను కాపాడారు. బోటింగ్ సూపర్‌వైజర్ మనోహర్, డ్రైవర్ విష్ణులు సమయానికి అక్కడికి చేరుకోవడంతో యువతిని నీళ్లలో మునిగిపోకుండా రక్షించి, ఒడ్డుకు తీసుకువచ్చారు. విషయం తెలుసుకొని పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని రోజాను విచారించగా, పని ఒత్తిడి కారణంగా తీవ్ర మనోవేదనకు గురయ్యానని, ఈ క్రమంలోనే ఆత్మ హత్యకు యత్నించినట్లు తెలిపింది. కాగా చెరువులో దూకడంతో అస్వస్థతకు గురికావడంతో రోజాను స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రోజా ఆరోగ్యం నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు.



చెరువులో దూకిన రోజాను కాపాడిన రెస్క్యూ టీమ్

## పునాది పూర్తయిన ఇళ్లకు తక్షణ చెల్లింపులు

### వరంగల్ అభివృద్ధిపై మంత్రి పొంగులేటి కీలక సమీక్ష



హన్మకొండ బ్యూరో, మార్చి 28, ప్రభాతవార్త: పైలట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, బేస్‌మెంట్ పూర్తయిన ఇళ్లకు తక్షణం చెల్లింపులు జరపాలని రెవెన్యూ శాఖ, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో వరంగల్ స్మార్ట్ సిటీ పనులు , వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, తాగునీరు, ఇందిరమ్మ ఇండ్లు తదితర అంశాలపై పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్య మంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డిలతో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఈ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతా అంశమని, దీనిని దృష్టిలో పెట్టుకొని కలెక్టర్లు పనిచేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు ప్రభుత్వం నాలుగు విడతలలో చెల్లింపులు చేస్తుందని, మొదటి విడతలో బేస్‌మెంట్ లెవెల్ పూర్తయిన ఇళ్లకు లక్ష రూపాయిలు ఇస్తుందని, బేస్ మెంట్ పూర్తయిన ఇండ్ల వివరాలను హౌసింగ్ విభాగానికి పంపిస్తే తక్షణమే చెల్లింపులు చేస్తామని తెలిపారు.

వేసవి కాలంలో ఏ గ్రామంలో గాని, పట్టణంలో గానీ తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా జిల్లా కలెక్టర్లు ఈ అంశానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అధికారులతో సమన్వయం చేసుకొని అధికారులు వారంలో మూడు రోజులు గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. వచ్చే మూడు నెలలు చాలా కీలకమని ప్రజలకు ఎక్కగా తాగునీరు గురించి ఇబ్బంది కలగకుండా, నీళ్ల రావడం లేదన్న విమర్శ రాకుండా పని చేయాలన్నారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవన నిర్మాణ పనులను రెండు నెలల్లో పూర్తిచేసి ఆ తర్వాత మరో నెలరోజుల్లో వైద్య సేవలకు అవసరమైన పరికరాలను అమర్చి జూన్ చివరినాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మడికొండ డంపింగ్ యార్డు సమస్యకు వారం రోజుల్లో తాత్కాలిక పరిష్కారం చూపించి ఆ తర్వాత శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వరంగల్, కరీంనగర్ రహదారి ప్రాంతంలో శాశ్వత డంపింగ్ యార్డు కోసం 150 నుంచి 200 ఎకరాల భూమిని సేకరించాలని కలెక్టర్లను ఆదేశించారు.

## అప్పులపై సర్కారు అసత్య ప్రచారం

### కాంగ్రెస్ పార్టీ ఇకనైనా నిజాలు మాట్లాడాలి

### బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 28: ఈసారి బడ్జెట్ సమావేశాలు రాష్ట్ర చరిత్రలో నిలిచి పోతాయని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఈ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ల బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందాయని ఈ బిల్లులు రావడానికి బీఆర్ఎస్ పార్టీ కృషి ఎంతో ఉందన్నారు. శుక్రవారం శాసనమండలి మీడియా పాయింట్ వద్ద బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అప్పులపై కాంగ్రెస్ నేతల తప్పులు బయటపడ్డాయని ధ్వజమెత్తారు. రాష్ట్ర అప్పులు మొత్తం రూ.4 లక్షల 42 వేలు అని పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం రూ.8 లక్షల కోట్లు అప్పులు చేశామని దుష్ప్రచారం చేస్తున్నారని కవిత మండి పడ్డారు. శాసన మండలిలో ప్రజల గొంతుకగా బీఆర్ఎస్ వ్యవహరించిందని సమన్వ యంతో అన్ని అవకాశాలను వాడుకొని ప్రభుత్వాన్ని ప్రశ్నించామన్నారు. అన్ని చర్చల్లో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టినట్లు చెప్పారు. ప్రజలు, రైతులు, మహిళలు వంటి అన్ని సమస్యలపై గళమెత్తాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుపై ప్రతీ రోజూ వినూత్న రీతిలో నిరసనలు, కేసీఆర్ పై ముఖ్యమంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలపై కూడా సభలో నిరసన తెలిపామన్నారు. అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా నిజాలు చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. అబద్దాలు చెబుతున్నామని కాంగ్రెస్ పార్టీ ఒప్పుకుంటే మర్యాదగా ఉంటుందన్నారు. కాళేశ్వరం బ్యారేజీలు కూలిపోతాయన్నదానిలో వాస్తవం లేదని స్వయంగా ఇరిగేషన్ మంత్రి మండలిలో చెప్పారన్నారు. నీళ్లు ఇవ్వగలిగి ఇవ్వకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం కాదా? అని ప్రశ్నించారు. ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని తెలిపారు. ఏప్రిల్ 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి వద్ద బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవం జరుగుతుందని కవిత తెలిపారు. 25 వసంతాల బీఆర్ఎస్ పార్టీ ఉత్సవాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఫీజు రీయింబర్స్ మెంట్ పై మేము చేసిన పోరాటానికి దిగొచ్చిందని ఎప్పటికప్పుడు ఫీజు రియింబర్స్ మెంట్ నిధులను విడుదల చేస్తామని మండలి సాక్షిగా ముఖ్యమంత్రి ప్రకటించారన్నారు. ఈ ప్రకటన అమలయ్యే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని చెప్పారు. అసెంబ్లీ సాక్షిగా మహిళలను ఉద్దేశించి పరుషపదజాలంతో ముఖ్యమంత్రి అసభ్యకరంగా మాట్లాడారని చరిత్రలో సీఎం వ్యాఖ్యలు ఓ మచ్చగా ఉంటాయని వ్యాఖ్యానించారు.



శుక్రవారం శాసనమండలి మీడియా పాయింట్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

# అక్రమదందాను సన్నబియ్యంతో కట్టడి చేయగలమా?

**హైదరాబాద్, మార్చి 28,ప్రభాతవార్త:** 'ఆకలి అయ్యేవాడికి సన్న బియ్యం ఇవ్వండి.. అమ్ముకొనేవాడికి కాదు' అంటూ కామారెడ్డి ఎమ్మెల్యే కెవి రమణారెడ్డి అసెంబ్లీ చివరిరోజున నిర్వహించిన జీరోఅవర్‌లో చేసిన సూచనను ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చి పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సన్నబియ్యంపై ప్రభుత్వం చేయబోతున్న వ్యయం రూ.4246.70కోట్లు అక్రమార్కులకు అదనపు ఆదాయం పెంచే వనరుగా మారబోతుందేమో అనే ఆందోళన సర్వత్రా నెలకొన్నది. మహారాష్ట్ర,కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో ప్రత్యేకంగా ఇక్కడి బియ్యం కొనుగోలుచేయడానికి దుకాణాలను ఏర్పాటు చేసిన అక్రమార్కులు కూడా తెలంగాణ ప్రభుత్వం సన్నబియ్యం పథకం పెట్టడంతో అధికలాభాలు చేసుకోచ్చనే ఉత్సాహపడుతున్నారు. ఉగాది కానుక లబ్దిదారుల్లో కాకుండా అక్రమార్కుల జీవితాల్లో ఉగాది కొత్తకాంతులు నింపుతుందా అనే అనిశ్చితి నెలకొంది.. తెలంగాణ 89.96లక్షల రేషన్‌కార్డు దారులకు ఉగాది నుంచి ఫోర్టిఫైడ్ సన్నబియ్యం పంపిణీ చేయబోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రెండుకోట్ల 81లక్షల 64వేల నాలుగువందలపై చిలుకు ప్రజలకు తలసరి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం ఉగాది నుంచి తెలంగాణ ప్రభుత్వం అందించబోతున్నది.

### ఎంఎల్ఎస్ గోదాములకు తరలివచ్చిన సన్నబియ్యం

### రేషన్‌షాపుల్లో నిల్వఉన్న దొడ్డుబియ్యంపై రాని స్పష్టత

ఇందులో 54.66లక్షల కుటుంబాలకు చెందిన 191.696లక్షల మందికి తలసరి ఐదుకిలోలు భారత ప్రభుత్వం ఒక్క రూపాయికి బియ్యం ఇస్తుంటే రాష్ట్రప్రభుత్వం అదనంగా మరో కిల బియ్యం కూడా కలిపి ఆరు కిలోలు వారికి పూర్తిగా ఉచితంగా ఇస్తుంది. రాష్ట్రప్రభుత్వం 35.43లక్షల కార్డుదారులు కలిగి ఉన్న 90లక్షల మందికి అదనంగా తన నిధులతో ఆరు కిలోల బియ్యం సమకూర్చుతున్నది. ఎఫ్ఎస్‌సి కార్డు కలిగిన వారికి నెలకు 35కిలోలు, ఎపి కార్డుకలిగినవారికి 10కిలోలు చొప్పున పంపిణీ చేసే 179246.506 మెట్రిక్‌టన్నుల సన్నబియ్యం తెలంగాణ వ్యాప్తంగా రేషన్‌షాపుకు గత నాలుగురోజులుగా సరఫరా ప్రారంభమైంది. ఆసిఫాబాద్,జైనూర్,కాగజ్‌నగర్ బెజ్జూరువంటి మారుమూల మండల ఎంఎల్ఎస్ పాయింట్లలో కూడా సన్నబియ్యం నిల్వలతో కలకలలాడుతున్నాయి. అటవీ ప్రాంతమైన ఆసిఫాబాద్ జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో 314చౌకధరల దుకాణాలు ఉంటే గురువారం సాయంత్రం నాటికి 59 దుకాణాలకు 602 మె.ట బియ్యం నిల్వలు వచ్చిచేరాయి. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీచేసే రేషన్‌బియ్యం పై సంవత్సరానికి రూ.3601.93కోట్లు ఖర్చుచేయబోతున్నది. దీనికితోడు తెలంగాణ ప్రభుత్వం 357371 పాఠశాలలో 27.37లక్షల విద్యార్థులకు మధ్యాహ్నభోజన వసతికల్పించడానికి సంవత్సరానికి 74369.928 మె.టన్నుల సన్నబియ్యం విడుదలచేస్తున్నది. ప్రస్తుతం రేషన్‌షాపుల నుంచి మొదలు కొని అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్దిదారులకు నెలకు రెండులక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం తెలంగాణ ప్రభుత్వం విడుదల చేస్తున్నది. సన్నబియ్యం రేషన్‌షాపుల్లోకి వస్తున్నది అయితే రేషన్‌షాపుల్లో ఇప్పటి వరకు ఉన్న దొడ్డుబియ్యం ఇంకా వెనక్కితీసుకోలేదు. ఆసిఫాబాద్ జిల్లాలోనే 2,640.96 క్వింటాళ్ళ దొడ్డు బియ్యం రేషన్‌షాపుల్లో ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 71647 మె.ట దొడ్డుబియ్యం రేషన్ షాపుల్లో ఉన్నట్లు పౌరసరఫరా అధికారుల అంచనాలు. మరి ఈ బియ్యంపై తర్వగా విధాన పరమైన నిర్ణయం తీసుకోకపోతే అవి బీరు ఉత్పత్తి కేంద్రాలకో లేక కాకినాడ రేవుకో చేరుకుంటాయని విజిల్‌బ్లోయర్స్ హెచ్చరిస్తున్నారు.



శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మనవడు రేయాన్ష్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో మంత్రి సీతక్క

## 4,818 చలివేంద్రాలు ఏర్పాటు చేసిన పంచాయతీరాజ్ శాఖ

**హైదరాబాద్, మార్చి 28,ప్రభాతవార్త:** వేసవి కాలంలో పనుల నిమిత్తం ప్రజలు బయటకు వెళ్తుంటారు.ఈ నేపథ్యంలో గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థ ద్వారా ఇంటింటికి మనం మంచినీరు సరఫరా చేస్తున్నారు. కోట్ల మంది ప్రజలు మన నీళ్లను తాగుతున్నారు.తాగునీటిని ఉచితంగా ప్రజలకు అందుబాటులో ఉంచాలన్న సంకల్పంతో గ్రామాల్లో మండలాల్లో చలి వేంద్రాలను అధికారులను ఏర్పాటు చేశారు. చలివేంద్రాల నిర్వహణ బాధ్య తను పంచాయతీ రాజ్ శాఖ తీసుకోవాల్సి ఉండగా, వాటికి తగినంత నీటిని, మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేయాల్సి ఉంది.అన్ని చలి వేంద్రాలకు మిషన్ భగీరథ నీళ్ల డిపివోలు, ఎంపివోలు చూడాలి. వేసవి కాలంలో తాగు నీటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా పంచాయితీరాజ్ శాఖ అధికారులు మంత్రి సీతక్క ఆదేశాల మేరకు పలుఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 4,818 చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.

## బెట్టింగ్ యాప్ కేసులో యాంకర్ విష్ణుప్రియకు హైకోర్టులో ఎదురుదెబ్బ

### కేసు కొట్టివేయడం కుదరదన్న న్యాయస్థానం

### పోలీసుల విచారణకు సహకరించాలని ఆదేశం

**హైదరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన బెట్టింగ్ యాప్ కేసులో టివి నటి, యాంకర్ విష్ణుప్రియకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. త న్పై మియాపూర్ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టి వేయాలని యాంకర్ విష్ణుప్రియ దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం నాడు విచారించిన జస్టిస్ తుకారంజీ నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం దీనిపై పోలీసుల విచారణ సరైందేనని పేర్కొంది. దీనిపై మొదట యాంకర్ విష్ణుప్రియ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ త న క్లయింట్ బెట్టింగ్ యాప్‌లో పెట్టుబడులు పెట్టాలని ఎక్కడా ఎవరినీ ప్రోత్సహించలేదని తెలిపారు. తన క్లయింట్ అమాయకురాలని, ఆమెపై ఎలాంటి ఆధారాలు లే కుండానే కేసు నమోదు చేసినందున దీనికి సంబంధించిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని న్యాయవాది కోరారు. అయితే ఇదే కేసులో ఫణింద్రా అనే న్యాయవాది తన వా దనలను వినిపిస్తూ బెట్టింగ్ యాప్‌ల వల్ల ఎంతో మంది అమాయకులు లక్షలాది రూపాయలు పోగొట్టుకుని, ఆఖరుకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. బె ట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందేనని ఆయన వాదించారు. ఇదే సమయంలో బెట్టింగ్ యాప్స్‌పై రాష్ట్రంలో నిషేధం వుందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. విష్ణుప్రియ పిటిషన్‌ను కొట్టి వేయడంతో పాటు ఆమె పోలీసుల విచారణకు సహకరించాలని ఆదేశించింది.

## 29, 30, 31 తేదీల్లో పనిచేయనున్న ఎల్ఐసి

హైదరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త : పాలసీదారులకు సేవలను అందించడానికి ఎల్ఐసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. సాధారణంగా శనివారం, ఆదివారం ఎల్ఐసీ కార్యాలయాలకు సెలవు. అయితే ఈ నెల 31వ తేదీ 2024-25 ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఈ సెలవులను రద్దు చేస్తూ ఎల్ఐసీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో పాలసీదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండటానికి, మండలాలు మరియు డివిజన్ల పరిధిలోని ఎల్ఐసీ కార్యాలయాలు ఈ నెల 29, 30, 31వ తేదీలలో అధికారిక పని చేయనున్నట్లు వెల్లడించింది.

## కెటిఆర్‌కు బ్రిడ్జ్ ఇండియా ఆహ్వానం

### లండన్‌లో జరిగే ఇండియా వీక్ 2025కు హాజరుకానున్న కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 28:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారక రామారావు మరో ప్రతిష్టాత్మక సదస్సుకు ఆహ్వానం అందింది. బ్రిటన్‌లో జరిగే 'ఐడియాస్ ఫర్ ఇండియా' సదస్సుకి రావాలంటూ బ్రిడ్జ్ ఇండియా సంస్థ ప్రత్యేకంగా కేటీఆర్‌ను ఆహ్వానించింది. మే 30,2025న లండన్‌లోని రాయల్ లాంకాస్టర్ హోటల్లో జరిగే సదస్సుకు కేటీఆర్‌ను ముఖ్య వక్తగా పిలుస్తూ,బ్రిడ్జ్ ఇండియా వ్యవస్థాపకుడు ప్రతీక్ దత్తానీ ఆహ్వాన లేఖ పంపారు. 2023లో ఇదే కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్న కేటీఆర్ ప్రసంగం, ఆలోచనలు అందరినీ ఆకట్టుకున్నాయని ప్రతీక్ తెలిపారు. ఈసారి కూడా లండన్ వ్యాపార వర్గాలు, ఇండోయూకే కారిడార్లోని ముఖ్య వ్యక్తులు, తెలుగు ప్రవాసులు కేటీఆర్‌ను కలవడానికి, ఆయన ప్రసంగాన్ని వినడానికి అమితమైన ఆసక్తి చూపిస్తున్నారన్నారు. దీంతో తెలంగాణలో ప్రభుత్వం మారినప్పటికీ కేటీఆర్ ను ప్రత్యేకంగా ఈ ప్రతిష్టాత్మక సదస్సుకు ఆహ్వానిస్తున్నామని ప్రతీక్ దత్తానీ ప్రత్యేకంగా లేఖలోప్రస్తావించారు.ఈ కార్యక్రమానికి హాజరైతే భారత్, ఇంగ్లాండ్ దేశాల మధ్య సంబంధాలను మరింత మెరుగుపరచుకునే అవకాశం కలగడంతో పాటు,ఇంగ్లాండ్ వ్యాపార సముదాయానికి తెలంగాణతో ప్రత్యేక అనుబంధం ఏర్పడే అవకాశం ఉందని ప్రతీక్ ఆశాభావం వ్యక్తం చేశారు.బిజీ షెడ్యూల్‌లో కొంత సమయం కేటాయించి ఈ కార్యక్రమానికి హాజరైతే తమకెంతో ఆనందంగా ఉంటుందన్నారు. 'ఐడియాస్ ఫర్ ఇండియా' సదస్సుకి భారత్ ,బ్రిటన్ వ్యాపార రంగ ప్రముఖులు, పాలసీ మేకర్లు, తెలుగు ప్రవాసులు సహా 900 మందికి పైగా ప్రముఖులు హాజరవుతారు. ఈ వేదికలో భారత ఆర్థిక ప్రగతి, విదేశీ పెట్టుబడుల అవకాశాలు, వాణిజ్య సంబంధాల పురోగతి వంటి అంశాలపై ప్రధానంగా చర్చలు జరుగుతాయి. కేటీఆర్ తన పర్యటనలో బ్రిటన్ పారిశ్రామికవేత్తలు, తెలుగు ప్రవాసులతో ప్రత్యేకంగా సమావేశం అవుతారు.

## సిఎస్‌తో కేంద్ర పరిశ్రమ, అంతర్గత వాణిజ్య అధికారుల సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మార్చి28:** భారత ప్రభుత్వ పరిశ్రమ,అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ (డిపిఐఐటి)కు చెందిన ఉన్నతస్థాయి అధికారుల బృందం, ఆశాఖ ఉన్నతాధికారి సుకృతి లిఖి నేతృత్వంలో శుక్రవారం తెలంగాణ సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి,ఇతర సీనియర్ అధికారులతో సమావేశమై ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై చర్చించారు. సులభతర వ్యాపార విధానాన్ని అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా ఉందని సీఎస్ వారికి వివరించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో వేగవంతమైన వాణిజ్య,వ్యాపార అభివృద్ధికి అనువైన వాతావరణాన్ని సృష్టిస్తున్నామన్నారు.ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యాపార రంగానికి అనువైన వాతవరణాన్ని సృష్టించడంతో పాటు నాణ్యమైన ఉత్పత్తి విధానం, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడంపై దృష్టి సారించామన్నారు. వాణిజ్య వ్యాపార రంగాన్ని మెరుగుపరిచేందుకు ఇప్పటికే సంస్కరణలు చేపట్టామని పేర్కొన్నారు.

వాణిజ్య అవసరాలకు నిర్మించే బిల్డింగ్ ప్లాన్ అనుమతులను వేగవంతం చేయడానికి 'బిల్డ్ నౌ' భూములకు సంబందించిన సమస్యల పరిష్కారానికి 'భూ భారతి' వంటి కొత్త వ్యవస్థలు అమలులోకి తెచ్చామన్నారు. పారిశ్రామిక వేత్తల నుంచి ప్రభుత్వ విధానాలపై ప్రశంసలు అందుతున్నా యని సీఎస్ తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ విధానాలు సమర్ధవంతంగా అమలు పరిచేందుకు నిరంతర ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణ ఏర్పాటు చేశామన్నారు.

## ఆసియా కరాటే పోటీలు-2027ను నగరంలో నిర్వహణకు కృషి: మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ (గచ్చిబౌలి), మార్చి 28, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం క్రీడకలకు ప్రోత్సాహం కల్పిస్తుందని, 2027లో జరిగే ఆసియా కరాటే పోటీలను హైదరాబాద్ వేదికగా నిర్వహించేందుకు క ృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గచ్చిబౌలిలోని జీఎంసి బాలయోగి స్టేడియంలో 4వ కియో జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ -2025 పోటీలు ఘనంగా కొనసాగుతున్నాయి. కరాటే ఇండియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్, తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డిఓ అసోసియేషన్‌లు నిర్వహిస్తున్న ఈ పోటీలు ఈనెల 26వ తేదీన ప్రారంభం కాగా, మార్చి 29వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ ఛాంపియన్‌షిప్‌లో దేశ వ్యాప్తంగా ఉన్న 29 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన దాదాపు 1500మంది క్రీడాకారులు పాల్గొంటు న్నారు. ఈ పోటీల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, టిపిసిసి అధ్యక్షుడు, టిఎస్‌కెడిఏ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌లు ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నర్, స్పీకర్‌లకు నిర్వాహకులు గౌరవ బ్లాక్‌బెల్టులను ప్రదానం చేయగా, మంత్రి, స్పీక ర్‌లు కరాటే విన్యాసాలను స్టేజీ మీద ప్రదర్శించి విద్యా ర్థులను ఉత్సాహపరిచారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడకలకు అధిక ప్రోత్సాహం కల్పిస్తున్నారని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలనే ఏకైక లక్ష్యంతో ముందుకు సాగుతుందన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభు త్వం ఏర్పడిన తరువాత స్పోర్ట్స్‌ను ప్రోత్సహించే విధంగా మండల, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## చేపాక్‌లో చేతులెత్తేసిన చెన్నై సూపర్‌కింగ్స్

### 50 పరుగుల తేడాతో రాయల్ ఛాలెంజర్స్ గెలుపు

**చెన్నై, మార్చి 28:** ఐపిఎల్ 2025 సీజన్‌లో ఎనిమిదోమ్యాచ్‌లోసొంతగడ్డపైనే చెన్నై సూపర్‌కింగ్స్‌కు ఓటమి పరాభవం తప్పలేదు. రాయల్‌ఛాలెంజర్స్ బెంగళూరు టీమ్ 50 పరుగుల తేడాతో సిఎస్కేజట్టుపై విజయం సాధించింది. ఐపిఎల్ ఆరంభ సీజన్



2008లో చేపాక్‌లో చెన్నై సూపర్‌కింగ్స్‌పై ఆర్సీబీ విజయం సాధించింది. తర్వాత మళ్లీ చేపాక్‌లో ఆర్సీబీ గెలవలేదు శుక్రవారం జరిగిన పోరులో చెన్నైపై 50 పరుగుల తేడాతో ఆర్సీబీ విజయం సాధించింది. 197 పరుగుల భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన చెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు కేవలం 146 పరుగులు మాత్రమేచేసింది. రచిన్‌రవీంద్ర 31 బంతుల్లో ఐదు ఫోర్లతో 41 పరుగులుచేసి రాణించాడు. ఆతడు మినహా మిగిలిన బ్యాటర్లు అందరూ విఫలం అయ్యారు. చివరిలో ఎంఎస్‌ధోని 15 బంతుల్లో మూడు ఫోర్లు, రెండు సిక్స్‌లతో 30 పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచాడు. అప్పుడప్పుడూ బౌండరీలు బాదడంతో ఫ్యాన్స్ ఖుషీ అయ్యారు. ఆర్సీబీ బౌలర్లలో హేజిల్‌వుడ్ మూడు వికెట్లతో మెరిసాడు. యశ్‌దయాల్, లియాంలివింగ్‌స్టోన్‌లకు చెరో రెండు వికెట్లు సాధించారు. పవర్‌ప్లేలోనే చెన్నై ఓటమి ఖరారయిపోయింది. రెండో ఓవర్‌వేసిన హేజిల్‌వుడ్ రాహుల్‌త్రిపాఠి, ఐదు, కెప్టెన్ రుతురాజ్‌గైక్వాడ్‌లనున ఔట్‌చేసాడు. వెంటనే భువనేశ్వర్‌కుమార్ బౌలింగ్‌లో దీపక్‌హుడా 4 పరుగులకే ఔటయ్యాడు. సిఎస్కే పవర్‌ప్లేలో కేవలం 30 పరుగులుమాత్రమేచేసింది. రచిన్‌రవీంద్ర, శివందూబే19పరుగులుచేసి కాసేపు ప్రతిఘటించినా ఓటమి అపలేకపోయారు. చివరిలో ధోని బ్యాటింగ్‌కు వచ్చి ఒకటిరెండు బౌండరీలు సాధించడంతో మ్యాచ్‌చూసేందుకు స్టేడియానికి వచ్చిన ఫ్యాన్స్‌లో కొంత హుషారు వచ్చింది.

## బెంగళూరులో శాడిస్టు భర్త కిరాతకం

### భార్యను చంపి సూట్ కేసులో కుక్కి పుణే ఉడాయించి ఆత్మహత్యాయత్నం

**హైదరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త:** బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి తన భార్యను కిరాతకంగా హత్య చేసి శవాన్ని సూట్ కేసులో దాచి, ఇంట్లో పడవేసి, విమానంలో పూణె వెళ్లి అక్కడ విషం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గురువారం రాత్రి వెలుగు చూసిన ఈ ఘటనపై బెంగళూరు సిటీ పోలీసులు వేగంగా స్పందించి మొదట హత్యకు గురైన మహిళ శవాన్ని స్వాధీనం చేసుకుని, దీనికి కారకుడైన భర్తను అదుపులోకి తీసుకునేందుకు పూణెకు ప్రత్యేక బృందాన్ని పం పారు. వివరాలు ఇలావున్నాయి. మహారాష్ట్రకు చెందిన రాకేష్ రాజేంద్ర ఖేడ్కర్ (36) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య మహారాష్ట్రకే చెందిన గౌరి అ నిల్ సాంబ్రేకర్ (32) ఉన్నత విద్యను చదివి ఉద్యోగం వేటలో వుంది. వీరికి రెండేళ్ల క్రితం వివాహం అయినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ దంపతులు బెంగళూరు లోని దక్షిణ..పశ్చిమ ప్రాంతంలోని దొద్దకమనహళ్లి అనే ప్రాంతంలో గల అంబేద్కర్ అపార్ట్‌మెంట్‌లో మొదటి అంతస్తులో వుంటున్నారు. రెండు నెలల క్రితమే వీరు ఇ క్కడికి వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. దంపతుల మధ్య ఏం జరిగిందనేది తెలియరాకున్నా గురువారం మధ్యాహ్నం సమయంలో ఖేడ్కర్ తన భార్య గౌరిని కత్తితో పొడిచి దారుణంగా చంపేశాడు. అనంతరం శవాన్ని ఓ పెద్ద సూట్ కేసులో కుక్కి హాల్‌లో పడవేసి ఇంటికి తాళం వేసి విమానంలో పూణెకు ఉడాయించాడు. కాగా సాయంత్రం ఐదున్నర గంటల సమయంలో అతను అపార్ట్‌మెంట్ యజమానికి ఫోన్ చేసి తాను తన భార్యను చంపేసి, శవాన్ని సూట్ కేసులో వుంచి ఇంట్లో పడవేసి నట్లు చెప్పాడు. దీంతో అతను భయపడి వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు హుటాహుటిన రంగంలో దిగి ఖేడ్క ర్ నివాసం వుండే అపార్ట్‌మెంట్‌కు వెళ్లి చూడగా సూట్ కేసులో అతని భార్య గౌరి శవం రక్తపు మడుగులో వుంది. దీంతో పోలీసులు వెంటనే అప్రమత్తమై గౌరి మృత దేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, దీనిపై ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం ఖేడ్కర్ కోసం గాలింపు చేబట్టగా అతను పూణెలో ఒక చోట విషం తాగి ఆత్మహత్యకు యత్నించగా స్థానికులు గమనించి ఆసుపత్రిలో చేర్పించినట్లు తెలిసింది. దీంతో బెంగళూరు నుంచి ప్రత్యేక బృందం పూణెకె వెళ్లి ఖేడ్కర్‌ను అదు పులోకి తీసుకుంది. అతన్ని బెంగళూరుకు తీసుకు వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు బెంగళూరు పోలీసు కమిషనర్ దయానంద తెలిపారు.

## నిర్విరామంగా కొనసాగుతున్న సహాయకచర్యలు

### ఎస్ఎల్ బిసి టన్నెల్ సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష

**నాగర్ కర్నూల్ ప్రతినిధి, మార్చి 28 ప్రభాతవార్త:** ఎస్ఎల్‌బిసి, ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి శుక్ర వారం ఎస్ఎల్‌బిసి, టన్నెల్ లోపల సహాయక చర్యలలో పాల్గొంటున్న సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ లోతేటి మాట్లాడుతూ ఎస్ఎల్‌బిసి, టన్నెల్ లోపల చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు నిరంతరాయంగా పనిచేస్తున్న సహాయక బృందాల సహాయక చర్యలపై అభినందిస్తూ, రెట్టింపు వేగంతో సహాయక చర్యలను కొనసాగించాలని,అధికారులకు సూచించారు.

జిఎస్ఐ అధికారుల సూచనలకు అనుగుణంగా ప్రమాద ప్రదేశం నుండి 30 మీటర్ల వరకు భారీ కేడింగ్ చేసినట్లు, జియో లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు టెలిటెల్, బాక్స్ క్రీప్ స్ట్రక్చర్ లాంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరుపుతున్నట్లు వివరించారు. టన్నెల్ లోపల సహాయక చర్యల లో భాగంగా సొరంగంలో మట్టి తవ్వకాలు కొనసాగిస్తున్నట్లు, తవ్వ కాలకు అడ్డంకిగా ఉన్న స్టీల్‌ను తొలగిస్తూ, ఎప్పటికప్పుడు ఊట నీటిని పంపుల ద్వారా బయటకు తర లిస్తున్నట్లు వివరించారు. ప్రమాద ప్రదేశం సమీపంలో మట్టి కింద ఉన్న లోకో ట్రైన్ క్యాబిన్లను తొలగించి లోకో ఇంజన్ బయటకు తీసేందుకు, సహాయక బృందాలు పూర్తిస్థాయిలో సహాయక చర్యలు వేగవంతం చేస్తున్నట్లు వివరించారు. ప్రమాద ప్రదేశం సమీపంలో ఉన్న పెద్ద పెద్ద బండ రాళ్లను ఎస్కవేటర్ ద్వారా తొలగిస్తూ, టీబీఎం భాగాలను అల్ట్రా థర్మల్ కట్టర్ ద్వారా కట్ చేస్తూ వాటి భాగాలను లోకో ట్రైన్ ద్వారా బయటకు తీసుకువస్తున్నట్లు తెలియజేశారు.

## పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతి కేసు

## పోలీసుల దర్యాప్తు ముమ్మరం, పుకార్లపై హెచ్చరిక

**రాజమహేంద్రవరం, 28, ప్రభాతవార్త:** జిల్లాలో పాస్టర్ పగడాల ప్రవీణ్ కుమార్ అనుమానాస్పద మృతి కేసును పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసును ఛేదించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, విచారణను ముమ్మరం చేశారు.

**దర్యాప్తు వివరాలు**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ కేంద్ర కార్యాలయంఇద్దరు సభ్యులు గల ఫోరెన్సిక్ నిపుణుల బృందం సంఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించింది. కేసు దర్యాప్తు కోసం ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు హైదరాబాద్ నుండి విజయవాడ వరకు, విజయవాడ నుండి రాజమహేంద్రవరం వరకు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నాయి. అలాగే, కేసుతో సంబంధం ఉన్న వ్యక్తుల సమాచారాన్ని సేకరించి, వారిని విచారిస్తున్నాయి.

ఒక దర్యాప్తు బృందం హైదరాబాద్‌లో పాస్టర్ ప్రవీణ్ కుమార్ కుటుంబ సభ్యులను విచారించి, వారి వాంగ్మూలాన్ని నమోదు చేసింది.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేసు దర్యాప్తు పురోగతిని పోలీసు ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షి స్తున్నారు.

**పుకార్లపై హెచ్చరిక**

కేసు దర్యాప్తుకు సంబంధించి సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లు, తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని పోలీసులు ప్రజలను హెచ్చరించారు. పుకార్లు వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కుల, మత, రాజకీయ వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా, మతపరమైన తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సహాయం కోసం కేసు గురించి ఎవరి వద్దైనా సమాచారం ఉంటే, కొవ్వూరు డీఎస్పీ శ్రీ దేవ కుమార్ ఫోన్ నంబర్: 9440796620)కు తెలియజేయాలని పోలీసులు కోరారు. ఈ కేసు దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ఉంటామని అన్నారు.ఈ కేసుకు సంబంధించి మరింత సమాచారం అందుబాటులోకి వస్తే, దానిని కూడా తెలియజేస్తాము.

## అసెంబ్లీ వేదికగా రాజకీయాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం: పొన్నాల లక్ష్మయ్య

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిది, హైదరాబాద్, మార్చి 28:** అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలు చేసిందని మాజీ మంత్రి పొన్నాల లయ్య మండిపడ్డారు. రైతుల పంటలు ఎండిపోతుంటే అసలు ఏమాత్రం పట్టింపులేనట్లు ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పై బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రిజర్వాయర్లు అన్నీ నింపితే తొమ్మిది టీఎంసీల నీళ్ల ఉండేవని, కానీ ప్రభుత్వం అలాంటి పనులు చేయడం లేదన్నారు.

ఏమైనా బీఆర్ఎస్‌పై బురదజల్లేడమే కాంగ్రెస్ నేతలు పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు దాటినా ఇంకా పరిపాలనపై కాంగ్రెస్ నేతల్లో ఎవరికీ అవగాహన రావడం లేదన్నారు. ఇచ్చిన గ్యారంటీలన్నీ అటకెక్కించారని తెలిపారు. మహిళలకు ఇస్తామన్న రూ.2500 ఇవ్వడం లేదని, స్కూటీలు ఇవ్వడం లేదన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని, రైతులకు రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయలేదని ఆరోపించారు. రైతు భరోసా కూడా సరిగా అమలు చేయడం లేదని, రైతు కూలీలకు ఇస్తామన్న రూ.12 వేల సంగతే మర్చిపోయారని విమర్శించారు. అధికారంలోకి రావడమే లక్ష్యంగా పెట్టుకుని అమలుకు సాధ్యం కానీ హామీలు గుప్పించారన్నారు. వచ్చే ఎన్నికల్లో తప్పకుండా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతారని అన్నారు.

## వానాకాలంలో 66.80 లక్షల ఎకరాల్లో వరి

### 50 లక్షల ఎకరాల్లో పత్తి

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త:** వచ్చే వానాకాలం సీజనులో తెలంగాణ వ్యాప్తంగా 66.80 లక్షల ఎకరాలలో వరి సాగు చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. హైదరాబాద్ సచివాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అలాగే 6 లక్షల ఎకరాలలో మొక్కజొన్న, 50 లక్షల ఎకరాలలో పత్తి, 9 లక్షల ఎకరాలలో సోయా చిక్కుడు సాగు కాగలదని అంచనా వేయడం జరిగిందని చెప్పారు. అందుకు తగినట్లుగా వరికి సంబంధించి 16.70 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉంచాలని చెప్పారు. వీటితో పాటు మరో 48 వేల క్వింటాళ్ల మొక్కజొన్న, 1.35 లక్షల క్వింటాళ్ళ సోయాచిక్కుడు విత్తనాలు అవసరమవుతాయని వివరించారు. వరిలో సన్న రకాల సాగు పెరిగే అవకాశం ఉన్నందున విత్తనాలను అధిక మొత్తంలో ఉంచాలన్నారు. పత్తికి సంబంధించి 2.4 కోట్ల ప్రత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం జరుగు తుందని వెల్లడించారు.

## అటు వైన్‌షాపులు.. ఇటు బెల్టు షాపులు

### మేము ఎలా బతకాలి సారూ?

### తెలంగాణ బార్ ఓనర్స్ అసోసియేషన్ ఆందోళన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిది, హైదరాబాద్, మార్చి 28:** హైదరాబాద్ నాంపల్లిలోని ఆబ్కారీ శాఖ కార్యాలయం ముందు తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్ ఆందోళనకు దిగింది. రాష్ట్ర వ్యాప్తంగా తరలి వచ్చిన బార్ల యజమానులు తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. బార్ల చుట్టూ వైన్ షాపులలో పర్మిట్ రూమ్‌లు ఉండటంతో కస్టమర్లు తగ్గిపోయి తమ వ్యాపారం దెబ్బతింటుందని అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.వైన్‌షాపులకు పర్మిట్ రూమ్ ఇవ్వడం వల్ల తమ బార్లలో వ్యాపారం సరిగ్గా నడవడంలేదని తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్ ఆరోపించింది. పర్మిట్ రూమ్‌నింబంధన 25,26 ప్రకారం 100 స్క్వేర్ మీటర్లలో ఉండాలని కానీ ఎవరూ వాటిని పట్టించుకోవడం లేదని దామోదర్‌గౌడ్ వాపోయారు.తిను బండారాలు కూడా ఉండొద్దని నిబంధనలలో ఉందని తెలిపారు.కానీ వైన్‌షాపుల యాజమాన్యాలు రూల్స్ అతిక్రమించి 5 వందల స్క్వేర్ మీటర్ల నుంచి 2 వేల స్క్వేర్ మీటర్ల వరకు పర్మిట్ రూమ్‌లను నడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బార్లు చుట్టూ పక్కల బెల్టు షాపులు చాలా ఉన్నాయని, వాటిని ఎక్సైజ్ శాఖ అధికారులు తొలగించాలన్నారు. బెల్ట్‌షాపుల వల్ల, వైన్ షాపులు పర్మిట్‌రూమ్ నిబంధనలను పట్టించుకోకపోవడం లాంటి వాటితో బార్‌ఓనర్లు వ్యాపారం లేక సతమతమవుతున్నాని తెలిపారు. ప్రభుత్వానికి రెవెన్యూ విషయంలో బార్లు, వైన్ షాపులు రెండు కళ్లలాంటివి. ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు,ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకొని న్యాయం చేయాలని కోరారు.

## బిఆర్ఎస్ ప్రభుత్వ కృషితోనే తెలంగాణకు బివైడి: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మార్చి 28:** బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలోని తెలంగాణలో భారీ పెట్టుబడి పెట్టేందుకు ఎలక్ట్రిక్ వాహన దిగ్గజం బీవైడీ అంగీకరించిందని,ఇప్పుడు తెలంగాణ రాష్ట్రానికి రావడం పట్ల బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. భారీ పెట్టుబడితో తమ తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు బీవైడీ సంస్థ ముందుకు రావడంపై కేటీఆర్ శుక్రవారం సంతోషం వ్యక్తం చేశారు. సుమారు 10 బిలియన్ డాలర్ల పెట్టుబడి తెలంగాణలో పెట్టాలని బి వై డి సంస్థతో 2022-23లో పలుమార్లు చర్చలు జరిపామని తెలిపారు. బివైడి సంస్థ హైదరా బాద్‌లో ఒలెక్ట్రా సంస్థతో కలిసి పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చినప్పటికీ, చైనా దేశపు పెట్టుబడుల పైన కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధాన పరిమితుల వల్ల ఆ నిర్ణయం వాయిదా పడిందని కేటీఆర్ గుర్తు చేశారు. అయితే, ఇటీవల భారత ప్రభుత్వం సరళీకృత విధానాన్ని అనుసరించడం వల్ల ఈ పెట్టుబడి తిరిగి తెలంగాణకు రావడం పట్ల కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు.

బీవైడీ వంటి ఎలక్ట్రిక్ వాహన దిగ్గజ సంస్థ తమ పెట్టుబడిని తెలంగాణలో పెడుతుందంటే, అది తమ హయాంలో రూపొందించిన ఎలక్ట్రిక్ వాహన విధాన ఫలితమేనని కేటీఆర్ అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఫార్ములా-ఈపై చేస్తున్న విమర్శలను కేటీఆర్ ప్రస్తావించారు. ఫార్ములాఈ రేస్‌ను కేవలం రేస్‌గానే చూడకూడదని, తెలంగాణ మొబిలిటీ వ్యాలీ కార్యక్రమంలో భాగంగా సమగ్ర ప్రణాళికతో దీనిని నిర్వహించామని అనేక సార్లు చెప్పిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. దేశ ఎలక్ట్రిక్ వాహన రంగంలో తెలంగాణను కేంద్ర స్థానంగా మార్చాలనే లక్ష్యంతో అనేక అంశాలతో కూడిన పక్కా ప్రణాళిక ప్రకారం పనిచేశామని కేటీఆర్ తెలిపారు. అందులో భాగంగానే వినూత్నమైన ఈవీ పాలసీ, ఈవి సమ్మిట్, తెలంగాణ మొబిలిటీ వ్యాలీ ఏర్పాటు,ఫార్ములా ఈ నిర్వహణ వంటి అనేక కార్యక్రమాలను చేపట్టామన్నారు. గతంలో ఈవి విధానాన్ని తీసుకొచ్చి,ఎలక్ట్రిక్ వాహన రంగం, అనుబంధ రంగాలలో పెట్టుబడులను ఆకర్షించే ఉద్దేశంతో ఫార్ములాఈని నిర్వహించామని, దాని ఫలితమే ఈ బీవైడీ పెట్టుబడి అని కేటీఆర్ తెలియజేశారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ ఆలోచనలు, విధానాల ఫలితమే ఈ రోజు బీవైడీ సంస్థ భారీ పెట్టుబడి అని కేటీఆర్ వివరించారు.

# 'లవ్ యువర్ ఫాదర్' ప్రిరిలీజ్ ఈవెంట్

దివంగత లెజెండరీ సింగర్ ఎస్పి బాలసుబ్రహ్మణ్యం తనయుడు సింగర్ ఎస్పి చరణ్ చాలా ఏళ్ళ తర్వాత లైఫ్ (లవ్ యువర్ ఫాదర్) అనే సినిమాతో మళ్ళీ రీ ఎంట్రీ ఇస్తున్నారు. మనీషా ఆర్ట్స్, అన్నపరెడ్డి స్టూడియోస్ బ్యానర్స్ పై కిషోర్ రాఠీ, మహేష్ రాఠీ, రామస్వామి రెడ్డి నిర్మాతలుగా పవన్ కేతరాజు దర్శకత్వంలో ఈ లైఫ్ (లవ్ యువర్ ఫాదర్) సినిమా రాబోతుంది. శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా ఎస్పి చరణ్, నవాబ్ షా, ప్రవీణ్, భద్రం, రఘుబాబు, షకలక శంకర్, రియా.. వంటి నటీ నటులు ఈ సినిమాలో ముఖ్య పాత్రలు పోషించారు. ఇక ఈ సినిమాకు సీనియర్ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ మెలోడీ బ్రహ్మ మణిశర్మ సంగీతం అందించారు. తాజాగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ చాలా ఘనంగా జరిగింది. ఈ ఈవెంట్‌కి ముఖ్య అతిధిగా




ఎంఎల్ఏ మల్లా రెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా హీరో శ్రీ హర్ష మాట్లాడుతూ, ముందుగా ముఖ్య అతిధి మల్లా రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మల్లా రెడ్డి ఈ సినిమాలో నటించి ఉంటే బాగుండని కోరారు. ఆయన ఈ సినిమాలో నటించి ఉంటే, పాన్ వరల్డ్ సినిమా అయ్యేదని, ఆయన నటించకపోవడం వల్ల పాన్ ఇండియా సినిమా అయ్యిందని అన్నారు. అలాగే శ్రీ హర్ష ఈ సందర్భంగా తన తల్లిదండ్రులను గుర్తు చేసుకున్నారు. ఈ సినిమాని నిర్మించిన తన తండ్రి రామస్వామి రెడ్డికి కృతజ్ఞతలు తెలిపాడు. ఈ సినిమాని ఇంత అద్భుతంగా తీసిన డైరెక్టర్ పవన్ కేతరాజుకి ఎంతో రుణపడి ఉంటానని అన్నారు. మణి శర్మ లాంటి మ్యూజిక్ డైరెక్టర్ తన సినిమాకి సంగీతం ఇవ్వడం తన అదృష్టమని అన్నారు. ఇక ఎంఎల్ఏ మల్లా రెడ్డి మాట్లాడుతూ, ముందుగా ప్రేక్షకులకు నమస్కారాలు తెలిపారు. ఈ సినిమాని పాన్ ఇండియా భాషల్లో తీశారని తెలిసి ఆశ్చర్యపోయా అన్నారు. హీరో శ్రీ హర్ష తమిళ హీరో విజయ్ కంటే స్మార్ట్‌గా ఉన్నారని అన్నారు. హీరోయిన్ కషిక కపూర్ మంచి కసి కసిగా బాగుందని సరదాగా అన్నారు. శ్రీ హర్ష తమ కాలేజీ స్టూడెంట్ అని, వాళ్ళ తండ్రి తమ కాలేజీ ప్రిన్సిపాల్ అని, వీళ్ళు సినిమా చెయ్యడం తనకు చాలా ఆనందంగా ఉందని అన్నారు. అలాగే ఈ సినిమాలో పని చేసిన నటినటులకి అభినందనలు తెలిపారు. డైరెక్టర్ ప్రవీణ్ కేతరాజుని ఇంత అద్భుతమైన సినిమా తీసినందుకు ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఈవెంట్ కోసం తాను అసెంబ్లీ పనులు మానుకొని మరీ వచ్చానన్నారు. ఈ సినిమా కచ్చితంగా చాలా పెద్ద హిట్ అవ్వాలని, ప్రేక్షకులు ఈ సినిమాని ఆదరించి పాన్ ఇండియా హిట్ చెయ్యాలని ఎంఎల్ఏ మల్లా రెడ్డి కోరారు. ఇక డైరెక్టర్ పవన్ మాట్లాడుతూ, తమని దీవించడానికి వచ్చిన ముఖ్య అతిధి మల్లా రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవకాశం ఇచ్చినందుకు నిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే చరణ్ ఈ సినిమా చేయబట్టే చాలా అద్భుతంగా వచ్చిందన్నారు. బాల సుబ్రహ్మణ్యం, చరణ్‌ని మనకు గిఫ్ట్‌గా ఇచ్చారని ఆయన్ని పొగడ్తలతో ముంచెత్తారు. బాల సుబ్రహ్మణ్యం ఎక్కడున్నా కూడా చరణ్‌ని, మమ్మల్ని దీవిస్తూ ఉంటారని అన్నారు. బాలులేని లోటు చరణ్‌తో తీరిపోయిందని అన్నారు. చరణ్ఇచ్చిన కోపరేషన్ వల్లే ఈ సినిమా ఇంత బాగా వచ్చింది అన్నారు. అలాగే నటుడు ప్రవీణ్‌కి కూడా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రఘుబాబు, ఇతర నటినటులకి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకాఈసినిమాకి పని చేసిన సీనియర్ టెక్నీషియన్స్ శ్యామ్, మణి శర్మకి కృతజ్ఞతలు తెలిపారు.

# అభిమన్యు సింగ్ ప్రతీ నటనలోనూ కొత్త కోణం

నటుడు అభిమన్యు సింగ్ ఎల్2: ఎంపురాన్‌తో మలయాళ సినిమాలో అరంగేట్రం చేశారు. ఆయన మొదటి సినిమానే ఇంత విస్తృత స్థాయి, బిగ్ స్కేల్ ఉన్న చిత్రం కావడంతో ఆయన్ను అదృష్టం వరిం చిందనే చెప్పాలి. గబ్బర్ సింగ్ చిత్రంతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకొని పలు సూపర్ హిట్ చిత్రాల్లో నటించారు. ఇప్పుడు సూపర్‌స్టార్ మోహన్‌లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్, కరోలిన్ కోజియోల్ వంటి హాలీవుడ్ నటులతో కలిసి ఎంపురాన్ చిత్రంలో మెయిన్ విలన్‌గా నటించారు. ఈ సినిమాలో అభిమన్యు సింగ్ నటన చాలా బాగుందని, ఎంతో ప్రత్యేకంగా ఉందని ప్రేక్షకులు మాట్లాడం విశేషం. ఈ సందర్భంగా నటుడు అభిమన్యు.. ఎంపురాన్ సినిమాలోని తన పాత్రను ప్రజలు ఆదరిస్తున్నందుకు చాలా కృతజ్ఞుడిని తెలిపారు. దేశవ్యాప్తంగా మంచి ప్రశంసలు అందుతున్నాయి. ఒక నటుడికి ఇంతకంటే ఎక్కువ ఏమీ కావాలి అని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అభిమన్యు సింగ్ ప్రస్తుతం ఓజి చిత్రంలో నటిస్తున్నారు. పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తుండగా అభిమన్యు విలన్‌గా నటిస్తున్నాడు. తెలుగు సినిమాల్లో ఉండే రెగ్యూలర్ విలన్ లా కాకుండా వీబిలో తన పాత్ర సరికొత్తగా ఉంటుందని చెప్పాడు. ఈ పాత్రకు భిన్నమైన షేడ్స్ ఉన్నాయి. పాత్ర ప్రారంభం ఎంత భిన్నంగా మొదలౌతుందో అంతే భిన్నంగా ముగుస్తుందని పేర్కొన్నారు. ఈ పాత్రను తెరమీద చేస్తున్న ప్రేక్షకులు కొన్నిసార్లు ద్వేషిస్తారు, కొన్నిసార్లు ఇష్టపడతారు అన్నారు. అలాగే డైరెక్టర్ సుజిత్ ఒక మంచి విజన్ ఉన్న దర్శకుడు అని పేర్కొన్నారు. ఓజీ సినిమా చాలా బాగా రూపొందుతుందని పవన్ కల్యాణ్‌తో రెండోసారి కలిసి పనిచేసే అవకాశం రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఓజీతో పాటు ఆమిర్ ఖాన్ నిర్మాణంలో రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వంలో లాహోర్ 1947 అనే చిత్రంలో నటిస్తున్నట్లు చెప్పారు. ఇది భారీ బడ్జెట్ బాలీవుడ్ చిత్రం. ఈ మూవీలో కూడా చాలా భిన్నమైన పాత్రను పోషిస్తున్నట్లు తెలిపారు. ఈ సినిమా ప్రేక్షకులకు కను విందుగా ఉంటుందని ఖచ్చితంగా చెప్పగలను అని అభిమన్యు అంటున్నారు. దేవర చిత్రంలో కూడా విలన్‌గా మంచి పేరు వచ్చింది. నేను నా రాక్షసి చిత్రంతో తెలుగులో అరంగేట్రం చేసిన ఈ నటుడు, తెరపై అద్భుతమైన ప్రదర్శనలతో ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టాడు. తెలుగు సినిమాలో అన్ని మంచి పాత్రలే చేశారు. ఈ సందర్భంగా ప్రతీ సినిమా తనకు కొత్త సినిమే అని, నిజానికి తన ప్రయాణం ఇప్పుడే మొదలైందని, ఇంకా చాలా దూరం వెళ్లాలని భావిస్తున్నట్లు చెప్పారు. ప్రతీ పాత్ర తనకు ఛాలెంజ్ అని, ఏ పాత్ర చేసినా నటుడిగా తనను తాను నిరూపించు కోవడానికి ప్రయత్నిస్తానని చెప్పారు. నటన అనేది కేవలం రెండు సంవత్సరాల్లో పరిపూర్ణంగా సాధించే విషయం కాదు. నటన ఒక కళ, కొన్నిసార్లు జీవితకాలం సరిపోదు సంపూర్ణంగా చేయడానికి అని తెలిపారు. ఇప్పుడు సినిమా చాలా మారిందని ప్రపంచ సినిమాలను ప్రేక్షకులు చూస్తున్నారని, అందుకే ప్రతీ సారి ఒకేలా చేస్తే కుదరదు అని అభిమన్యు సింగ్ అంటున్నారు. పాత్రకు తగ్గట్లు ఒదిగిపోవడం నేర్చుకున్న నటులే ఎక్కువకాలం ఈ పరిశ్రమలో రాణిస్తారు అని చెప్పారు. ప్రస్తుతం విలన్ పాత్రలో పాటు కొన్ని కీలకమైన పాత్రలు చేస్తున్నట్లు.. ఏ దానికి అదే ప్రత్యేకంగా ఉండేలా చూసుకుంటానని అభిమన్యు సింగ్ చెప్పారు. విలన్‌గా ఎన్ని సార్లు తెరమీద కనిపించినా ప్రేక్షకులకు బోర్ కొట్టకపోవడానికి కారణం ఆయన తీసుకునే జాగ్రత్తలే అని అభిమన్యు సింగ్ వెల్లడించారు.



# జపాన్‌లో తెలుగు మాట్లాడిన అభిమాని..

ప్రస్తుతం మన తెలుగు సినిమా ఖ్యాతి, తెలుగు హీరోల స్థాయి ప్రపంచ దేశాలకు విస్తరించిన సంగతి తెలిసిందే. ఇక మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ తన దేవర సినిమాను జపాన్‌లో భారీ ఎత్తున ప్రమోట్ చేశారు. ఆర్ఆర్ఆర్ తరువాత అక్కడ మ్యాన్ ఆఫ్ మాసెస్‌కు విపరీతమైన క్రేజ్ ఏర్పడిన సంగతి తెలిసిందే. అందుకే అక్కడి అభిమానుల్ని అలరించేందుకు దేవరను జపాన్‌లో రిలీజ్ చేశారు. ఈ క్రమంలో అక్కడి మీడియా, అభిమానులతో ఎన్టీఆర్ ముచ్చటించారు. ఈ క్రమంలో ఓ అభిమాని ఎన్టీఆర్ వద్దకు వచ్చి తెలుగులో మాట్లాడారు. జపాన్‌లో ఇలా తెలుగు మాట్లాడటం ఏంటి? అని ఎన్టీఆర్ ఆశ్చర్యపోయారు. దీంతో ఆ ఎమోషనల్ వీడియోనిపంచుకున్నారు. ఆర్ఆర్ఆర్ చూసిన తర్వాత ఒక జపనీస్ అభిమాని తెలుగు నేర్చుకోవడం ప్రారంభించారట. ఆ అభిమాని గురించి చెబుతూ ఎన్టీఆర్ ఓ పోస్ట్ వేశారు. సిని మా అనేది భాషా సరిహద్దుల్ని చెరిపేస్తుందని, అందరినీ ఏకం చేస్తుందని చెప్పడానికి ఇదొక ఉదాహరణ అన్నారు. 'నేను జపాన్‌కి వచ్చిన ప్పుడల్లా అందమైన జ్ఞాపకాలే గుర్తొస్తాయి. అయితే ఈ సారి మాత్రం కాస్త భిన్నమైన అనుభూతి కలిగింది. ఒక జపనీస్ అభిమాని ఆర్ఆర్ఆర్ చూసిన తర్వాత తాను తెలుగు నేర్చుకున్నానని చెప్పడం విని నిజంగా నన్ను కదిలించింది. సంస్కృతుల మధ్య వారధిగా ఉండటానికి సినిమా అనేది ఓ శక్తిలా ఉంటుందని చాటి చెప్పారు. సినిమా, భాషల ప్రేమికుడిగా ఒక అభిమానిని భాష నేర్చుకోవడానికి ఆ సినిమా ప్రోత్సహించింది అని చెప్పడం నేను ఎప్పటికీ మర్చిపోలేను. ఇలాంటి వాటి కోసమే మన ఇండియన్ సినిమాను ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నామ'ని ఎన్టీఆర్ అన్నారు.




# 'మ్యాడ్ స్క్వేర్' సక్సెస్ మీట్

తెలుగు ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూసిన మ్యాడ్ స్క్వేర్ సినిమా థియేటర్లలో అడుగుపెట్టింది. బ్లాక్ బస్టర్ చిత్రం మ్యాడ్‌కి సీక్వెల్‌గా రూపొందిన మ్యాడ్ స్క్వేర్‌లో నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రలు పోషించారు. కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్‌తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించారు. ఈ చిత్రానికి సూర్యదేవర నాగవంశీ సమర్పకులు. భీమ్స్ సిసిరోలియో పాటలను స్వరపరచగా, తమన్ నేపథ్య సంగీతం అందించారు. భారీ అంచనాల నడుమ మ్యాడ్ స్క్వేర్ చిత్రం, నేడు(మార్చి 28) ప్రేక్షకుల ముందుకు వచ్చింది. థియేటర్లలో నవ్వులు పూయిస్తున్న ఈ చిత్రానికి మొదటి షో నుంచే విశేష స్పందన లభిస్తోంది. మొదటి భాగానికి రెట్టింపు వినోదం మ్యాడ్ స్క్వేర్‌లో ఉందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో షో షోకి వసూళ్లు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా ప్రెస్‌మీట్ నిర్వహించిన చిత్ర బృందం, తమ ఆనందాన్ని పంచుకుంది. చిత్ర సమర్పకులు సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ, "మా మ్యాడ్ స్క్వేర్ సినిమా తెలుగు రాష్ట్రాలలో ఉదయం 8 గంటల షోతో మొదలై, సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకుంది. అన్ని షోలు హౌస్ ఫుల్ అవుతున్నాయి. భారీ ఓపెనింగ్స్ వస్తున్నాయి. కొన్ని ఏరియాల్లో మ్యాడ్ క్లోజింగ్ కలెక్షన్స్, మొదటిరోజే మ్యాడ్ స్క్వేర్‌కి వచ్చే అవకాశముంది. మేము ముందు నుంచి చెబుతున్నట్టు, ప్రేక్షకులను నవ్వించడమే లక్ష్యంగా ఈ సినిమాని రూపొందించాము. ఆ విషయంలో విజయం సాధించాము. ఈ వేసవిలో ప్రేక్షకులు మా సినిమా చూసి బాగా నవ్వుకోవాలని కోరుకుంటున్నాము. కుటుంబ ప్రేక్షకులకు కూడా ఈ సినిమా బాగా నచ్చుతుంది" అన్నారు. నిర్మాత హారిక సూర్యదేవర మాట్లాడుతూ, "మా సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు ముందుగా కృతజ్ఞతలు. మాకష్టానికి తగ్గ ఫలితం దక్కడం చాలా సంతోషంగా ఉంది. కాలేజ్ స్టూడెంట్స్ మాత్రమే కాకుండా, ఫ్యామిలీ ఆడియన్స్ కూడా సినిమాకి వస్తున్నారు. సినిమా చూస్తూ అందరూ నవ్వుతూనే ఉన్నారు. అన్ని థియేటర్లలోనూ ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది అన్నారు. దర్శకుడు కళ్యాణ్ శంకర్ మాట్లాడుతూ, "సీక్వెల్ కదా మొదటిభాగంతో పోలుస్తారనే టెన్షన్‌తోనే థియేటర్‌కి వెళ్ళాము. ప్రేక్షకులంతా ఎంజాయ్‌చేస్తుంటే, దీనికోసమే కదామనం సినిమా తీసింది అనే ఫీలింగ్ వచ్చింది. సంగీత దర్శకులు భీమ్స్‌కి, థమన్‌కి థాంక్స్. ఎడిటర్ నవీన్ నూలి క్రిస్పీరన్ టైం తో సినిమాకి బ్యాక్ బోన్‌గా నిలిచారు. మేము సర్‌ప్రైజ్‌లా దాచిన సునీల్ పాత్రకి మంచి స్పందన.



# 'కర్మణ్యే వాధికారస్తే' టీజర్ లాంచ్

వర్తమాన నేర ప్రపంచంలో జరుగుతున్న ఘటనల ఆధారంగా వైవిధ్యభరితమైన కథాంశంతో తెరకెక్కిన చిత్రం "కర్మణ్యేవాధికారస్తే". ఈ నేర ప్రపంచంలో జరిగే ఉదంతాలను కర్తవ్యమే దైవంగాభావించే ఒక పోలీసు అధికారుల బృందం ఏవిధంగా ఎదుర్కొంది అనేది ఈ చిత్రం యొక్క కథాంశం. అమర్ దీప్ చల్లపల్లి దర్శకత్వం వహించారు. తొలి ప్రయత్నంలోనే తన దర్శకత్వ శైలితో ఆకట్టుకున్నారు. ఉషస్విని ఫిలిమ్స్ పతాకంపై డి ఎస్ ఎస్ దుర్గా ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటర్. భాస్కర్ సామల సినిమాటోగ్రఫీ అందించారు. గ్యానీ సంగీతం సమకూర్చారు. కథ సంభాషణలు శివకుమార్ పెళ్లూరు అందించారు. శత్రు, బ్రహ్మాజీ, మాస్టర్ మహేంద్రన్ ప్రధాన పాత్రల్లో నటించగా, పృథ్వీ, శివాజీ రాజా, శ్రీ సుధా, బెనర్జీ, అజయ్ రత్నం తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఐరా దయానంద్ రెడ్డి ఈ చిత్రంతో పరిచయమవుతున్నారు. విశాఖ పట్నం, హైదరాబాద్‌లలో చిత్రీకరణ జరుపుకున్న ఈ చిత్రం ప్రస్తుతం ప్రసాద్ ఫిలిం ల్యాబ్, సారధి స్టూడియోస్‌లో నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని త్వరలో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సన్నద్ధమవుతోంది. తాజాగా ఈ విభిన్నమైన యాక్షన్ ఎంటర్టైనర్ నుంచి టీజర్ విడుదలై ఆద్యంతం ఉత్కంఠభరితంగా నిలిచి చిత్రంపై మరింత ఆసక్తిని రేకెత్తించింది. నటినటులు: బ్రహ్మాజీ, శత్రు, మాస్టర్ మహేంద్ర, బెనర్జీ, పృథ్వి, శివాజీ రాజా, అజయ్ రత్నం, శ్రీ సుధా, కృష్ణ భట్ (నూతన పరిచయం). ఇరా దయానంద్(నూతన పరిచయం),అయేషా(నూతన పరిచయం), రెహానా ఖాన్ (నూతన పరిచయం), జయ రావు, బాహు బలి మధు, తదితరులు.



# 'ఆదిత్య 369' రీరిలీజ్ ఫంక్షన్!

1991లో విడుదలై సంచలన విజయాన్ని సాధించిన ఈ సినిమా రీరిలీజ్ సందర్భంగా మార్చి 30, ఉగాది రోజున నందమూరి బాలకృష్ణతో సహా చిత్రంలోని నటీనటులు, సాంకేతిక నిపుణులతో హైదరాబాద్‌లో రీరిలీజ్ ఫంక్షన్ ఏర్పాటు చేశారు శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణ ప్రసాద్. ఈ సందర్భంగా శివలెంక కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ నందమూరి బాలకృష్ణ రెండు విభిన్న పాత్రల్లో అలరించి, మా సంస్థకి భారీ విజయాన్ని, చిరస్మరణీయ గుర్తింపుని అందించిన "ఆదిత్య 369" చిత్రాన్ని ఏప్రిల్ 4న రీరిలీజ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఆ సంతోషాన్ని పంచుకోవడానికి మా నటీనటులు, సాంకేతిక నిపుణులు, మీడియా సమక్షంలో ఈ ఉగాదికి రీరిలీజ్ ఫంక్షన్ ఏర్పాటు చేశాము. దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు ఈ సినిమాను తెలుగు చలనచిత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచేలా తీర్చిదిద్దారు. చక్కని థియేటర్లు కూడా లభించడంతో వైభవంగా రీ రిలీజ్ చేస్తున్నాం" అన్నారు.







# జోరు పెంచిన రితికా నాయక్

సినీరంగంలో స్టార్ డమ్ రావాలంటే ప్రతిభతోపాటు కాసింత అదృష్టం కూడా ఉండాలి. అందం, అభినయంతో వెండితెరపై సందడి చేసిన పలువురు హీరోయిన్ కాలం కలిసిరాక తక్కువ సమయంలోనే ఫెడవుట్ అయిపోతుంటారు. కానీ కొందరికి మాత్రం చాలా కాలం తర్వాత సరైన బ్రేక్ వస్తుంది. ఇప్పుడు ఈ హీరోయిన్ సైతం అలాంటి జాబితాలోకి వస్తుంది. రితిక నాయక్.. ప్రస్తుతం టాలీవుడ్ ఇండస్ట్రీలో జోరు మీద దూసుకుపోతున్న హీరోయిన్. మాస్ కా దాస్ విశ్వక్ సేన్ నటించిన అశోకవనంలో అర్జున కళ్యాణం సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. మొదటి సినిమాతోనే నటిగా మంచి మార్కులు కొట్టేసింది. కానీ ఈ సినిమా తర్వాత అమ్మడుకు అంతగా ఆఫర్స్ రాలేదు. నాని నటించిన హాయ్ నాన్న మూవీలో చిన్న పాత్రనే కానీ ఈ సినిమా తర్వాత అమ్మడుకు అంతగా ఆఫర్స్ రాలేదు. అలాగే మెగా హీరో వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ కాంబోలో రాబోతున్న కొరియన్ డ్యాక్ డ్రాప్ హారర్ కామెడీ మూవీలోనూ ఈ అమ్మడు ఛాన్స్ దక్కించుకున్నట్లు సమాచారం. అలాగే గోపిచంద్ 33వ సినిమాలోనూ ఈ బ్యూటీ కనిపించనుందని టాక్. డైరెక్టర్ సంకల్ప్ రెడ్డి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారట. ఏడో శతాబ్దంలో జరిగిన ఓ యధార్థ సంఘటన ఆధారంగా ఈ సినిమాను రూపొందిస్తున్నారని సమాచారం. ప్రస్తుతం టాలీవుడ్ ఇండస్ట్రీలో జోరు మీద దూసుకుపోతుంది హీరోయిన్ రితికా నాయక్. ఇప్పుడిప్పుడే తెలుగులో వరుస ఆఫర్స్ అందుకుంటూ బిజీగా ఉంది. ఈ అమ్మడుకు మరిన్ని ఆఫర్స్ రావడం ఖాయమని తెలుస్తోంది.



# 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ' ఫస్ట్ లుక్

మత్తువదలరా, సూపర్ హిట్ సిరీస్ వికటకవిలో తన అద్భుతమైన నటనతో ఆకట్టుకున్న హీరో నరేష్ అగస్త్య తన నెక్స్ట్ ప్రాజెక్ట్ సైన్ చేశారు విపిన్ దర్శకత్వంలో సునేత్ర ఎంటర్టైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై ఉమా దేవి కోట నిర్మించిన ఈ మూవీ కంటెంట్‌రిచ్ మ్యూజికల్ రొమాంటిక్ డ్రామా. కూల్, బ్రీజీ ఫస్ట్ లుక్ పోస్టర్ ద్వారా మేకర్స్ ఈ సినిమా టైటిల్‌ను రివిల్ చేశారు. ఈ సినిమాకు మేఘాలు చెప్పిన ప్రేమ కథ అనే ప్లజెంట్ టైటిల్ పెట్టారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో నరేష్ అగస్త్య చీర్ ఫుల్ అవతార్‌లో ఆకట్టుకున్నారు. రబియా ఖటూన్ ఛార్మింగ్‌గా కనిపించింది. వారి మధ్య పొగమంచు కొండ ప్రాంతం, ప్రశాంతమైన నేపథ్యం మధ్య ఉంచబడిన గిటార్ మూవీ మ్యూజిక్ బ్యాక్ డ్రాప్ ని సూచిస్తుంది. ఇది లవ్, డ్రీమ్స్, బ్యూటీఫుల్ కథని తెలియేస్తోంది. సుమన్, ఆమని ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో రాధిక శరత్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ మూవీకి ట్యాలెంటెడ్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. మోహన కృష్ణ సినిమాటోగ్రఫీ, జస్టిన్ ప్రభాకరన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి, వెటరన్ తోట తరణి ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. మార్తాండ్ కె. వెంకటేష్ ఎడిటర్. మేఘాలు చెప్పిన ప్రేమ కథ టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌తో చాలా క్యురియాసిటీ క్రియేట్ చేసింది. సినిమా షూటింగ్ పూర్తయింది. పోస్ట్‌ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలో సినిమా విడుదల తేదీని మేకర్స్ అనౌన్స్ చేస్తారు. తారాగణం: నరేష్ అగస్త్య, రబియా ఖాతూన్, రాధిక శరత్ కుమార్, తనికెళ్ల భరణి, వెంకటేష్ కాకుమాను, విద్యుల్లేఖ, సుమన్, ఆమని, తులసి, చైల్డ్ ఆర్టిస్ట్ మాస్టర్ కార్తికేయ, మోహన్ రామన్, సాంకేతిక సిబ్బంది: రచన,దర్శకత్వర్: విపిన్, నిర్మాత: ఉమాదేవి కోట, బ్యానర్: సునేత్ర ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, సినిమాటోగ్రాఫర్:మోహనకృష్ణ, సంగీతం:జస్టిన్ ప్రభాకరన్, ఆర్ట్: తోట తరణి, ఎడిటర్:మార్తాండ్ కె వెంకటేష్. పీఆర్వో: వంశీశేఖర్.



# టోనింగ్‌తో తాజాదనం !



ఈ వేసవిలో టోనర్‌తో మేకప్‌ను ఎక్కువసేపు ఉంచుకోవచ్చు. చర్మ సంరక్షణ, పీహెచ్ స్థాయిలను సమన్వయం చేయగలిగే టోనర్ను తయారు చేద్దామా

**జిడ్డు చర్మానికి..** మరిగించిన కప్పు నీటిలో గుప్పెడు రేకలు వేసి చల్లార్చాలి. మేకప్ వేసే ముందు దీన్ని స్ప్రే చేస్తే చర్మం మృదువుగా, తాజాగా ఉంటుంది. కాసిని వేపాకులు నీటిలో వేసి మరగనిచ్చి చల్లార్చాలి. ఔషధగుణాలు మెండుగా ఉంటే ఈ టోనర్ ముఖంపై మొటిమలు, మచ్చలను నివారించి, జిడ్డును తొలగిస్తుంది. కప్పు నీటిలో రెండు గ్రీన్ టీ ప్యాక్స్ మరిగించి చల్లార్చాలి. క్లెన్సింగ్ తర్వాత దీన్లో ముంచిన దూదిని ముఖానికి అద్దితే ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మానికి తేమనిచ్చి, బిగుతుగా ఉంచి వృద్ధాప్య ఛాయలను నియంత్రిస్తాయి.

**పొడి చర్మానికి...** కప్పునీళ్లలో అరకప్పు కొబ్బరిపాలు పోసి బాగా కలిపిన మిశ్రమంలో దూది ముంచి ముఖానికి రాయాలి. పొడిబారిన చర్మం తేమగా మారుతుంది. ఇందులోని విటమిన్ సి, యాంటీ ఫంగల్ లక్షణాలు చర్మ సమస్యలను దూరం చేస్తాయి. బియ్యాన్ని నానబెట్టిన నీటిని ముఖంపై స్ప్రే చేస్తే మేకప్ ఎక్కువసేపు తాజాగా కనిపిస్తుంది. కప్పు నీటిలో తులసి ఆకులు మరిగించి వడకట్టి ముఖమంతా రాయాలి. ఔషధగుణాలున్న ఈ టోనర్ చర్మంపై మచ్చలు తగ్గి, ఆరోగ్యంగా మెరిసేలా చేస్తుంది. □

# వృత్తి నైపుణ్యాలుంటే.. విజయం

అమ్మాయిలు వ్యాపారంలో అడుగు పెట్టాలంటే సవాలక్ష అడ్డంకులు. కానీ వినూత్న ఆలోచన, కష్టపడే నైజం, వృత్తినైపుణ్యాలుంటే విజయం వెతుక్కుంటూ వస్తుందనడానికి ఈ మహిళలు నిదర్శనం. వీళ్ల స్థాపించిన సంస్థలు యూనికార్న్ (బిలియన్ డాలర్ల విలువ) స్థాయిని అందుకుంటోంది... మరెందరికో స్ఫూర్తినిస్తున్నాయి.

**చిన్న ఆసుపత్రిగా మొదలై...**



నువ్వు గైనకాలజీ చదువమ్మా. అమ్మాయిలకు సంబంధించిన విభాగం కాబట్టి, నీకే సమస్యలు ఉండవు... నాన్న ఇచ్చిన సలహాతో అదే ఎంచుకున్నారు గరిమా సాహ్నీ కుటుం బంలో తొలి డాక్టర్. దీంతో ఇంట్లోవాళ్ల సలహానే అనుసరించారు. ఈమెది గురు గ్రామ్. చదువయ్యాక ప్రముఖ ఆసుపత్రుల్లో సీనియర్ రెసిడెంట్గా పనిచేశారు. తరవాత బయటికొచ్చి 'ప్రిస్టిన్ కేర్' పేరుతో ఆసుపత్రి ప్రారంభించారు. దీన్ని మరింత అభివృద్ధి చేయాలనుకుని భర్త వైభవ్, స్నేహితుడు హర్సింబర్‌బిర్ సింగ్‌తో చేతులు కలిపారు. అప్పుడే వైద్యసేవలకు టెక్నాలజీని జోడిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన వచ్చిందామెకు. ముగ్గురికీ ఆలోచన నచ్చాక 'ప్రిస్టిన్ కేర్'కి కొత్తరూపు తీసుకొచ్చారు. టెక్నాలజీతో నాన్ ఎమర్జెన్సీ సర్జరీలను చేయడం మొదలుపెట్టారు. తక్కువ నొప్పి, త్వరితంగా కోలుకోవడం, సర్జరీ తాలూకు మచ్చలూ పెద్దగా కనపడకుండా చూడటం వంటి అంశాలతో వచ్చారు. ట్రీట్‌మెంట్ సులువుగా, రోగులకూ ఇబ్బంది లేకుండా ఉండటంతోపాటు. సర్జరీ తరవాత తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించీ శ్రద్ధ వహిస్తారు. దీంతో చాలామంది ప్రిస్టిన్ కేర్ సేవలపై ఆసక్తి చూపారు. పెట్టుబడులూ వచ్చాయి. దేశవ్యాప్తంగా ఆసుపత్రులతో ఒప్పందాలు చేసుకున్న ప్రిస్టిన్ కేర్ ప్రారంభించిన మూడేళ్లలోనే 2021లో యూనికార్న్ హోదాని దక్కించుకుంది. "కొత్తగా ఇంకా ఏం చేయగలం అని ఆలోచిస్తే చాలు. అద్భుతాలు సృష్టించొచ్చు అంటారు గరిమ.

**నెయ్యా... ఆలోచనలు నయా! ....** తన స్నేహితుల్లో కొందరు ప్రెగ్నెన్సీ మందూ డెలివరీ తర్వాత మెరుగైన సేవలూ సూచనలూ అందక ఇబ్బందిపడటాన్ని గమనించారు వైయ్య సగ్గీ. ఆ సమస్యలు పరిష్కారము చూపాలనుకున్నారు. అప్పటికి మెకిన్సీ ముంబయి కార్యాలయంలో పనిచేస్తున్నారామె. 2010లో హార్వర్డ్‌లో చదివేందుకు వెళ్లి.. తిరిగిగిఒచ్చాక 2014లో 'బేబీచక్ర'ను ప్రారంబించారు. ఇది అమ్మల సోషల్ నెట్‌వర్క్. దీన్లో తల్లులు తమ అనుభవాలను పంచుకోవచ్చు. వైద్యుల సలహాలు తీసుకోవచ్చు, తనకు కావాల్సిన వస్తువులు కొవొచ్చు తల్లి అయిన మహిళకు సమయం తక్కువగా ఉంటుంది. ఆ సమయంలో ఆమెకు కావాల్చింది. నమ్మకం. ఈ అంశంపైన ఇంకుపైన దృష్టి పెట్టారు నైయ్యా. ఒక దశలో ఇది 2.5కోట్ల తల్లులకూ, 10వేల డాక్టర్లకూ చేరువైంది. 'పెట్టుబడులకు వెళ్తే సహ వ్యవస్థాపకుల్లో అబ్బాయిలు లేరా. అని అడిగేవారు. ఆ మాటలు చాలా ఇబ్బందిగా ఉండే. ఉండేది కానీ అవి నన్ను మరింత దృఢపరిచాయి' అంటారు నైయ్యా తర్వాత కాలంలో బేబీచక్ర హార్వర్డ్ బిజినెస్ స్కూల్ పాఠమైంది. 2021లో బేబి చక్ర మరికొన్ని సంస్థలతో కలిసి గుడ్ గ్లామ్ గ్రూప్‌గా ఏర్పడింది. అదే సంవత్సరం యూనికార్న్ స్థాయిని అందు కుందా సంస్థ. ఈ గ్రూపులో 65 శాతం మహిళా ఉద్యోగులే. మీడియా కంటెంట్‌ను రూపొందించడంతోపాటు, విదేశాలకూ సౌందర్య ఉత్పత్తుల్ని ఎగుమతి చేస్తోందీ సంస్థ ఇటీవల సొంతంగా 'ఎడిషన్ సంస్థను ప్రారంభించారు నైయ్యా కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్‌లో భారత సత్తాను ప్రపంచానికి తెలియజేసేలా ఈ కుపెనీని తీర్చుదిద్దుతున్నారీ సీరియల్ ఆంత్రప్రెన్యూర్ నైయ్యా ఇద్దరు పిల్లలకు తల్లి మాతృ త్వం కెరియర్‌కు అడ్డకి కాదు, నిజానికి ప్రయాణాన్ని వేగవంతం చేసే అవకాశం అంటా రీమె. ఏంజిల్ ఇన్వెస్టర్‌గానూ మారారు.



**నచ్చిన తిండి దొరకలేదని...**



అమెరికా నుంచి అప్పుడే చెన్నైకి మకాం మార్చారు రాజోషి ఘోష్ స్థానిక వంటకాలు ఆన్‌లైన్‌లో వెతికితే సరైనవి దొరికలేదు. . అసలే ఫుడీ, తనకు నచ్చిన ఆహారం వెతికే క్రమంలో ఒక ఆలోచన తట్టింది. అదే... ఇంటి భోజనం అందించే వాటితో ఓ సంస్థను స్థాపించడం. ఆ సమయంలో తనలాగే ఆహారంపై ఆసక్తి ఉన్న తన్మయ్ పరిచయమయ్యాడు. ఇద్దరూ కలిసి యాప్‌ని రూపొందించారు. ఈ ఎదురైన సమస్యలను సులువుగా పరిష్కరించారు రాజోషి ఈమె స్వస్థలం బెంగళూరు. నేషనల్ యూని వర్సిటీ ఆఫ్ సింగ నుంచి కంప్యూటేషనల్ జీనోమిక్స్‌లో డిగ్రీ, స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి గ్లోబల్ ఇన్నోవేషన్స్ ప్రోగ్రామ్ చేశారు. అవెలింక్, టెక్ సెలూన్, ఫైండ్ ఎ కడాయి, 34 క్రాస్ వంటి స్టార్టప్‌లనూ ఉన్నాయి. తన యాప్కోసం రాజోషి పనిచేసిన తీరును చూసిన ఓ స్నేహితుడు సాయమడిగాడు. అది విజయవంతం కావడంతో ఇతర డెవలపర్లు సాయంతో. కొన పనిచేశాక దీన్నే వ్యాపారంగా మలచాలన్న ఆలోచన వచ్చింది రాజోషికి అలా 2017లో 'హసుర' ప్రారంభమైంది. కన్సల్టేషన్, అప్లికేషన్ తయారీ వంటివన్నీ చేసిస్తుందీ సంస్థ. యాప్ డెవలప్‌మెంట్‌ని సులభతరం చేయడం అన్న వీళ్ల కాన్సెప్ట్ చాలా సంస్థలను ఆకర్షించింది. దీంతో వాళ్ల సేవలకు డిమాండ్ పెరిగింది. టెక్ రంగంలో అమ్మాయి. సందేహాలు సాధారణమే దీంతో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు రాజోషి. వాటన్నింటికీ ఓపికగా సమాధానాలు చెప్పుకొంటూ వచ్చారు. సంస్థల నమ్మకం సంపాదించారు. అలా చాలా సాదాసీదాగా ప్రారంభమైన హసుని ఇన్నోవేషన్ విభాగంలోనే అత్యుత్తమ ఆలోచనగా తీర్చిదిద్దారు. ఎన్నో అవార్డులు అందుకోవడమే కాదు, 2022లో 'యూనికార్న్' హోదాకీ చేర్చారు. □

# వేసవిలో అందం సౌకర్యం

ఫ్యాషన్ ఫ్యాషన్




వేసవి కాలంలో వేడికి వదులైన దుస్తులు ఇచ్చే హాయే వేరు. ఎంత సంప్రదాయాలకు విలువిచ్చే అమ్మాయైనా ఈ సమయంలో షార్ట్ హ్యాండ్స్, స్లీవ్‌లెస్‌ని మెచ్చక మానడం అంటే అతిశయోక్తి కాదు. ఈ హాయి అవసరాన్ని సూచించింది కాబట్టే, ఫ్యాషనిస్టులు ఈ లేయర్డ్ కుర్తీలు, డ్రెస్‌లను తీసుకొచ్చారు. నెట్, జార్జెట్, ఆర్గాంజా... ఇలా పలుచగా ఉంటే వస్త్రాలతో దుస్తులను కుట్టించుకోవాలంటే ఏం చేస్తాం? శాటిన్, కాటన్ రకాలను లైనింగ్ వేసుకుంటాం అవునా? ఇక్కడ అలాగే ఉంటుంది. దారాలు లేదా సన్నని పట్టీతో ఇన్నర్ స్లిప్‌ని ఇస్తారు. పైన ట్యూనిక్ తరహాలో టాప్ ఉంటుంది. ఇంట్లో హాయిగా గడిపేందుకు వీలుగా ఉండటంతోపాటు... ఆఫీసు, వేడుకకు సిద్ధమయ్యేటప్పుడు అనువుగా ఉండటం వీటి ప్రత్యేకత. ఆర్గాంజ, చందేరి, కాటన్... ఇలా అనేక వస్త్రశ్రేణుల్లో ఇవి దొరుకుతున్నాయి. స్ట్రెయిట్‌కట్, అనార్కలీ, ఫ్లోర్ లెంత్... అంటూ భిన్న డిజైన్లలో కూడా వస్తున్నాయి. పర్లేదు అనిపించిందా... స్లిప్ మీద గడిపేయొచ్చు. బయటికి అడుగు పెడుతున్నప్పుడు టాప్ని వేసుకుంటే సరి. నిమిషాల్లో లుక్కే మారిపోతుంది. ఆఫీసు, వేసవి సాయంత్రాల వేడుకలు, పిక్నిక్‌లు చాలా చక్కగా నప్పేస్తాయి. సౌకర్యానికి ప్రతిరూపంలా అనిపించట్లేదూ ఈ దుస్తులను చూస్తోంటే? అందానికి అందం అదనం. మరి మీరూ ప్రయత్నించారా... ఈ ఓవర్లీ డ్రెస్... లేయర్డ్ డ్రెస్‌లను? !











# క్యాబేజ్ మంచి పోషకాహారం

క్యాలీఫ్లవర్ లానే క్యాబేజ్ మంచి పోషకాహారం. ఇందులో విటమిన్లు, ఫోలేట్, మాంగనీస్, క్యాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, పీచు, గ్లూకోజ్, ఫ్రక్టోజ్, ఐరన్, భాస్వరం, సోడియం, జింక్, కాపర్, మాంగనీస్, ఇలా అనేక పోషకాలు ఉన్నాయి. క్యాబేజ్ రోగనిరోధకశక్తిని పెంచుతుంది. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు నొప్పి, వాపుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ఇది మంచి బ్యాక్టీరియాను వృది చేస్తుంది. జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. రక్త పోటును నియంతించి, కలెస్ట్రాల్ స్థాయిని క్రమబద్ధం చేస్తుంది. రక్తం గడ్డకట్టకుండా, ఇతరత్రా గుండె జబ్బులు రాకుండా కాపాడుతుంది. ఊబకాయం రానివ్వదు. రేడియేషన్ థెరపీ నుంచి రక్షణ కల్పిస్తుంది. ఎముకలను దృఢంగా ఉంచుతుంది. క్యాన్సర్‌ను సైతం నిరోధిస్తుంది. క్యాబేజ్ రుచికరమే అయినపనపటికీ.. ఒక్కో సీజన్‌లో కాస్త వెగటు వాసన వస్తుంది. అలాంటప్పుడు కూర దించే ముందు అరకప్పు పాలు పోస్తే ఆ వాసన పోవడమే కాకుండా అదనపు రుచి వస్తుంది. కొందరు కూరల్లో గ్రేవీ కోసం ఉల్లికి బదులుగా క్యాబేజ్ వాడుతున్నారు. దీన్ని కూరగానే కాదు.. సలాడ్, సూప్ రూపాల్లోనూ తినొచ్చు. దీంతో చేసే పకోడీ సూపర్‌గా ఉంటుంది. క్యాబేజ్‌లో బ్రసెల్స్, కింగ్ క్యాబేజ్, ఆకుపచ్చ, ఎరుపు, ఊదా రంగుల క్యాబేజ్ ఇలా చాలానే రకాలున్నాయి. బలాన్నీ ఆరోగ్యాన్ని ఇచ్చే క్యాబేజ్‌ని తరచూ తిందామా మరి! □

ఆరోగ్య భాగ్యం

# కండరాల క్షయ



**డాక్టర్ కె.ఉమాదేవి**
**తిరుపతి**

మస్కులార్ ట్యూబర్క్యులోసిస్ (ఎంటి) మన శరీరంలో 600 కంటే ఎక్కువ కండరాలున్నాయి. ఒక కండరం వేలకొద్దీ సాగే ఫైబర్‌లతో కలిసి గట్టిగా ఉండి పెరిమిసియం అనే సన్నని పారదర్శక పొరతో చుట్టబడి ఉంటుంది. ప్రతి కండరానికి కండర తంతువులు నిర్మాణాత్మక ప్రమాణాలని చెప్పవచ్చు. ఇవి శరీరానికి మద్దతు, రక్షణ, వేడి, రక్త ప్రసరణ అందిస్తాయి. ఇది లాటిన్ పదం మస్కులస్ నుండి వచ్చింది. దీని అర్థం మౌస్. మన శరీరంలో కండరాలు 3 రకాలుగా ఉంటాయి.

**అస్థి కండరాలు :** వీటినే మస్క్యులో స్కెలిటల్ సిస్టమ్, లోకోమోటర్ సిస్టమ్ కండరాలు, స్ట్రైటెండ్ కండరాలు, స్వచ్ఛంద కండరాలు, చారల కండరాలు, సంకల్ప కండరాలు అని అంటారు. ఇవి ఎముకలకి కలుపబడి / అతకబడి ఉండడం వల్ల దీన్ని అస్థికండరాలంటారు. ఇవి శరీర బరువులో 40-50% దాకా ఉంటాయి. **మృదువైన కండరాలు :** వీటినే అసంకల్పిత కండరాలు, విసరల్ కండరాలు, నున్నని కండరాలంటారు. ఇవి మన చేతన అవగాహన లేకుండానే వీటి కదలిక ఉంటుంది. వీటితో మూత్రాశయం, జీర్ణాశయం, గర్భాశయం, ధమనులు, సిరలు, రక్త నాళాలు ముఖ్యమైనవి.

**గుండె కండరాలు :** వీటినే కార్డియాక్ కండరాలు అంటారు సంకోచ వ్యాకోచాలికి అనుగుణంగా, అసంకల్పితంగా ఇవి పనిచేస్తాయి. ఈ కండరాల్లో ఒకటి లేదా అంతకన్నా ఎక్కువ కండరాలకి క్షయవ్యాధి సోకితే దాన్ని కండరాల క్షయ లేదా మస్కులార్ క్షయ అంటారు. ఇది అరుదుగా అంటే 1-3% కేసుల్లో కీళ్లు, వెన్నెముక, ఎముకలు,లింఫ్‌నోడ్ ఇన్ఫెక్షన్ నుండి వ్యాపిస్తుంది. ఇది పురుషులకన్నా స్త్రీలలో ఎక్కువగా (2:17) కన్పిస్తుంది. ఇది 34-58 సంవత్సరాల మధ్య వయస్కుల్లో ఎక్కువగా కన్పిస్తుంది. ఇది ఆసియా, ఆఫ్రికవంటి దేశాల్లో 73.68% మందిలో కన్పిస్తుంది. ఇది ఎక్స్‌ట్రా పల్మోనరీ టి.బి. వల్ల వస్తుంది. కండరాలలో లాక్టిక్ ఆసిడ్ ఎక్కువగా ఉండడం, అధిక రక్త సరఫరా, రెటిక్యులూ ఎండోథీలియల్ మరియు లింఫాటిక్ కణజాలం తక్కువగా ఉండడం వల్ల కండరాల క్షయ వచ్చే ఆస్కారముంది. ఇది 1-5% మందిలో ఎక్కువగా ఛాతీ కండరాల్లో కన్పిస్తుంది. అంతేగాకుండా తోడలు, చేతులు, ఛాతీ,నుదురు, పిక్క కండరాలు, పిరుదులు ఎఫెక్ట్ అవుతాయి. ఇది ఒక చోట లేదా అనేక చోట్ల కన్పిస్తుంది. ఇది శరీరంలో ఒక ప్రక్కన లేదా రెండు ప్రక్కలా కన్పించవచ్చు. క్షయ కండరాల వ్యవస్థని ప్రభావితం చేసినప్పుడు కొత్త ఎముక ఏర్పడకుండా (ఫ్లోరోసిస్) చేయడమే కాకుండా ఇన్ఫెక్షన్ కండర తంతువులకి వ్యాపించడం వల్ల పారాస్పైనల్, కండరాల్లో గడ్డలు ఏర్పడతాయి. ఇవి చూడ దానికి ఒక్కోసారి మస్కులాల్ ట్యూమర్‌లాగా కన్పిస్తాయి. దీన్నే మస్కులాల్ టి.బి. ఎమ్‌టిమజిల్ టి.బి. మస్కులోసెనకలిటల్ టి.వి. స్కెలిటల్‌మజిల్ టి.బి. ట్యూబర్క్యులర్ మయోసైటిస్, ట్యూబర్క్యులార్ పాలీ మయోసైటిస్, ట్యూబర్క్యులార్ పయో మయోసైటిస్, అస్థిపంజర కండర క్షయ అని వివిధ పేర్లతో వ్యవహరిస్తారు. యుఎస్‌లో వీరిశాతం 10 దాకా ఉంటుంది. దాదాపు 40,000 కేసుల్ని యుక్తవయస్సు వారిలో ఎక్కువగా గుర్తించడం జరిగింది. భారత్‌లో 194 కేసుల్ని గుర్తించడమైనది వీటిలో 54% వెన్నెముక, 26% కీళ్ళు, 13% పిక్కలు, 8 తుంటి, 9% మణికట్టు, 4% మృదు కండరాలలో గుర్తించడమైనది.



**కారణాలు :** ఎండమిక్ ఏరియాలో వలసలు పోయే వారిలో విదేశీ ప్రయాణాలు చేసేవారిలో, రోగనిరోధకశకినత తకునకవగా ఉన్న హెచ్ఐవి కొవిడ:-19, కేన్సర్, డయాబెటిస్, కిడ్నీ వ్యాధిగ్రస్తుల్లో ఎక్కువగా కన్పిస్తుంది. పోషకాహార లోపం ఉననవారిలో ఇమ్యూనిటీని దెబ్బతీసే స్టీరాయిడ్స్, ఆంటి బయాటిక్ మందుల వల్ల,ఆటో ఇమ్యూన్ డిసీజెస్, రుమటాలజికల్ వ్యాధులతో బాధ పడేవారిలో, ఉపరి తిత్తుల వ్యాధులునన్నవారిలో కండరాలక్షయ ఎకునకవగా వచ్చే ఆస్కార ముంది. □

# మధ్య రాత్రి ఆకలా ?



మధ్య రాత్రిలో ఎక్కువగా ఆకలేస్తుంటుంది. లేచి ఏదో ఒకటి తినాల్సిందే. కొన్నిసార్లయితే భోజనం చేసిన గంటకే మళ్లీ తినాలనిపిస్తుంది. కొందరికి చాక్లెట్లూ, స్వీట్లూ తినందే నిద్రపట్టదు. దీనంతటికీ జీవనశైలిలో మార్పులే కారణం అంటున్నారు నిపుణులు.

✦. ఆకలికి కారణమైన హార్మోన్లలో లెప్టిన్ ఒకటి నిద్రలేమితో బాధపడుతున్న వారిలో ఇది ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. దాంతో పెరుగుతుంది. మెలటోనిన్, కార్టిసాల్ స్థాయిలు పెరగడం లేదా కొన్ని అకలిని ప్రభావితం చేస్తాయి. దీనివల్లే కాన్నో హైడ్రేల్స్ తినాలనే కోరికా పెరుగుతుందట. అందుకే కొందరికి స్వీట్ తింటే కానీ నిద్రపట్టదు.

✦ చాలామంది ఉదయం అల్పాహారం తినరు: మధ్యాహ్న భోజనమూ అరకొరే సరైన సమయాన్నీ పాటించను. జంక్ లేదా పోషకాలు తక్కువ ఉండే ఆహారాన్ని తింటారు. అలాంటి వారికి రాత్రుళ్లు ఎక్కువగా ఆకలి అనిపిస్తుంది.

✦ నిద్రపోయేముందుస్క్రోలింగ్ చేయడం కూడా రాత్రివేళ ఎక్కువగా తినడానికి కారణమవుతుంచు కాబట్టి ఈ అలవాట్లని సరిచేసుకుంటే ఆకలిని నియంత్రించుకోగలం. □

# జ్ఞానప్రదాత

జ్ఞానప్రదాత దత్తాత్రేయుని రూపం అపురూపమైంది. అది సచ్చిదానంద రూపం. జడలు కట్టడం, పులిచర్మాన్ని ధరించటం వైరాగ్యం, తపస్సు, ధ్యానాలకు గుర్తు, భూమాతకు, ధర్మానికి ప్రతీక అయిన గోవు ఆయనను వెన్నంటే ఉంటుంది. అటే దత్తాత్రేయుడు ధర్మరక్షకుడని, గోరక్షకుడని తేటతెల్లమవుతుంది. వారి వెంట ఉండే నాలుగుశునాకాలు చతర్వేదాలకు నిదర్శనం.అలాగే స్వామి భస్మధారణ నిరాడంబరత్వానికి, అక్షమాల జప ప్రాధాన్యానికి చిహ్నాలు. అందుకే ఆ దివ్యమూర్తిని మన మహర్షులు, భక్తులు. సకల ధర్మాలూ అడు గంటి పోయి, ఏం చేయాలో తెలియని అయోమయ స్థితి ఆవరించిన కలియుగంలో దత్తాత్రేయుని ఆశ్ర యించి శరణు వేడటమే కర్తవ్యమని గ్రహిస్తారు. పురాణ కథను అనుసరించి ఒకసారి చతుర్ముఖ బ్రహ్మ వేదాలను మర్చిపోతే దత్తాత్రేయుడే ఆయనకు వేదదానం చేశాడు. మరొకప్పుడు జంభాసురుడనే రాక్షసుడి బాధ నుంచి దేవతలను ఆ స్వామే రక్షించాడు. కార్త వీర్యార్జునుడు దత్తుడి కోసం తపస్సు చేసి వెయ్యి చేతులు, నిత్యయౌవనం వరాలుగా పొందాడు. అదే విధంగా ప్రహ్లాదుడికి ముని రూపంలో ప్రత్యక్షమై ఆత్మజ్ఞానాన్ని బోధించాడు. ఇలా అనంత కరుణాసముద్రుడై భక్తులకు జ్ఞానం, ఆనందం ప్రసాదించిందే దత్తాత్రేయ అవతారం. అందుకే అన్నమయ్య కూడా తిరుమల కొండపై ఏడుకొండల స్వామిలో దత్తాత్రేయుని దర్శించుకుని కీర్తనలతో స్తుతించాడు. దత్తాత్రేయుని రెండో అవతారం శ్రీనరసింహ సరస్వతి. అంబ అనే భక్తురాలికి కుమారుడిగా ఆవిర్భవించిన రూపమిది. ఆ మహానుభావుడి మూడో అవతారం మాణిక్‌ప్రభు. దత్తుడి మరో రెండు అవతారాలు అక్కల్‌కోట మహారాజు, శిరిడీ సాయిబాబా. ఈ రెండు అవతారాల నుంచే దత్తావతారులు అవధూత మార్గాన్ని అనుసరించటం ఆరంభమైంది. అవధూత అంటే శరీరం మీద ఆచ్ఛాదనతో సహా లౌకిక బంధాలన్నీ వదిలిన సన్యాసి. అందుకే వీరి తల్లి దండ్రుల వివరాలు, పుట్టిన తేదీ, ప్రదేశం తదితర వివరాలు అలభ్యం. ఇది దత్తాత్రేయ స్వామి అవతార లీల. □

ఆధ్యాత్మికం

# నిమ్మగడ్డితో అజీర్తి దూరం !



టీ, కాఫీల స్థానంలో ఏదైనా మేలు చేస్తే పానీయం తాగాలనుకుంటున్నారా? అయితే నిమ్మగడ్డిని మించిన ప్రత్యామ్నాయం లేదు. ఎందుకంటే దీనితో చేసిన టీ.. వేసవిలో చక్కని ఉపశమనం ఇవ్వడంతోపాటు అనేక ప్రయోజనాలను అందిస్తుంది..నిమ్మగడ్డిని నీళ్లలో వేసి మరిగించి ఆ టీ తీసుకుంటే. అజీర్ణం, కడుపు నొప్పి, గ్యాస్ట్రిక్, అల్సర్ల నుంచి ఉపశమనం లభిస్తుంది. జీర్ణాశయంలోని సున్నితమైన పొరల్ని రక్షిస్తుంది. . వేసవిలో చెమట రూపంలో శరీరం కోల్పోయిన పోషకాలను ఈ టీ తిరిగి అందించి వికారం వంటి సమస్యలు రాకుండా చూస్తుంది. అధిక బరువుతో బాధపడేవారు నిమ్మరసంతో కలిపి తీసుకుంటే ప్రయోజనం ఉంటుంది. కొలెస్ట్రాల్ స్థాయులను పెరగకుండా చూస్తుంది.. నిమ్మగడ్డిని మరిగించి ఆ నీటిని తల స్నానానికి వాడితే చుండ్రు అదుపులో ఉంటుంది.. అయితే గర్భధారణ సమయంలో, పాలిచ్చే తల్లులు ఈ నిమ్మగడ్డిని తీసుకోకపోవడమే మంచిది. □

# ఐపిఎల్‌లో బ్యాటింగ్ దూకుడు



## 4 బంతుల్లో బౌండరీలు

## ఒక్కో ఓవర్లలో 20 కంటే మించి రన్స్

## గత సీజన్ కంటే మించిన రికార్డులు

**న్యూఢిల్లీ:** గత ఐపిఎల్‌లో కనిపించిన అద్భుత రికార్డులు, ఉత్కంఠ మ్యాచ్‌లు ఈ కొత్త సీజన్ లోనూ దానికి మించిన నమోదవుతున్నాయి. ప్రస్తుత సీజన్‌లోని మొదటి 5-6 మ్యాచ్‌లలో ఇది నిజమని నిరూపితమైంది. ఈ 2025 ఐపిఎల్‌లో, గత సీజన్ కంటే తక్కువ బంతుల్లో సిక్సర్లు, ఫోర్ల మెత మోగుతోంది. దీంతో పాటు, పవర్‌ప్లేలో రన్ రేట్ కూడా టోర్నమెంట్ చరిత్రలో అత్యధికంగా మారింది. కోల్‌కతా నైట్ రైడర్స్ వర్సెస్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య మ్యాచ్‌తో ఐపీఎల్ ప్రారంభమైంది. బెంగళూరు జట్టు 175 పరుగుల లక్ష్యాన్ని కేవలం 98 బంతుల్లోనే ఛేదించింది. ఈ మ్యాచ్‌లో 15 సిక్సర్లు, 39 ఫోర్లు వచ్చాయి. ఈ సీజన్‌లో రెండో మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 286 పరుగులుచేసింది. ఇదిటోర్నమెంట్ చరిత్రలో రెండవ అత్యధిక స్కోరు. ఇషాన్ కిషన్ కేవలం 45 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ కూడా 240కి పైగా పరుగులు చేసింది. ప్రతి 4 బంతులకు ఓ బౌండరీ, ప్రతి 10 బంతులకు సిక్స్ టోర్నీ రికార్డుల మోత మోగుతుండటంతో, గత ఏడాది కంటే బ్యాట్స్‌మెన్‌కు మరింత మెరుగ్గా ఉందని వెల్లడవుతోంది. ఐపీఎల్ 2024, 2025 మొదటి 5 మ్యాచ్‌లను పోల్చి చూస్తే, ఈ సంవత్సరం దాదాపు ప్రతి నాల్గవ బంతి బౌండరీని తాకుతోంది. గత సీజన్‌లో ప్రతి 5.3 బంతులకు ఒక బౌండరీ కొట్టగా, ఈ ఏడాది అది ప్రతి 3.9 బంతులకు ఒక బౌండరీగా మారిందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అలాగే ఈసారి ప్రతి 9.7 బంతులకు ఒక సిక్సర్ కొడుతున్నారు. అయితే 2024లో ప్రతి 13.7 బంతులకు ఒక సిక్సర్ బాదేస్తున్నారు. గత సీజన్‌లో 5వ మ్యాచ్ వరకు 87 సిక్సర్లు కొట్టగా, ప్రస్తుత ఐపిఎల్‌లో అదే సమయానికి ఈ సంఖ్య 119 సిక్సర్లకు చేరుకుంది. మరోపక్క 2024లో 136 ఫోర్లు కొట్టగా, ఈసారి 146 ఫోర్లుకొట్టబడ్డాయి. అలాగే పవర్‌ప్లేలో అద్భుతమైన బ్యాటింగే కాకుండా, రన్ రేట్ కూడా చాలా పెరిగింది. ముఖ్యంగా మొదటి 6 ఓవర్లలో అంటే పవర్ ప్లేలో రన్ రేట్‌లో విపరీతమైన పెరుగుదల కనిపించింది. గత సీజన్ మొదటి 5 మ్యాచ్‌ల్లో పవర్ ప్లే సగటు రన్ రేట్ 8.76గా ఉంది. కానీ ఈసారి అది నేరుగా 11.35కి పెరిగింది. దీంతో ఈసారి బ్యాట్స్‌మెన్స్ మరింత దూకుడుగా వ్యవహరిస్తుండటంతో, బౌలర్లకు మార్గం చాలా కష్టంగా మారుతోందనేది అర్థమవుతోంది. ఇక మిడిల్ ఓవర్లలో కూడా రన్ రేట్ 7 నుంచి 16కి పెరిగింది. గత సీజన్‌లో ఇది 8.25గా ఉండేది. కానీ, ఇప్పుడు అది ఓవర్‌కు 9.64 పరుగులుగా మారింది.


కాగా ఇప్పుడు చాలా తక్కువ బంతుల్లోనే సిక్సర్లు, ఫోర్లు బాదుతుంటే, రన్ రేట్ పెరగడం సహజం. ఇది ఒక ఓవర్ నుంచి వచ్చే పరుగుల సంఖ్యను కూడా ప్రభావితం చేస్తోంది. ఈ 18వ సీజన్‌లో, కేవలం 5 మ్యాచ్‌ల్లోనే ఇలా 20 సార్లు జరిగింది. బ్యాట్స్‌మెన్ ఒకే ఓవర్‌లో 20 లేదా అంతకంటే ఎక్కువ పరుగులు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఈ సంఖ్య గత సీజన్‌లో 5 మ్యాచ్‌ల్లో 8 ఓవర్లకు మాత్రమే ఉంది. ఈ క్రమంలో బౌలర్లు ఎలాంటి ప్లాన్స్‌తో సిద్ధమవుతారో చూడాలి.



రితికా



ముస్కాన్



మాన్సీ

### రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో..

## దుమ్ము రేపిన మహిళా రెజ్లర్లు

### రితికాకు రజతం, ముస్కాన్, మాన్సీకి కాంస్యాలు

**న్యూఢిల్లీ:** ఏషియన్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ మహిళా రెజ్లర్లు దుమ్మురేపారు. జోర్డాన్‌లోని అమ్మాన్‌లో జరిగిన మహిళల 76 కిలోల విభాగంలో యువ రెజ్లర్ రీతికా హుడా రజతం దక్కించుకోగా, 59 కిలోల కేటగిరీలో ముస్కాన్, 68 కిలోల విభాగంలో మాన్సి కాంస్యాలు నెగ్గి భారత్‌కు ఒకే రోజు మూడు పతకాలు అందించారు. 22 ఏండ్ల రీతికా సెమీస్‌లో 10-0తో జపాన్ రెజ్లర్ నొడొక్ యమమొటొను మట్టి కరిపించి పసిడి పోరుకు అర్హత సాధించింది. హోరాహోరిగా జరిగిన ఫైనల్ పోరులో రీతికా 6-7తో కిర్గిస్థాన్ రెజ్లర్ ఐపెరి మెడెట్ చేతిలో ఓటమిపాలై రజతంతో సరిపెట్టుకుంది. ఇక మరో భారత్ రెజ్లర్ ముస్కాన్ విషయానికి వస్తే ఆరంభ బౌట్‌లో ఫిలిప్పీన్స్‌కు చెందిన అరియన్‌ను ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరింది. క్వార్టర్స్ ఫైనల్స్‌లో ఆమె జపాన్ రెజ్లర్ సకురా ఒనిషి చేతిలో ఓడినా రెపిచేజ్ ద్వారా కాంస్య పోరుకు దూసుకెళ్లింది. కీలక నిర్ణయాత్మక పోరులో ముస్కాన్ 4-0తో మంగోలియాకు చెందిన అల్టిజిన్‌ను ఓడించి కాంస్యం సాధించింది. ఇంకో భారత్ రెజ్లర్ మాన్సి కాంస్య పోరులో 12-2తో కజకిస్థాన్‌కు చెందిన ఇరినా కజ్యులినాపై టెక్నికల్ సుపిరియారిటీతో గెలిచి పతకం సొంతం చేసుకుంది.

## పోరాడి ఓడిన యూకీ జోడీ



**న్యూఢిల్లీ:** రెండు వారాల క్రితం ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరిన భారత అగ్రశ్రేణి ఆటగాడు యూకీ బాంబ్రీ ఆఅడ్డంకిని అధిగమించలేక పోయాడు. ఫ్లోరిడాలో జరిగిన పురుషుల డబుల్స్ విభాగం క్వార్టర్ ఫైనల్లో యూకీ బాంబ్రీ (భారత్)-పోర్చుగల్‌కు చెందిన నూనో బోర్జెస్ ద్వయం 6-7 (1/7), 6-3, 8-10తో సూపర్ టైబ్రేక్‌లో ఆరో సీడ్, బ్రిటన్‌కు చెందిన లాయిడ్ గ్లాస్‌పూల్-జూలియన్ క్యాష్ జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది. 90 నిమిషాల పాటు జరిగిన ఈమ్యాచ్‌లో యూకీ-బోర్జెస్ నాలుగు ఏస్‌లుసంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోకుండా రెండో సెట్లో ప్రత్యర్థి జంట సర్వీస్‌ను ఒక్కసారి బ్రేక్ చేశారు. మరోవైపు గ్లాస్పూల్-జూలియన్ క్యాష్ తొమ్మిది ఏస్‌లు సంధించడంతో పాటు, నిర్ణాయక సూపర్ టైబ్రేక్‌లో కీలక దశలో పాయింట్లు నెగ్గి సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నారు. ఇక క్వార్టర్ ఫైనల్లో ఓడిన యూకీ-బోర్జెస్ జోడీకి 65,000 డాలర్ల (రూ.55లక్షల73 వేలు) ప్రైజ్ మనీతో పాటు 180 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



### ఓపెన్ టెన్నిస్ టోర్నీలో..

## అలెగ్జాండ్రా సంచలనం

### వరల్డ్ 2వ ర్యాంకర్ స్వియాటెక్‌పై విజయం

**న్యూఢిల్లీ:** అనామకురాలిగా బరిలోకి దిగి, రౌండ్ రౌండ్‌కూ సంచలనాలు సాధిస్తున్న ఫిలిప్పీన్స్ టీనేజర్ అలెగ్జాండ్రా ఇయాలా, మయామి ఓపెన్ ఉమెన్స్ టెన్నిస్-1000 ప్రీమియర్ టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఫ్లోరిడాలో జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 140వ ర్యాంకర్ ఇయాలా 6-2,7-5తో ప్రపంచ రెండో ర్యాంకర్, ఐదు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన పోలాండ్ స్టార్ ప్లేయర్ ఇగా స్వియాటెక్‌ను బోల్తా కొట్టించి సంచలనం సృష్టించింది. 1 గంట 37 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇయాలా ప్రత్యర్థి సర్వీస్‌ను ఎనిమిది సార్లు బ్రేక్ చేసి, తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయింది. 19 ఏళ్ల ఇయాలా గత ఏడేళ్లుగా స్పెయిన్‌లోని రాఫెల్ నాదల్ అకాడమీలో శిక్షణ తీసుకుంటోంది. ఈ టోర్నీలో వైల్డ్ కార్డుతో అడుగుపెట్టిన ఇయాలా రెండో రౌండ్‌లో 2017 ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ జెలెనా ఒస్టాపెంకో (లాత్వియా)పై 7-6 (7/2), 7-5తో గెలుపొందగా, మూడో రౌండ్‌లో 6-4, 6-2తో ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్, ఐదో సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా)ను కంగుతినిపించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఇయాలాకు పదో సీడ్ పౌలా బదోసా (స్పెయిన్) నుంచి వాకోవర్ లభించింది.

ఈ సందర్భంగా ఇయాలా మాట్లాడుతూ నమ్మశక్యంగా లేదు. నా సంతోషాన్ని మాటల్లో వర్ణించలేను. నా జీవితంలోనే ఇది గొప్పవిజయం అని వ్యాఖ్యానించింది. కాగా సెమీఫైనల్లో ఐదో సీడ్, అమెరికాకు చెందిన జెస్సికా పెగూలాతో ఆడనున్న ఇయాలా ఇందులో కూడా విజయం సాధిస్తే మయామి ఓపెన్లో వైల్డ్ కార్డుతో బరిలోకి దిగి ఫైనల్ చేరుకున్న తొలి క్రీడాకారిణిగా గుర్తింపు పొందుతుంది.



### ఆసియా కప్ మహిళల ఫుట్‌బాల్..

## గ్రూప్ బిలో భారత్ టీమ్

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ మహిళల ఫుట్‌బాల్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్ డ్రా విడుదలైంది. భారత జట్టుకు గ్రూప్ బి లో చోటు లభించింది. మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో డ్రా కార్యక్రమం జరిగింది. ఆసియా కప్ క్వాలిఫయింగ్ టోర్నీలో గ్రూప్ బి మ్యాచ్‌లకు జూన్ 23 నుంచి జూలై 5 వరకు థాయ్‌లాండ్ ఆతిథ్యమిస్తుంది. భారత్ తో పాటు, థాయ్‌లాండ్, మంగోలియా, తిమోర్లెస్తె, ఇరాక్ జట్లు గ్రూప్ బి లో ఉన్నాయి. గ్రూప్ విజేతవచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో జరిగే ఆసియా కప్ ప్రధాన టోర్నమెంట్‌కు అర్హత సాధిస్తుంది. మొత్తం 34 జట్లను ఎనిమిది గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ ఎ, గ్రూప్ బి లలో ఐదు జట్ల చొప్పున ఉన్నాయి. మిగతా ఆరు గ్రూపుల్లో నాలుగు జట్ల చొప్పున ఉన్నాయి. మొత్తం ఎనిమిది గ్రూప్‌ల విజేత జట్లు ఆసియా కప్ మహిళల ఫుట్‌బాల్ ప్రధాన టోర్నమెంట్‌కు అర్హత సాధిస్తాయి. ఆతిథ్య ఆస్ట్రేలియాతో పాటు, 2022 ఆసియా కప్‌లో తొలి మూడుస్థానాల్లో నిలిచిన చైనా, కొరియా, జపాన్ జట్లు ఇప్పటికే ఆసియా కప్-2026 టోర్నమెంట్‌కు నేరుగా అర్హత పొందాయి.

## వాట్సాప్ మేసేజ్‌లతో రూ.90 కోట్లు రికవరీ

**న్యూఢిల్లీ, మార్చి 28:** పన్ను ఎగవేతదారులు, ఆర్థిక నేరగాళ్లపై ఉక్కు పాదం మోపేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అందులో భాగంగా ఎన్‌క్రిప్టెడ్ సందేశాలు, ఇ-మెయిల్స్‌ను యాక్సెస్ చేసే వెసులుబాటును పన్ను అధికారులకు కల్పించే ఆదాయపు పన్ను బిల్లు 2025ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్థించారు. అక్రమ సిండికేట్ నుంచి రూ.90 కోట్లకుపైగా క్రిప్టోకరెన్సీకి సంబంధించిన ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి వాట్సాప్ సందేశాలను డీక్రిప్ట్ చేయడం ఎంతో తోడ్పడిందని గుర్తుచేశారు. కొత్త ఆదాయ పన్ను బిల్లులోని నిబంధనలపై పార్లమెంట్‌లో ఆమె మాట్లాడారు. ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ ఛానళ్ల దుర్వినియోగం పెరుగుతోందని, మనీలాండరింగ్, పన్ను ఎగవేత వంటి కార్యకలాపాల కోసం నేరగాళ్లు వాట్సాప్ వంటి ప్లాట్‌ఫామ్‌లను ఎక్కువగా ఆశ్రయిస్తున్నారని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. 1961 ఆదాయపు పన్ను చట్టంలో ఫిజికల్ బుక్స్ ఆఫ్ అకౌంట్, లెడ్జర్లు, మాన్యువల్ రికార్డుల గురించే ప్రస్తావించారు. డిజిటల్ రికార్డులను ప్రస్తావించలేదు. ఫిజికల్ లెడ్జర్లను చూపించినప్పటికీ డిజిటల్ రికార్డులు ఎందుకు అవసరమని కొందరు ప్రశ్నించవచ్చు. అయితే ఇది ఎంతో అవసరం. ఈ రెండింటి మధ్య లోటును పూడ్చడమే కొత్త బిల్లు లక్ష్యం అని ఆమె పార్లమెంట్‌లో అన్నారు. ఎన్‌క్రిప్టెడ్ మెసేజ్‌లు, మొబైల్ ఫోన్లలోని వివరాలు స్కాన్ చేయడం ద్వారా ఆదాయపు పన్ను అధికారులు ఇప్పటికే రూ.250 కోట్లు లెక్కల్లోకి రాని నిధులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రూ.200 కోట్ల బోనస్ బిల్లులకు పాల్పడిన సిండికేట్లు, తప్పుడు పత్రాలతో భూముల అమ్మకంలో మూలధన లాభాలను తారుమారు చేసిన ఉదంతాలున్నాయి. ఇవి వాట్సాప్ ద్వారా బట్టబయల య్యాయి. లెక్కల్లోకి రాని లావా దేవీలను ట్రాక్ చేయడానికి గూగుల్‌మ్యాప్స్ హిస్టరీలను కూడా ఉపయోగించాం. బినామీ ఆస్తులను గుర్తించడానికి ఇన్‌స్టాగ్రామ్‌లోని ప్రొఫైల్స్ సహాయపడ్డాయి అని ఆమె అన్నారు. అయితే ఎన్‌క్రిప్టెడ్ సందేశాలు ఎలాయాక్సిస్ అయ్యాయో మాత్రం ఆమె వివరించలేదు. ప్రపంచవ్యాప్తంగా మూడు బిలియన్ల మంది యూజర్లు ఉన్నారని చెప్పుకునే మెటా యాజమాన్యంలోని వాట్సాప్ కేంద్ర ప్రతిపాదిత చట్టంపై స్పందించలేదు. మెటా ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ సందేశాలను షేర్ చేసుకునేందుకు వీలు కల్పిస్తుంది. అంటే మీరు కమ్యూనికేట్ చేస్తున్న వ్యక్తికి, మీకు మధ్య వ్యక్తిగత సందేశాలను షేర్ చేస్తుంది. దీన్ని సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఎవరూ చదవలేరు. వినలేరు. షేర్ చేయలేరని కంపెనీ గతంలోతెలిపింది. కానీ ఈడేటాను ప్రభుత్వం ఎలా ఉపయోగించిందో తెలియాల్సి ఉంది.



## బ్రిటన్‌కు లక్ష్మీ మిట్టల్ గుడ్‌బై!

**లండన్, మార్చి 28:** ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆర్సెలార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్ మూడు దశబ్దాలుగా అక్కడే నివసిస్తోన్న ఆయన కొత్త ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బ్రిటన్‌ను వీడాలని అనుకుంటున్నట్లు సమాచారం. ఆయనతో పాటు పలువురు సంపన్నులు కూడా అదే యోచనలోఉన్నారు. నాన్‌డోమ్ పన్ను విధానాన్ని రద్దు చేయాలని బ్రిటన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ పన్ను విధానం కింద యూకే నివాసితులు విదేశాల్లో సంపాదించిన ఆదాయంపై బ్రిటన్ ప్రభుత్వానికి ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. 226సంవత్సరాల నుంచి ఈ పన్ను వెసులుబాటు ఉంది. అయితే ఇప్పుడు ఈవిధానాన్ని తొలగించాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. ఇది అక్కడ నివాసం ఉంటున్న సంపన్నులను ఆలోచనలో పడేసింది. వారు యూకేను వీడి పన్ను మినహాయింపులకు స్వర్గధామంగా ఉండే ఇతర దేశాలపై దృష్టిసారించేలా చేసింది. ఈ జాబితాలో ఉన్న స్టీల్‌దిగ్గజం లక్ష్మీమిట్టల్ ఈ ఏడాదిలోపు తుది నిర్ణయం తీసుకొనే అవకాశం ఉందని మీడియా కథనం పేర్కొంది. సండే టైమ్స్ రిచ్ లిస్ట్ గత ఏడాది విడుదల చేసిన జాబితా ప్రకారం మిట్టల్ సంపద 14.9 బిలియన్ పౌండ్లుగా ఉంది. ఆ జాబితాలో ఆయన ఏడో స్థానంలో నిలిచారు. ఐరోపా,అమెరికాలో ఆయనకు ఎన్నో విలువైన ఆస్తులు ఉన్నాయి. లండన్‌లోని ప్రఖ్యాత కెన్సింగ్టన్ ప్యాలెస్ గార్డెన్స్ ప్రాంతంలో ఆయనకు ఒక విలాస భవంతి ఉంది. ప్రస్తుతం ఆయన దుబాయ్‌లో పెట్టుబడులు పెడుతున్నారని ఆ కథనం వెల్లడించింది. ప్రస్తుతం యూకేలో పన్నుమినహాయింపులు రద్దు చేయడంతో ఇప్పుడు లక్ష్మీ మిట్టల్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, స్విట్జర్లాండ్, ఇటలీలో ఏదోఒకదానికి మకాం మార్చాలనుకుంటు న్నారని తెలుస్తోంది. స్టీల్ ఉత్పత్తిలో ఆర్సెలార్ మిట్టల్ ప్రపంచంలోనే రెండోస్థానంలో ఉంది. 24బిలియన్ యూరోలవిలువైన ఆ సంస్థలో మిట్టల్ కుటుంబానికి 40శాతం వాటాఉంది. 2021లోలక్ష్మీమిట్టల్ సీఈఓగా దిగిపోవడంతో ఆయన కుమారుడు ఆదిత్య మిట్టల్ ఆ బాధ్యతలు స్వీకరించారు. అయితే సంపన్నులు దేశాన్ని వీడటం ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుందని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే, బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్ అక్షతా మూర్తికి ఈపన్నుల సెగతగిలిన సంగతి తెలిసిందే. ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు నారాయణమూర్తి కుమార్తె అయిన అక్షతామూర్తి, బ్రిటన్‌కు వెలుపల సంపాదించిన సొమ్ముపై పన్నులు చెల్లించట్లేదని సునాక్‌పై ఆయన ప్రత్యర్థులు ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే.



## సోమవారం ప్రత్యేక క్లియరింగ్ సెషన్

**న్యూఢిల్లీ, మార్చి 28:** ఏప్రిల్ ఒకటి నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానున్న వేళ బ్యాంకులకు రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా కీలక ఆదేశాలు జారీచేసింది. మార్చి 31న ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో ఆ రోజు నిర్వహించే ప్రత్యేక క్లియరింగ్ కార్యకలాపాల్లో అన్ని బ్యాంకులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించింది. ఆర్థిక సంవత్సరం ముగితంపు రోజే ప్రభుత్వ ఆదాయం, చెల్లింపులు పూర్తవ్వాల్సి ఉంటుంది. అందుకే ఆ లావాదేవీలు నిర్వహించే బ్యాంకులు విధులు నిర్వర్తించేలా ఆర్‌బిఐ నిర్ణయం తీసుకుంది. ఒక్క బ్యాంకులే కాదు, ఈ నెల 29, 30, 31వ తేదీల్లో దేశవ్యాప్తంగా ఆదాయపు పన్ను విభాగం, సిజిఎస్‌టి కార్యాలయం పనిచేయనున్నాయి. సోమవారం రంజాన్ ఉన్నప్పటికీ, ఈ నెల 31తో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఆయా కార్యాలయాలు పనిచేస్తాయి. పెండింగ్‌లో ఉన్న పన్ను సంబంధిత లావాదేవీలను చెల్లింపుదార్లు పూర్తి చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు బ్యాంకింగ్ వర్గాలు తెలిపాయి.




## వాణిజ్యం

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

### ఈ ఏడాది 5% లాభాలు పంచిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబై, మార్చి 28:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి ట్రేడింగ్ రోజును దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగించాయి. సెన్సెక్స్ 191 పాయింట్లు నష్టపోగా, నిఫ్టీ 72 పాయింట్లు కోల్పోయింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలపై ప్రకటన చేయనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ముఖ్యంగా ఐటి, ఆటో మొబైల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలపై ప్రభావం చూపించింది. సెన్సెక్స్ ఉదయం 77,690.69 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 77,185.62-77,766.70 పాయింట్ల వద్ద ట్రేడయింది. చివరికి సెన్సెక్స్ 191.51 పాయింట్లు నష్టపోయి 77,414.92 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 72.60 పాయింట్లు నష్టపోయి 23,519.35 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.85.48గా ఉంది. ఇండస్ ఇండ్ బ్యాంకు, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, మారుతి సుజుకీ, ఇన్ఫోసిస్ వంటి షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. కోటాక్ మహీంద్రా బ్యాంకు, హిందుస్థాన్ యూనిలీవర్, ఐసిఐసిఐ బ్యాంకు, టాటా మోటార్స్, నెస్లే ఇండియా వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 74 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3077 డాలర్ల వద్ద కొనసాగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివర్లో సూచీలు నష్టాలు ఎదుర్కొన్నప్పటికీ, ఇన్వెస్టర్లకు మాత్రం 5శాతానికిపైగా రెండు సూచీలు ప్రతిఫలాన్ని ఇచ్చాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 7.48శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ 5.4శాతం చొప్పున లాభాలను నమోదు చేశాయి. శని, ఆదివారాలతో పాటు రంజాన్ సందర్భంగా సోమవారం మార్చి 31 మార్కెట్లకు సెలవు.



## 3% తగ్గిన హోమ్ లోన్స్

**ముంబై, మార్చి 28:** గృహ రునాలు డిసెంబరు త్రైమాసికంలో సంఖ్యాపరంగా చూస్తే 9శాతం తగ్గాయి. విలువపరంగా చూస్తే 3శాతం క్షీణించినట్లు క్రెడిట్ బ్యూరో సంస్థ ట్రాన్స్ యూనియన్ సిబిల్ వెల్లడించింది. ఎక్కువ రిస్క్‌తో కూడిన వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డుల్లోనూ రుణాల సంఖ్య తగ్గినట్లు తన తాజా నివేదికలో పేర్కొంది. అన్ సెక్యూర్డ్ రుణాల విషయంలో దూకుడు తగ్గించి, నిదానంగావెళ్లాలంటూ ఆర్‌బిఐ బ్యాంకులు, ఎన్‌బిఎఫ్‌సిలను కొన్ని త్రైమాసికాలుగా సూచించడాన్ని ఈ నివేదిక ప్రస్తావించింది. అదే సమయంలో సెక్యూర్డ్ రుణ విభాగం, ఆర్థిక వ్యవస్థలో ముఖ్య పాత్ర పోషిస్తూ, బ్యాంక్‌లకు కీలకంగా ఉన్న గృహరుణాల్లోనూ స్తబ్దత నెలకొనడాన్ని ఈ నివేదిక ప్రముఖంగా ప్రస్తావించింది. గృహ రుణాల్లో బాకీలు క్రితం యేడాది ఇదే త్రైమాసికానికి 15 శాతంగా ఉంటే, అవి 2024 డిసెంబర్ త్రైమాసికం చివరికి 13శాతానికి తగ్గినట్లు తెలిపింది. రుణవితరణపరంగా 2024 అక్టోబరు- డిసెంబరు కాలం రెండేళ్లలోనే అతి తక్కువ డిమాండ్‌ను చూసినట్లు పేర్కొంది. మెట్రోల్లో రుణ విచారణలు తగ్గాయి. చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో పెరిగాయి. మొదటిసారి రుణ గ్రహీతలు, ప్రధాన కస్టమర్లకు రుణ వితరణ 2023 డిసెంబరు త్రైమాసికంలో 21శాతం ఉంటే, 2024 డిసెంబరు చివరికి 17శాతానికి తగ్గింది. ఎన్‌టిసి రుణ గ్రహీతల్లో 41శాతం మంది జెనరేషన్ జెడ్ వారు కావడం విశేషం. క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణాలు, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రుణాలను వీరు ఎక్కు వగా తీసుకున్నారు.



## బిఎస్ఇ షేర్లు 17% జంప్

**ముంబై, మార్చి 28:** ప్రముఖ స్టాక్ ఎక్స్ఛేంజీ బిఎస్ఇ షేర్లు శుక్రవారం ట్రేడింగ్ సెషన్‌లో పరుగులు పెట్టాయి. ఎఫ్అండ్ఓ కాంట్రాక్ట్‌ల గడువు రోజును మార్చాలనే నిర్ణయాన్ని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ) వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడమే ఇందుకు కారణం. దీంతో బిఎస్ఇ షేర్లు ఇంట్రాడేలో ఏకంగా 17 శాతం పెరిగాయి. వారాంతపు, నెలవారీ, త్రైమాసిక కాంట్రాక్ట్‌ల గడువును గురువారం నుంచి సోమవారానికి మార్చాలని ఎన్ఎస్ఇ తొలుత నిర్ణయించింది. ఈ నేపథ్యంలో సెక్యూరిటీ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) కన్సల్టేషన్ పేపర్‌ను విడుదల చేసింది. గడువు తేదీని మార్చే ప్రణాళికను కొనసాగించవద్దని, ప్రస్తుతానికి యథాతథ స్థితిని కొనసాగించాలని సూచించింది. దీంతో తాజా ప్రణాళికను వాయిదా వేయాలని ఎన్ఎస్ఈ నిర్ణయించుకుంది. ఈ ప్రకటనతో బిఎస్ఇ షేర్లు లాభాల బాట పట్టాయి. ఈ షేర్లు 16.6 శాతం లాభంతో రూ.5,466 వద్ద ట్రేడవుతున్నాయి. ఎఫ్అండ్ఓ కాంట్రాక్ట్‌ల గడువు సోమవారానికి మార్చాలనే ప్రణాళికను ఎన్ఎస్ఈ ప్రకటించిన సమయంలో బిఎస్ఇలో లిక్విడిటీ తగ్గిపోతుందనే భయాందోళనలు నెలకొన్నాయి. ఈ కారణంగా ఆ రోజు ట్రేడింగ్ సెషన్‌లో షేర్లు 9 శాతం కుప్ప కూలాయి. ప్రస్తుతం బిఎస్ఇ కాంటాక్ట్ గడువు మంగళవారం ఉండగా, ఎన్ఎస్ఇ ఎక్స్ పైరీ గురువారంగా ఉంది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.